డిసెంబర్
2016

128

సంపుటి : 11 సంచిక : 7 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

సోషలిజమే ప్రత్యామ్నాయం
ఉమ్మడి పౌరస్మృతిపై సంఘ్ పరివార్ కపట నాటకం
నోట్లు మోదీపాలు - బతుకులు బజారుపాలు
అమెరికాలో ట్రంప్ విజయం : కల్లోల ప్రపంచంలో కొత్త సమస్య
విమర్శ - ఆత్మవిమర్శ
ప్రపంచీకరణ-రాజకీయ పర్యవసానాలు
విద్వేష విషం చిమ్మిన దీనదయాళ్ ఉపాధ్యాయ
కాషాయ ఉడిపిని తాకిన ఉనా మంటలు
ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని పటిష్టం చేయడానికే నోట్ల రద్దు
కమ్యూనిస్టు యోధుడు ఫైడల్‌కాస్ట్రో


నివాళి

# కమ్యూనిస్టు యోధుడు ఫైడల్‌కాస్ట్రో

**ఎ కోటిరెడ్డి**

అమెరికన్ సామ్రాజ్యవాదులకు 90 మైళ్ళదూరంలో ఉండి, సామ్రాజ్యవాదాన్ని సవాలు చేసి, దేశంలో సోషలిజాన్ని నిర్మిస్తూ, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలలో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు నిరంతరం ఉత్తేజాన్ని అందించిన విప్లవ నాయకు డు కామ్రేడ్ ఫైడల్ కాస్ట్రో. 47 సంవత్సరాల పాటు క్యూబాకు ప్రధాన మంత్రిగా, అధ్యక్షునిగా సేవలందించిన ఆ యోధుడు 2016, నవంబరు 25న తుదిశ్వాస విడిచాడు. కాస్ట్రో మరణంతో ప్రపంచంలోని కమ్యూనిస్టులు, వామపక్ష, అభ్యుదయశక్తులు, పీడిత ప్రజలు గొప్ప నాయకుని కోల్పోయారు. అతిసామాన్య కుటుంబంలో పుట్టి అగ్రస్థాయి ప్రపంచనాయకునిగా ఎదిగిన కాస్ట్రో 1926, ఆగస్టు 13న క్యూబాలోని మతనమ్మకా లకు కట్టుబడి ఉండే ఒక సనాతన, సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రిపేరు ఎంజెల్, తల్లిపేరు లినా. సంపన్నుల పిల్లలు విద్యాభ్యాసం చేసే మత విద్యాసంస్థలలో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. స్కూలు, కాలేజీ విద్యలను శాంటియాగో డి క్యూబాలో పూర్తిచేశాడు. 1945లో యూనివర్సిటి ఆఫ్ హవానాలో లా విద్యార్థిగా చేరాడు. విద్యార్థి సంఘాలలో గూండాలను, మాఫి యా చర్యలను వ్యతిరేకించాడు. చదువుకునే రోజుల్లో సామ్రాజ్య వాద వ్యతిరేక, వామపక్ష రాజకీ యాల పట్ల ఆకర్షితుడయ్యాడు. అక్కడే మార్క్సిజం, లెనినిజంతో పరిచయం ఏర్పడింది. ఆటల్లో ఆసక్తి గా పాల్గనేవాడు. స్నేహితులతో కలిసి పర్వాతా రోహణ, ఇతర అన్వేషణా యాత్రలు చేస్తుండే వాడు. చిన్నతనంలో చుట్టూ ఉన్న పేదల పిల్లలతో కలిసి పెరిగాడు. పేదల జీవితాలు, వారి ఆలోచ నలు, ఆకాంక్షల పట్ల అవగాహన ఏర్పడింది.

1947లో క్యూబా పీపుల్స్ పార్టీలో సభ్యు డయాడు. 1948లో డొమినికన్ రిపబ్లిక్, కొలంబి యాలోని బగోటాలో జరిగిన తిరుగుబాటులో



కూడా కాస్ట్రో పాల్గొన్నాడు. క్యూబాలో రామోన్ గ్రౌ ప్రభుత్వ అవినీతికర, హింసాత్మక విధానా లకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. అమెరికా మద్దత్తుతో బాటిస్టా క్యూబాలో సైనిక తిరుగుబాటు జరిపి, 1952 మార్చి 10న అధికారంలోకి వచ్చాడు. అధికారం కోల్పోయిన అధ్యక్షుడు అమెరికాకు పారిపోయాడు. ఆ విధంగా క్యూబాలో పాలకులుగా ఎవరున్నా అమెరికా కనుసన్నలలో మెలుగుతుండేవారు. బాటిస్టా క్యూబాలో పౌరహక్కులను అణచివేశాడు. అప్పటికి ప్రకటించిన ఎన్నికలను రద్దుచేసి, తనకుతాను అధ్యక్షునిగా ప్రకటించుకొని, నియంతృత్వ పాలన సాగించాడు. క్రమంగా అమెరికాతో సంబంధా లను పెంచుకొని, కార్మిక సంఘాలను, సోషలిస్టు గ్రూపులు, వామపక్ష శక్తులను అణచివేయటం ప్రారంభించాడు. ప్రభుత్వాన్ని ప్రతిఘటించటానికి చట్టబద్ధంగా ఎటువంటి అవకాశాలు లేకపోవటం తో సైనిక నియంతృత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేయటం కోసం విప్లవ సంస్థను నిర్మించటానికి కాస్ట్రో పూనుకున్నాడు. కాస్ట్రో నాయకత్వంలోని సాయుధ దళాలు 1953, జులై 26న శాంటియాగో డి క్యూబాలోని మంకోడా సైనికదుర్గంపై దాడిచేశారు. ఆ దాడి విఫలం కావటంతో ప్రభుత్వం కాస్ట్రోతో పాటు 24 మందిని బంధించింది. దాడి జరిగిన సమయంలో, ఆ తర్వాత బటిస్టా సైన్యం అనేకమందివిప్లవకారులను హత్య చేయించింది. విచారణ సమయంలో కాస్ట్రో చేసిన ప్రసంగం క్యూబా ప్రజలను ఉత్తేజితులను చేసింది. ఆ ప్రసంగాన్ని పుస్తకంగా అచ్చువేయించి, వేలసంఖ్యలో ప్రజల వద్దకు చేర్చారు. బాటిస్టా ప్రభుత్వం నిర్వహించిన బూటకపు విచారణలో కాస్ట్రో, ఆయన అనుచరులకు 15 సంవత్సరాల జైలుశిక్ష విధించారు. నిర్బంధ విధానాలు పెరుగుతున్న కొద్దీ కాస్ట్రో, ఇతర విప్లవ కారులను విడుదల చేయాలని ప్రజల నుండి వత్తిడి తీవ్ర మైంది. గత్యంతరం లేని పరిస్థితులలో 22 మాసాల తర్వాత, 1955 ఏప్రిల్‌లో ప్రభుత్వం వారిని విడుదల చేసింది.

**గెరిల్లా పోరాటానికి నాయకత్వం**

విడుదల అనంతరం పోరాటశక్తులను కూడదీయటానికి 1955లో కాస్ట్రో మెక్సికో వెళ్ళాడు. రావుల్ కాస్ట్రో, చే గువేరా తదితరు లతో కలిసి అక్కడ సాయుధ గ్రూపును ఏర్పాటు చేశాడు. గెరిల్లా పోరాటానికి కావలసిన సన్నాహాలను పూర్తిచేసుకొని, గెరిల్లా పోరాటాన్ని ప్రారంభించాడు. మెక్సికో నుండి 'గ్రాన్మా' అనేనౌకలో బయలుదేరి, 1956, డిసెంబరు 2న క్యూబా చేరుకున్నాడు. అప్పటి నుండి జరిగిన విప్లవ కార్యకలాపాలకు ఆయన ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. సియర్రా మాయిస్ట్రా పర్వత ప్రాంతాన్ని తమ పోరాటకేంద్రంగా చేసుకున్నారు. పోరాటంలో మొదటి దశలో ఎదురుదెబ్బలు తగిలాయి. పోరాటంలో అనేకమంది కామ్రేడ్స్‌ను కోల్పోవటంతో ఒకదశలో 19 మంది మాత్రమే మిగిలారు. అయినా తట్టుకుని పోరాటాన్ని కొనసాగిస్తూ, స్థానిక ప్రజల విశ్వాసాన్ని చూరగొని, తమ బలగాన్ని పెంచుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రజా శత్రువులపై పోరాటం చేయటం, క్రూరంగా వ్యవహరించే వారిని శిక్షించటం, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ వారితో కలిసిపోయారు. కొద్దికాలంలోనే గెరిల్లాల సంఖ్య 200కు పెరిగింది. వారిని మూడు దళాలుగా విభజించి, ఫైడల్, రావుల్ కాస్ట్రో, గువేరాలు నాయ కత్వం వహించారు. గెరిల్లాల దాడులకు తట్టుకోలేక ప్రభుత్వం 1958లో సియర్రా మాయిస్ట్రా ప్రాంతం నుండి సైన్యాన్ని ఉపసంహరించుకుంది. 1958 చివరి నాటికి గెరిల్లా దళాలు పోరాటకేంద్రం నుండి క్యూబా మొత్తానికి విస్తరించారు. 1958

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. కమ్యూనిస్టు యోధుడు ఫైడల్‌కాస్ట్రో
ఎ కోటిరెడ్డి ... 2

2. సోషలిజమే ప్రత్యామ్నాయం
బివి రాఘవులు ... 4

3. ఉమ్మడి పౌరస్మృతిపై సంఘ్ పరివార్ కపటనాటకం
బృందాకరత్ ... 9

4. నోట్లు మోదీపాలు బతుకులు బజారుపాలు
సిపిఐ(యం) ప్రచార విభాగం ... 11

5. అమెరికాలో ట్రంప్ విజయం
కల్లోల ప్రపంచంలో కొత్త సమస్య
ఎస్ వెంకట్రావ్ ... 15

6. విమర్శ - ఆత్మవిమర్శ
ఎస్ వీరయ్య ... 18

7. ప్రపంచీకరణ -రాజకీయ పర్యవసానాలు
కొండూరి వీరయ్య ... 21

8. విద్వేష విషం చిమ్మిన దీనదయాళ్ ఉపాధ్యాయ
ఎజి నూరానీ ... 25

9. కాషాయ ఉడిపిని తాకిన ఉనా మంటలు
ఆనంద్ టెల్‌టుమ్డే ... 31

10. ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని
పటిష్టం చేయడానికే నోట్ల రద్దు
బి.వి. రాఘవులు ... 34



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248
మేనేజర్: 040-27673787
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at: cpim.org


# డబ్బు

మానవజాతి చరిత్రలో అత్యధిక కాలం డబ్బు అవసరం లేకుండానే గడిచింది. సామాజిక ఉత్పత్తిలో శ్రమ విభజన జరిగి వస్తుమార్పిడి వచ్చినప్పుడు డబ్బు అవసరం ఏర్పడింది. అయినా చాలా కాలం వస్తుమార్పిడి పద్ధతిలోనే వాణిజ్యం సాగింది. ఉత్పత్తి పెరిగి వాణిజ్యం ఇబ్బడిముబ్బడి కావడంతో మారకపు సాధనంగా డబ్బు రంగంలోకి వచ్చింది. మానవుడు అనేక వస్తువులను డబ్బుగా ఉపయోగించాడు. పశువులు, రంగురాళ్లు, గవ్వలు...వగైరా అనేక వస్తువులతో ప్రయోగాలు చేశాక చివరికి బంగారం అనువైన సాధనంగా ఉపయోగ పడింది. బంగారంతో పాటు వెండి, రాగి, ఇత్తడి నాణేలు చివరికి తోలు నాణేలు కూడా రంగంలోకి వచ్చాయి. ఆధునిక కాలంలో వీటి స్థానంలో కాగితం డబ్బు చలామణిలోకి వచ్చింది. కాగితం డబ్బుపోయి 'అమూర్తమైన' డిజిటల్ డబ్బు వస్తున్న పరివర్తన కాలంలో మనమున్నాం.

డబ్బు ఒక రూపం నుండి మరో రూపానికి మారడం అనేది సమాజాభివృద్ధిలో ఒక సహజ క్రమంలో జరిగింది. కానీ ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలోని ప్రజలందరినీ బలవంతంగా డిజిటల్ డబ్బులోకి మార్చదలుచుకున్నది. దానికోసం మోడీ, ఆయన ప్రభుత్వం అనుసరించిన నిరంకుశ పద్ధతి దేశంలోని కోట్లాదిమంది ప్రజలను చెప్పలేని ఈతిబాధలకు లోనుచేస్తోంది. ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాలను దెబ్బతీస్తోంది.

500, 1000 నోట్లు రద్దు చేస్తున్నట్లు నవంబర్ 8వ తేదీ రాత్రి ప్రధాని మోడీ ప్రకటించారు. నల్లధనాన్ని అరికట్టేందుకు, ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకే ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. రెండు మూడు రోజులు ప్రజలు ఇబ్బందులెదుర్కోవలసి వస్తుందన్నారు. తరువాత ఇబ్బందులు రెండు మూడు వారాలుంటాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ఇప్పుడు ఇబ్బందులు శాశ్వతమనీ, డిజిటల్ డబ్బు రూపంలోకి మారడమొక్కటే దీనికి పరిష్కారమని ప్రభుత్వం పరోక్షంగా చెబుతోంది. నల్లధనవంతుల కోసం, ఉగ్రవాదుల కోసం నోట్లు రద్దుచేశామన్న మాట ఇప్పుడు ప్రభుత్వం చెప్పడం లేదు. డిజిటల్ డబ్బు చెలామణి పెంచడానికి ముఖ్యమంత్రుల కమిటీ వేస్తానంటోంది. ఇంకా దీనికోసం అనేకానేక చర్యలు తీసుకుంటానంటోంది.

అందువల్ల నోట్ల రద్దు నల్లడబ్బు నిర్మూలనకోసం కాదు కాగితం డబ్బునుండి ప్రజలను డిజిటల్ డబ్బులోకి మార్చడానికేనని ఇప్పుడు స్పష్టమైపోయింది. మోడీ, ఆయన ప్రభుత్వం బయటకు చెప్పిన వన్నీ అసత్యాలని తేలిపోయింది. ఇప్పటికే దేశంలో డిజిటల్ డబ్బు వాడకం క్రమంగా పెరుగుతున్నది కదా మరి డిజిటల్ డబ్బులోకి ప్రజలందరినీ ఒక్కసారిగా, ఇంత దుర్మార్గంగా, బలవంతంగా ఎందుకు మార్చదలుచుకున్నారు? అమెరికా, యూరప్, జపాన్ లాంటి పెట్టుబడిదారీ అభివృద్ధి చెందిన సమాజాల్లో డిజిట్ డబ్బులోకి మారడం సులువు. కానీ ఫ్యూడల్ సమాజాన్ని ఇంకా పట్టుకు వేలాడుతున్న మనలాంటి పేద దేశాల్లో ఈ మార్పు వెంటనే రాదు. మొత్తంగా మారడానికి చాలా కాలం పడుతుంది. 40 శాతం నిరక్షరాస్యులు, 60 శాతం గ్రామీణులు, 80 శాతం పేద ప్రజలున్న మన దేశంలో 5 కోట్ల మంది ప్రజలు చిన్న వ్యాపారాల మీదా, నగదు చెలామణిమీద ఆధారపడి బతుకుతున్నారు. వాల్‌మార్ట్ వంటి విదేశీ బహుళజాతి కంపెనీలు, బిగ్ బజార్, రిలయన్స్ ఫ్రెష్, హెరిటేజ్‌వంటి స్వదేశీ కంపెనీలు చిల్లర వర్తకంలోకి ప్రవేశించడానికి ఈ చిన్న వ్యాపారాలు, నగదు లావాదేవీలు అడ్డంకిగా ఉన్నాయి. ఈ అడ్డంకి తొలగించి బడా కంపెనీలకు లాభాలు చేకూర్చడం మోడీ సర్కారు ముందున్న ఎజెండా. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు పడిపోయినట్లు మాయ మాటలు చెప్పి నోట్లు రద్దు చేస్తే ఇటు ప్రజలు డిజిటల్ డబ్బులోకి మారుతారు, అటు చిన్న వ్యాపారాలు దెబ్బతినిపోతాయి. ఫలితంగా కార్పొరేట్ బడా వ్యాపారాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు పెరుగుతాయి. అందువల్ల విదేశీ, స్వదేశీ కార్పొరేట్ పెట్టుబడికోసమే మోడీ నోట్ల రద్దు చేశారుగానీ నల్లధనం కోసం కాదు. మోడీ ప్రభుత్వ ఈ కుట్రలను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత వామపక్షాలు, అభ్యుదయ శక్తులపై ఉంది.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**


పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**అక్టోబర్ విప్లవ శతవార్షిక ప్రత్యేకం**

# సోషలిజమే ప్రత్యామ్నాయం

**బివి రాఘవులు**



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవ శతవార్షికోత్సవంలో భాగంగా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు గారు చేసిన ప్రసంగం పూర్తి పాఠం.**

అక్టోబర్ విప్లవాన్ని మనం నవంబరులో జరుపుకోవడానికి కారణమేంటనేది మీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నవంబరు 7వ తేదీ రష్యన్ కేలండర్ ప్రకారం అక్టోబర్ 25వ తేదీ అవుతుంది. ఈ విప్లవానికి గొప్ప ప్రత్యేకత ఉంది. సమాజంలో చాలా విప్లవాలొచ్చినాయి.అక్టోబరు విప్లవానికి ముందు రష్యాలో 1905లో ఫిబ్రవరి విప్లవం జరిగింది. ఫ్రాన్స్‌లో 1871 లో పారిస్ కమ్యూన్ వచ్చింది. అది ఒక విప్లవం. 17వ శతాబ్దంలో ఇంగ్లండులో అప్పటి చక్రవర్తులకు వ్యతిరేకంగా రక్త రహిత విప్లవమొచ్చింది. 18వ శతాబ్దంలో ఫ్రాన్సులో ఫ్రెంచి విప్లవం వచ్చింది. ఇంకా వెనక్కి పోతే చాలా విప్లవాలు కనిపిస్తాయి.

అన్ని విప్లవాలకన్నా అక్టోబర్ విప్లవానికి ఒక ప్రత్యేకత ఉంది. అప్పటి వరకు జరిగిన విప్లవాలు అధికారంలో ఉన్న ఒక తరగతి దోపిడి దారులను తొలగించి ఇంకొక తరగతి దోపిడిదారులను అధికారంలోకి తీసుకు రావడానికి జరిగిన విప్లవాలవి. బానిస యజమానులను తొలగించి ఫ్యూడల్ ప్రభువులు అధికారానికొచ్చారు. ఫ్యూడల్ ప్రభువులను, చక్రవర్తులను అధికారం నుంచి దించేసి పెట్టుబడిదారులు అధికారంలోకి వచ్చారు. ఇంగ్లండులో జరిగిన విప్లవం గానీ, ఫ్రాన్సులో జరిగిన విప్లవంలో గానీ దిగిన వాడూ దోపిడిదారుడే, మళ్లీ అధికారంలోకి వచ్చినవాడూ దోపిడీదారుడే.

1917లో జరిగిన అక్టోబరులో విప్లవంలో దిగినవాడు దోపిడిదారుడు. అధికారంలోకి వచ్చినవారు కార్మిక, కర్షకులు. దోచుకోబడిన, పేదల యొక్క విప్లవం అక్టోబర్ విప్లవం. అందుకనే ఇది మహత్తరమైన విప్లవం అని మనం చెప్పుకుంటాం.

గత విప్లవాలు కూడా ఒక్క రోజులో జయప్రదం కాలేదు. అవి దోపిడిదారుల విప్లవాలైనా ఒకసారి ఒక దోపిడి శక్తిని అధికారం నుంచి తొలగించి ఇంకో దోపిడి శక్తి అధికారంలోకి వచ్చిన తర్వాత పాతవారు అంత సులభంగా అధికారాన్ని వొదులుకోలేదు. మళ్లీ అధికారాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నం చేస్తారు. దానికి అవసరమైతే కుట్రలు చేస్తారు. ద్రోహాలు చేస్తారు. యుద్ధాలు చేస్తారు. రక్తం చిందిస్తారు. ఇంగ్లండులోను, ఫ్రాన్సులో కూడా అదే జరిగింది. భూస్వాములను తొలగించి పెట్టుబడిదారులు అధికారానికి రావడానికి చాలాసార్లు ప్రయత్నం చేసి, పలుమార్లు విఫలమై, సుదీర్ఘ సంఘర్షణ తర్వాత జయప్రదం అయ్యారు. ఆఖరికి 1848లో మాత్రమే పెట్టుబడిదారులు తమ అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు.

అంతకుముందు విప్లవాల్లో పెట్టుబడిదారీ శక్తులకు మద్దతుగా అయినా రైతులు పాల్గొనేవారు. 1848 విప్లవాల్లో మొట్టమొదటిసారి పెట్టుబడిదారులకు అండగా కార్మికులు పాల్గొన్నారు. పెట్టుబడిదారులకు అధికారం సుస్థిరమైంది. పెట్టుబడిదారులకు భయం కూడా పట్టుకుంది. కార్మికుల సహాయంతో విప్లవాన్ని తెచ్చుకున్నాం. విప్లవమంటే ఏమిటో రుచి చూపించాం. ఆ చైతన్యం కార్మికులకి కల్పించాం. ఇది తమకే ప్రమాదం తెస్తుందేమోనని పెట్టుబడిదారులు భావిచారు. 1846-1848 నాటి విప్లవాలు మార్క్స్, ఎంగెల్స్‌లకు కమ్యూనిస్టు ప్రణాళిక రాయడానికి ఉత్తేజాన్నిచ్చాయి. భవిష్యత్తుని దర్శించేందుకు భూమికను ఏర్పాటు చేసింది ఆ విప్లవాలే. అందుకనే కమ్యూనిస్టు ప్రణాళిక చివర కార్మిక వర్గానికి అప్పీలు చేస్తారు.'ప్రపంచ కార్మికులారా ఏకం కండి. మీకు పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' అని నినాదం ఇచ్చారు. ఆ తర్వాత మార్క్స్ మాటను నిజం చేస్తూ పారిస్ కమ్యూన్ వచ్చింది. మొట్టమొదటి సారి కార్మికులను అధికారంలోకి తీసుకొచ్చిన విప్లవమది.

కార్మికులు అధికారానికి వచ్చి70 రోజులు పరిపాలనజేసిన విప్లవం పారిస్ కమ్యూన్. ఆ పారిస్ కమ్యూన్‌కు మార్క్స్ సమకాలికుడు దాన్ని సమర్థించాడు. దానికి సలహాలిచ్చాడు. వందల మందిని ఊచకోత కోసి, వేలమందిని జైళ్లలో పెట్టి, వేలమందిని బయటకు నెడితే వాళ్లందరికీ న్యాయ సహాయం చేయడానికి అవసరమైన కమిటీలను ఏర్పాటు చేశాడు. కార్మికవర్గ ప్రతినిధులు 70 రోజులు గొప్పగా పరిపాలన చేశారు. భవిష్యత్‌లో సోషలిజం ఎలా ఉంటుందో దాని బీజాలు పారిస్ కమ్యూన్‌లో కనపడతాయి. అయితే కొద్ది రోజుల్లోనే కార్మికవర్గం ఓడిపోయింది. తన అధికారాన్ని ఎందుకు శాశ్వతంగా నిలబెట్టుకోలేకపోయింది అని ప్రశ్నించి, మార్క్స్ సమాధానం చెప్పాడు. పారిస్ పట్టణం చుట్టూ ఉండే రైతులు పెట్టుబడిదారులు చెప్పిన మాటలకు మోసపోయారు. పెట్టుబడిదారులకు అండగా చేరి కార్మికవర్గం మీద దాడికి సహాయం చేశారు. ఆ రోజు పెట్టుబడిదారులు రైతులను మిత్రులుగా చేసుకున్నారు. రైతులను పెట్టుబడిదారులు కాదు మిత్రులుగా చేసుకోవాల్సింది. కార్మికులు మిత్రులుగా చేసుకోవాలి. అప్పుడే విప్లవం జయప్రదమౌతుంది. కార్మికులు, కర్షకుల ఐక్యత ఆధారంగా విప్లవాలు రావాలని మొదటి సారి మార్క్స్ పిలుపునిచ్చాడు. అంటే ఆ వైఫల్యం నుంచి గుణపాఠం తీశారు. ఆ గుణపాఠాన్ని లెనిన్ రష్యాలో అమలుజేశారు. రైతాంగాన్ని, కార్మికవర్గాన్ని సంఘటితం చేసి తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నం చేశారు. అందుకనే 1917 అక్టోబరు విప్లవమొచ్చినప్పుడు మొదట చేసిన పనుల్లో ముఖ్యమైనది దున్నేవాడికి భూమి ఇవ్వడం. ఆ నినాదమిచ్చి కార్మికవర్గం రైతులను తన వైపు సమీకరించుకుంది. కార్మిక సోవియట్లు, రైతాంగ సోవియట్లు, సైనిక సోవియట్లు, అంటే కార్మికులందరూ కలిసి ప్రతినిధులను ఎన్నుకున్నారు. రైతులందరూ కలిసి ప్రతినిధులను ఎన్నుకున్నారు. సైనికులందరూ కలిసి ప్రతినిధులను

"ఒక దోపిడిదారుడు ఇంకో దోపిడిదారుడి స్థానంలో అధికారంలో స్థిరపడటానికే ఇన్ని ఆటుపోట్లు ఎదుర్కొంటే దోపిడి వ్యవస్థను నాశనం చేసిన కార్మికవర్గాన్ని అధికారం నుండి తొలగించటానికి పెట్టుబడిదారులు ఎంత తీవ్రమైన ప్రయత్నాలు చేస్తారు? ఎన్ని కుట్రలు చేస్తారు? ఎన్నిసార్లు ఓడిస్తారు? కార్మికవర్గం ఎన్నిసార్లు వాళ్లను ఓడించి తిరిగి అధికారంలోకి రావాల్సివస్తుందో ఊహించుకోవచ్చు."



అక్టోబర్ విప్లవంలో ప్రజలు

ఎన్నుకున్నారు. ఈ మూడు తరగతుల ప్రతినిధులతో సోవియట్ ప్రభుత్వం ఏర్పడింది. ఇందులో పెట్టుబడిదారులు, భూస్వాములకు ప్రాతినిధ్యం లేదు. కార్మికులు, రైతులు, సైనికులతో ఏర్పడిన ప్రభుత్వం అక్టోబరు 25న అధికారంలోకి వచ్చింది. ఈ తరగతులు ప్రజాప్రతినిధులుగా పరిపాలన చేసిన చరిత్ర అప్పటి వరకు లేదు. మొట్టమొదటి సారిగా ఈ విప్లవం ఆ అవకాశాన్ని కల్పించింది. అది ఈ విప్లవం ప్రత్యేకత.


రష్యాలో విప్లవమొచ్చి, సోవియట్ యూనియన్‌గా అది పరిణామం చెంది, సోషలిజం అప్రతిహతంగా కొనసాగి 1991లో విఫలమైపోయింది. సోవియట్ యూనియన్ దెబ్బతినిపోయింది. కార్మికవర్గం అధికారం నుంచి దిగిపోయి మళ్లీ పెట్టుబడిదారులు అధికారంలోకి వచ్చారు. 70 సంవత్సరాల పరిపాలన జరిగిన తర్వాత సోషలిజం కూలిపోతుందని మనమెవ్వరమూ అనుకోలేదు. కూలిపోవాలని ఎవ్వరూ కోరుకదా. కొనసాగాలని కోరుకుంటారు. కానీ కూలిపోగానే సహజంగానే మనందరికీ నిరాశ, నిస్పృహ వస్తుంది. అసలు సోషలిజం ఒకసారి వచ్చిన తర్వాత కూలిపోతుందా అనే అనుమానం కూడా చాలా మందికి వస్తుంది. కానీ ప్రపంచ విప్లవాలన్నిటినీ ఒకసారి పరిశీలన చేస్తే మనకు ఒక విషయం అర్థమౌతుంది. ఏ ప్రయోగమైనా వైఫల్యం లేకుండా జయప్రదం కాలేదు. ఇప్పుడు అంతరిక్షంలోకి మనిషి వెళుతున్నాడు. చంద్రమండలంపై దిగాడు. అంతరిక్షంలో శాటిలైట్లు తిరుగుతున్నాయి. ప్రయోగ కేంద్రాలు పెట్టారు. ఈ అంతరిక్ష ప్రయోగాలన్నీ వైఫల్యాలు లేకుండా జరిగాయా? ఎన్ని సార్లు రాకెట్లు కూలిపోలేదు. మనుషులతో సహా ఉన్న రాకెట్లు పేలిపోయి కూలిపోలేదు. కానీ ఒక్కొక్క వైఫల్యం నుంచి అది ఎందుకు వైఫల్యం చెందిందో నేర్చుకొని, లోపాలను సవరించుకొని మెరుగైన రాకెట్లను రూపొందించి, ప్రయోగాలు చేసి, అంతిమంగా విజయం సాధించారు. అయ్యో ప్రాణాలు పోయినాయని ప్రయోగాలు మానెయ్యలేదు. కొత్త ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. విప్లవాల పరిస్థితి కూడా అదే. ఫ్రాన్స్‌లో విప్లవం జరిగి, పెట్టుబడిదారులు అధికారానికి వచ్చిన తర్వాత వాళ్లను దించేసి ఎన్నిసార్లు భూస్వాములు, ప్రభువులు మళ్లీ అధికారానికి రాలేదు. మళ్లీ వాళ్లను దించడానికి ఎన్నిసార్లు పోరాటం చేయాల్సివచ్చింది? పెట్టుబడిదారులు స్థిరపడి అధికారంలో కొనసాగటానికి అనేక శతాబ్దాలు పట్టింది. ఒక దోపిడిదారుడు ఇంకో దోపిడిదారుడి స్థానంలో అధికారంలో స్థిరపడటానికే ఇన్ని ఆటుపోట్లు ఎదుర్కొంటే దోపిడి వ్యవస్థను నాశనం చేసిన కార్మికవర్గాన్ని అధికారం నుండి తొలగించటానికి పెట్టుబడిదారులు ఎంత తీవ్రమైన ప్రయత్నాలు చేస్తారు? ఎన్ని కుట్రలు చేస్తారు? ఎన్నిసార్లు ఓడిస్తారు? కార్మికవర్గం ఎన్నిసార్లు వాళ్లను ఓడించి తిరిగి అధికారంలోకి రావాల్సివస్తుందో ఊహించుకోవచ్చు. అందుకని విప్లవం నేలబారుగా జరిగిపోతుందని గత విప్లవాలు మనకు గుణపాఠాలు నేర్పడం లేదు. ఈ విప్లవపథంలో మనకు వైఫల్యాలు, విజయాలు ఎదురవుతాయి. వైఫల్యాలను ఎదుర్కొని ముందుకు పోవాల్సివుంటుందని గత విప్లవాల అనుభవాలు తెలియజేస్తున్నాయి.

బూర్జువా ప్రజాస్వామ్యానికి, సోషలిజానికి వ్యత్యాసమేమిటంటే సోషలిజంలో వంటలక్కయినా, ఒక కాంట్రాక్టు కార్మికుడైనా పరిపాలన చేయగలిగే స్థితికొస్తాడు అని లెనిన్ చెప్తాడు. అదే సోషలిజం యొక్క ప్రత్యేకత అని అంటాడు. లెనిన్ ఆ మాట అన్నప్పుడు చాలా మంది ఎగతాళి చేశారు. అంటే ఇంట్లో పని మనిషి పరిపాలన చేస్తుందంట! రోజూ చాకిరి చేసొచ్చే కాంట్రాక్టు కార్మికుడు పరిపాలన చేస్తాడట! పరిపాలన చేయాలంటే ఎన్ని తెలివితేటలు కావాలి? ఎంత చదువు కావాలి? ఎంత తీరుబడి కావాలి? పని చేయకుండా ఎంత ఆలోచన చేయాలి? ఇటువంటివి ఏమీ లేకుండా వాళ్లు పరిపాలన చేస్తారట, లెనిన్ చెప్తున్నాడని ఎగతాళి చేశారు. లెనిన్ వారికి సమాధానం చెప్తాడు. మీరు చెప్పింది వంద శాతం కరెక్టు. తెలివితేటలు లేకుండా, తీరిక లేకుండా పరిపాలన చేస్తారని నేను చెప్పడం లేదు. మా వాళ్లందరికీ చదువు నేర్పుతాం. మా వాళ్లందరికీ తెలివి నేర్పుతాం. మా వాళ్లందరికీ పరిపాలన చేయగలిగే శిక్షణిస్తాం. ఆ రకంగా కార్మికులు, కర్షకులు పరిపాలన చేయగలిగేట్టు చేస్తాం అన్నాడు.

ప్రజలను పరిపాలకులుగా తీర్చిదిద్ది ప్రజాస్వామ్యాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్ళాలన్న విషయాన్ని సోవియట్ యూనియన్‌లో కొంతకాలం తర్వాత మర్చిపోయారు. ప్రజాస్వామ్యాన్ని ఎంత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలంటే దానికి ఎక్కడ, ఏ మూల ఏ హాని జరిగినా రక్షించుకోవడానికి ఎల్లప్పుడూ ప్రజలందరూ సంసిద్ధంగా ఉండేంత స్థాయికి తీసుకెళ్లాలి. అటువంటి స్థాయికి తీసుకెళ్లినప్పుడు సోషలిజం అజేయంగా మిగిలిపోతుం

❝ ఆరోజు పెట్టుబడిదారులు చెప్పిన మాటలు చాలా మంది నమ్మారు. మరి ఈ రెండున్నర దశాబ్దాల కాలం మనం పరిశీలన చేస్తే వారు చెప్పిన మాట వాస్తవమైందా? సోషలిజం వచ్చిన తర్వాత, సోవియట్ వ్యవస్థ పరిష్కారం చేసిన సమస్యల నైనా పెట్టుబడిదారీ విధానం పరిష్కారం చేయ గలిగిందా? ❞

ది. బద్ధలు చేయడం ఎవ్వరికీ సాధ్యం కాదు. సోవియట్ యూనియన్‌లో 70 సంవత్సరాల్లో పది, పదిహేను సంవత్సరాలు ఇటువంటి పద్ధతుల్లో కార్మిక, కర్షక సోవియట్‌ల ఆధ్వర్యంలో పరిపాలన జరిగింది. ఆ తర్వాత, తర్వాత వక్రీకరణలు ఏర్పడి చివరికి ఒక కొత్త నిరంకుశ అధికార యంత్రం అభివృద్ధి కావడం, కమ్యూనిస్టుల్లో కూడా అటువంటి ధోరణులు బలపడటం జరిగింది. ఫలితంగా వాళ్లేదో పరిపాలన చేస్తున్నార్లే మనకెందుకు..మంచి పనులేస్తున్నారు కదా. చదువు చెప్తున్నారు. దుస్తులిస్తున్నారు. వైద్యం చేయిస్తున్నారు. మనకేమీ కష్టం లేకుండా చూస్తున్నారు కదా వాళ్లు చూసుకుంటార్లే అన్న ప్రేక్షక తత్వం వచ్చింది. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం లేకుండాపోయింది. నిజంగానే శత్రువు కుట్రలు చేసి దానిని కూలదోయాలనుకున్నప్పుడు ప్రజల్లో, కమ్యూనిస్టు పార్టీ సభ్యుల్లో కూడా వాళ్లూవాళ్లూ చూసుకుంటారులే, మనకెందుకు అనే వాతావరణం వచ్చింది. రాబోయే కాలంలో మనం సోషలిజం నిర్మించాలంటే ఈ పొరపాట్లను సరిదిద్దుకుని, అటువంటి అత్యు న్నతస్థాయి ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకోవాలి. ప్రజల యొక్క పాత్రను పెంచాలి. ప్రజలే పరిపాలన చేసుకునేట్టు చేయాలి. ప్రజలంటే ఎవరు? కష్టజీవులు కార్మికులు, రైతులు, మధ్య తరగతి ప్రజలు, ఇతర మేధో శ్రమ చేసేవారు ఇటువంటి వాళ్లందరూ తమ పరిపాలన తాము చేసుకునేట్టు ఉండాలి. తమ ప్రతినిధులను తామే ఎన్నుకునేట్టు ఉండాలి. తమ ప్రతినిధులు పనిచేయకపోతే వెనక్కి తిరిగి రప్పించేట్టు ఉండాలి. ప్రజా ప్రతినిధులు శాశ్వతంగా ఉండేందుకు అవకాశం ఉండకూడదు. పరిపాలన ను ఇటువంటి పద్ధతుల్లో మనం అభివృద్ధి చేయగలిగినప్పుడు ఒకసారి సోషలిజం వచ్చాక, దాని ప్రయోజనాల్ని, ఫలితాల్ని అనుభవించిన తర్వాత దానికి ఎటువంటి ప్రమాదం రాకుండా ప్రజలే చూసుకుంటారు. అందుకని రాబోయే కాలంలో భారతదేశంకానీ, ఇంకే దేశంలో కానీ విప్లవం వచ్చినా ఒక వినూత్నమైన పద్ధతిలో సోషలిజం నిర్మించేపనికి మనం పూనుకుం టాం. తద్వారా వచ్చే విప్లవాలు సోవియట్ యూనియన్ వైఫల్యాల నుండి గుణపాఠాలు తీసుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది.


లెనిన్

### పెట్టుబడిదారి విధాన వైఫల్యం

సోవియట్ యూనియన్ ఛిద్రమై 1991లో పెట్టుబడిదారి విధానం పునరుద్ధరణ అయిన తర్వాత సోషలిజం పోయింది. మార్క్సిజం పోయింది, కనుక దీనికి భవిష్యత్తు లేదు. అందువల్ల పెట్టుబడిదారివిధానమే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని పెట్టుబడిదారులు చెప్పారు. ఇప్పుడు 2017, అంటే దాదాపు రెండున్నర దశాబ్దాలు దాటిపోయింది. ఆరోజు పెట్టుబడిదారులు చెప్పిన మాటలు చాలా మంది నమ్మారు. మరి ఈ రెండున్నర దశాబ్దాల కాలం మనం పరిశీలన చేస్తే వారు చెప్పిన మాట వాస్తవమైందా? సోషలిజం వచ్చిన తర్వాత, సోవియట్ వ్యవస్థ పరిష్కారం చేసిన సమస్యలనైనా పెట్టుబడిదారీ విధానం పరిష్కారం చేయగలిగిందా? సోవియట్ యూనియన్ వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్యను పరిష్కారం చేసింది. జాతుల సమస్య పరిష్కారం చేసింది. స్త్రీ, పురుషుల మధ్య ఉండే అసమానతలను తగ్గించింది. నిరక్షరాస్యతను, అనారోగ్యాన్ని, దారిద్ర్యాన్ని నిర్మూలించింది.

సోషలిజం రాగానే అందరికీ భూమి పంచారు, అంతకు ముందు కరువు కాటకాలతో పంటలు దెబ్బతిన్నాయి. ఆహారం లేక బాధపడేవాళ్ళు లేకుండా అత్యున్నత స్థాయి పోషక విలువలున్న ఆహారం పెట్టగలిగిన పరిస్థితి వచ్చింది. దోపిడిని అంతం చేసింది. పెట్టుబడిదారులు లేరు. భూస్వాములు లేరు. మేధాపరమైన కార్మికులు కావచ్చు, శ్రామిక పరమైన కార్మికులు కావచ్చు అంతా శ్రామికులే. అప్పుడు రష్యా చాలా వెనుకబడిన దేశం. సోషలిజం వచ్చిన తర్వాత సోవియట్ యూనియన్ అమెరికాతో ఢీ అంటే ఢీ అనేస్థాయికి అభివృద్ధి అయింది. నువ్వు బాంబు చేస్తావా..నేను బాంబు చేస్తా. నువ్వు విమానం చేస్తావా, నేను విమానం చేస్తా. నువ్వు ఆకాశానికి ఎగరేస్తావా, నేను ఎగురవేస్తా అని చెప్పి శాస్త్ర, సాంకేతిక రంగంలో ముందుకెళ్లిపోయింది. వాటన్నింటినీ మించి జాతుల బందీఖానా అన్న దాన్ని బద్ధలు కొట్టి పెద్దా చిన్నా లేదు, ఎక్కువా తక్కువా లేదు, అన్ని జాతులు సమానమని చెప్పి చిన్నచిన్న జాతులను కూడా సాంస్కృతికంగా, చదువు పరంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించి, జాతుల సమాఖ్యను ఏర్పాటు చేసింది. అంతకుముందు ఎప్పుడు నిరంతరం నిర్బంధంతో ఉండే జాతులన్నీ సమానంగా బతకగలిగే పరిస్థితిని తెచ్చింది సోషలిజం. పెట్టుబడిదారీ విధానం ప్రపంచంలో ఏ మూలనైనా ఇలా చేయగలిగిందా?

సోషలిజం దెబ్బతిన్న ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో జాతుల మధ్య వైషమ్యాలు పెరిగిపోయాయి. యూగోస్లేవియాలో సోషలిజం ఉన్నంత కాలం జాతులన్నీ సమైక్యంగా ఉన్నాయి. సోషలిజం దెబ్బతినగానే మొత్తం ముక్కలైపోయింది. ఆ జాతులన్నింటి మధ్య వైషమ్యాలు పెరిగి లక్షల మంది ఘర్షణల్లో చనిపోయారు.

ఈ రోజు మొత్తం పశ్చిమాసియాలో ఏం జరుగుతోంది? ఇరాక్‌లో ఏం జరుగుతోంది? అది మనకందరికీ తెలుసు. అమెరికాలో ఏం జరుగుతోంది? నల్ల జాతి ప్రజలు మేము కూడా మనుషులమే, మాకు కూడా బతికే హక్కుంది అని ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇన్నేళ్ల, ఇన్ని శతాబ్దాల పెట్టుబడిదారి విధానంలో నల్లజాతి ప్రజలు మాకు బ్రతికే హక్కే లేకుండా పోతోందని అమెరికాలో ఆందోళన

చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అంటే పెట్టుబడి దారి విధానం జాతుల మధ్య సమస్యను పరిష్కా రం చేయలేకపోయింది. జాతుల మధ్య వైరాలు పెట్టి, తగాదాలు పెట్టి ఊచకోతలకు కారణ మైందే తప్ప శాంతిని కాపాడలేకపోయింది. ఆడవాళ్లకీ, మగవాళ్లకీ మధ్య ఉండే అసమా నతలను సోషలిజం రద్దు చేసింది చట్టపరంగా రద్దే కాక, ఆచరణలో కూడా స్త్రీలకు సమా నత్వం ఇచ్చింది. ఉద్యోగాల్లోనూ, విద్యలోనూ, ఉన్నతస్థాయికి తీసుకెళ్లింది. అంతేకాదు మహి ళల శక్తియుక్తులను సక్రమంగా ఉపయోగించు కోవడానికి దాదాపు ఇంటి చాకిరికి సంబంధిం చిన 90 శాతం పనులను సమాజానికి అప్పజెప్పింది. ఆహారం, పిల్లల పెంపకం, బట్టలు ఉతకడం తదితర అనేక పనులను సమా జం బాధ్యత తీసుకుని నిర్వహిస్తూ, మహిళల ఇంటి చాకిరిని తగ్గించేసింది. ఇంటి పనిని పురుషులు కూడా పంచుకునే విధంగా చైతన్యం కల్పించే ప్రయత్నం చేసింది. ఆ రకంగా స్త్రీ, పురుష సమానత్వాన్ని అత్యున్నతమైన స్థాయికి తీసుకువెళ్ళింది. సోషలిజం దెబ్బతిన్న తర్వాత ఇప్పుడు రష్యాలో స్త్రీ, పురుష సమానత్వం పరి స్థితి చూడండి. దాన్ని పెట్టుబడిదారి విధానం ఏవిధంగానూ పరిష్కారం చేయలేదు. వాస్తవం గా సోషలిజం దెబ్బతిన్న తర్వాత ఆ సమస్యలు తీవ్రమైనాయి తప్ప పరిష్కారం కాలేదు.

సోవియట్ యూనియన్ వచ్చిన తర్వాతనే ప్రపంచంలో యుద్ధ భయం, ఆయుధ పోటీ వచ్చాయని, సోవియట్ యూనియన్, కమ్యూ నిజం లేకపోతే ప్రపంచం శాంతిగా ఉంటుం దని పెట్టుబడిదారులు ప్రచారం చేశారు. సోవియట్ యూనియన్ పోయింది కదా. రెండున్నర దశాబ్దాల్లో..కమ్యూనిజం నుండి ప్రమాదమేమీ లేదు...మరి యుద్ధం పోవాలి కదా. కానీ ఈ రెండున్నర దశాబ్దాల్లో జరిగిన యుద్ధాల్లో జరిగిన దుర్మార్గాలకు, హత్యలకు హద్దే లేదు. లక్షలాది మంది ప్రాణాలు కోల్పో యారు. పాలస్తీనా ప్రజలపై ఇప్పటికీ ఇజ్రా యిల్ దాడి చేస్తున్నది. ఇరాక్, లిబియాలపై అమెరికా కూటమి రుద్దిన యుద్ధంలో లక్షల మంది చనిపోయారు. ఇప్పుడు సిరియా అంతర్యు ద్ధంలో లక్షల మంది చనిపోతున్నారు. లక్షల మంది కాందిశీకులయ్యారు. ఆఫ్ఘనిస్తాన్‌లో లక్షల మంది చనిపోయారు. యుగోస్లేవియాలో, ఉక్రెయిన్‌లో, ఆఫ్రికాలో చాలా దేశాల్లో అంతర్యు ద్ధాలను ఎగదోసి, సామ్రాజ్య వాదులు లక్షలాది మందిని పొట్టన పెట్టుకు న్నారు. మరి యుద్ధం ఎక్కడ అంత మైంది? యుద్ధానికి కారణమెవ్వరు? సోవియట్ యూని యనా? అది లేకుండానే

**"యుద్ధం పోవాలంటే సామ్రాజ్యవాదం, పెట్టుబడి దారి విధానం నాశనం కావాలని ఆ రోజు లెనిన్ చెప్పింది సరైనదని ఈ రెండున్నర దశాబ్దాల చరిత్ర రుజువు చేస్తు న్నది. వాస్తవానికి సోవియట్ యూనియన్ ఉన్నన్నాళ్లూ ప్రపంచంలో సాపేక్షంగా శాంతి వాతావరణం మెరుగ్గా ఉండేది."**



రష్యన్ల నుద్దేశించి ప్రసంగిస్తున్న లెనిన్

పోయింది. అయినా యుద్ధాలు ఎందుకు కొనసాగు తున్నాయి? అది పెట్టుబడిదారి విధానం మూ లంగా, సామ్రాజ్యవాదం మూలంగా, అమెరికన్ సామ్రాజ్యవాదం మూలంగా జరుగుతోంది. వాళ్ల దోపిడీ కోసం ఇప్పుడు యుద్ధాలు చేస్తారు. ఆయిల్ అవసరం కాబట్టి, ఆయిల్ దొరికే ప్రాంతాలన్నిటిలోనూ యుద్ధాలు సృష్టిస్తున్నారు. పెట్టుబడిదారి విధానం ఉన్నంత కాలం యుద్ధం ఉంటుంది. సామ్రాజ్యవాదం ఉన్నంత కాలం యుద్ధముంటుంది. యుద్ధం పోవాలంటే సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి విధానం నాశనం కావాలని ఆ రోజు లెనిన్ చెప్పింది సరైనదని ఈ రెండున్నర దశాబ్దాల చరిత్ర రుజువు చేస్తున్నది. వాస్తవానికి సోవియట్ యూనియన్ ఉన్నన్నాళ్లూ ప్రపంచంలో సాపే క్షంగా శాంతి వాతావరణం మెరుగ్గా ఉండేది. ఎందుకంటే యుద్ధం మొదలుపెడితే దాడికి గురైన దేశానికి, ప్రజలకు సోవియట్ యూనియన్ ఎక్కడ అండగా ఉంటుందోనని అమెరికా వెనకడుగు వేయాల్సి వచ్చేది. అందు కని సోవియట్ యూనియన్ ఉన్నంత కాలమే ప్రపంచంలో సాపేక్షంగా శాంతి నెలకొనివుంది. పెద్దపెద్ద యుద్ధాలు ఎక్కడా లేని పరిస్థితి వచ్చింది. ఆ సోవియట్ యూనియన్ ఎప్పుడైతే నాశనమైందో అమెరికాకు అడ్డు లేకుండా పోయింది.

ఇప్పుడు కొత్త సమస్యలొచ్చాయి. మార్క్స్ కాలంకన్నా, లెనిన్ కాలం కన్నా కొత్త సమస్యలు చాలా తీవ్రంగా ముందుకొచ్చినాయి. వాటిల్లో ముఖ్యమైనది పర్యావరణ సమస్య. ఈ రోజు పర్యావరణ సమస్య ఇంత పెద్ద అంశం కావడానికి కారణం పెట్టుబడిదారి విధానం. ఈమధ్య ఢిల్లీలో స్కూళ్లన్నీ మూసేశారు. ఎందుకు? ఒక్కరోజు మీరు ఢిల్లీలో గాలి పీల్చారంటే ఆ రోజు 40 సిగరెట్లు కాల్చినట్టు లెక్క అని చెబుతున్నారు. ఈ కాలుష్యం ఇంత స్థాయికి ఎందుకొచ్చింది. రెండు రోజుల క్రితం మోడీ గారు ఢిల్లీలో ఉపన్యాసం చేశారు. ఆయన చెప్పిందేమంటే అభివృద్ధి పేరుతోటి పర్యావరణం నాశనం చేశామంటే మనిషికి బ్రతుకుండదు. జీవ వైవిధ్యాన్ని మనం నాశనం చేశామంటే మనిషి మనుగడ ఉండదని చెప్పారు. ఆ రెండు మాటలు చాలా మంచిమాటలు. మనం చెపుతున్నదీ అదే. కానీ సమస్య ఏమిటం టే పర్యావరణం నాశనం చేస్తున్నది ఈ పాలకులే. నాశనం చేసేవాళ్లు ఇప్పుడు పర్యావరణం గురించి మాట్లాడు తున్నారు. పర్యావరణాన్ని పెట్టుబడిదారి విధానం నాశనం చేస్తున్నది. ఈ రోజు పర్యా వరణాన్ని మనం కాపాడుకోలేకపోతే

> **"1991లో సోషలిజం విఫలమైందని అనుకోవద్దు. ఆ ప్రయోగంలో కొన్ని లోపాలు జరిగాయి. ఒక శాస్త్రవేత్త ప్రయోగం చేస్తూ ఉంటాడు. నోబుల్ ప్రైజులు వస్తూ ఉంటాయి. ఎన్నిసార్లు ప్రయోగం చేస్తాడు? ఎన్ని లోపాలు జరుగుతుంటాయి? లోపాలు తెలుసుకొని మళ్లీ వాటిని ఎన్నిసార్లు సవరిస్తుంటాడు? సోషలిజం నిర్మాణం కూడా ఒక రకమైన ప్రయోగం."**

సోషలిజం నిర్మించుకోవడం తర్వాత సంగతి. అసలు మానవ మనుగడకే ముప్పు వస్తుంది. ముందు మానవుడి మనుగడ సాగాలి. భూమి మనుగడ సాగాలి. జీవ వైవిధ్యం సాగాలి అంటే పెట్టుబడి దారి విధానం నాశనం కావాలి. ఇంకో మార్గ మేది లేదు. పెట్టుబడిదారి విధానం మొత్తం ప్రపంచంలోని వనరులన్నింటినీ లాభం కోసం దోచేస్తున్నది. కొండలన్నీ నుజ్జునుజ్జు చేస్తు న్నది. నీళ్లను, గాలిని కాలుష్యం పాల్జేస్తున్నది.

పర్యావరణాన్ని నాశనం చేయడం, వన రుల వృధా చేయడం పెట్టుబడిదారీ విధాన లక్షణం. చిరిగిపోకుండా, వెలిసిపోకుండా ఉ న్నంతకాలం మనం బట్టలు వాడితే పత్తి ఎంత తక్కువ అవసరం అవుతుందో ఆలోచించండి. కానీ పెట్టుబడిదారీ విధానం ఒప్పుకోదు. దానికి టర్నోవర్ కావాలి. ప్రజల సౌకర్యం, వనరుల పొదుపు కాదు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా తిండి, ఆహార వస్తువులు ఎంత వృధా అవు తున్నాయంటే..వృధా కాకుండా మనం వాటిని వినియోగించినట్లయితే ప్రపంచంలో రోజు వృధా అయ్యే ఆహారంతో పేదలందరికీ ఉచి తంగా ఆహారం అందిచవచ్చు. కానీ లాభాపేక్ష ఒప్పుకోదు. పెట్టుబడిదారి విధానం మనల్ని వినియోగదారీ యంత్రాలుగాతయారు చేస్తోంది. ప్రకృతి వనరులను వృధా చేస్తున్నది. తన లాభం కోసం మొత్తం సమాజాన్ని, మనిషిని, ప్రకృతిని పెట్టుబడిదారి విధానం నాశనం చేస్తున్నది. వన రులన్నిటిన్ని ఈ తరానికే కాదు భవిష్యత్ తరానికి కూడా సక్రమంగా వినియోగించుకొనేలా అందించాలంటే సోషలిజం రావాల్సిన అవసరం వుంది.

1991లో సోషలిజం విఫలమైందని అనుకోవద్దు. ఆ ప్రయోగంలో కొన్ని లోపాలు జరిగాయి. ఒక శాస్త్రవేత్త ప్రయోగం చేస్తూ ఉంటాడు. నోబుల్ ప్రైజులు వస్తూ ఉంటాయి. ఎన్ని సార్లు ప్రయోగం చేస్తాడు? ఎన్ని లోపాలు జరుగుతుంటాయి? లోపాలు తెలుసుకొని మళ్లీ వాటిని ఎన్నిసార్లు సవరిస్తుంటాడు? సోషలిజం నిర్మాణం కూడా ఒక రకమైన ప్రయోగం. 1917 విప్లవానికి ముందు సోషలిజాన్ని జయప్రదంగా నిర్మించిన నమూనా ప్రపంచం ముందు లేదు. మొదటిసారి సోవియట్ ప్రయోగం చేశారు. ఆ ప్రయోగం నుంచి గుణపాఠాలను నేర్చుకున్నాం. మరింత మెరుగైన ప్రయోగాన్ని రాబోయే కాలంలో చేస్తాము. ఆ రకంగా మనం మంచి సోషలిజాన్ని నిర్మిస్తాం. కానీ ఇప్పుడున్న పెట్టుబడి దారి విధానానికి ప్రయోగాలు చేసే శక్తిలేదు. తనను తాను మార్చుకోగలిగే స్వభావం దానికి లేదు. ఎందు కంటే అది లాభం మీద ఆధారపడి ఏర్పడింది. వినాశనం లాభం తెస్తుందనంటే అది వినాశనం చేయడానికైనా సిద్ధం. ప్రకృతిని నాశనం చేస్తే లాభం వస్తుందనుకుంటే ప్రకృతిని నాశనం చేయడానికైనా సిద్ధం. యుద్ధం తెస్తే లాభం వస్తుందనుకుంటే యుద్ధాన్ని చేయడానికైనా సిద్ధం. ఆడ, మగలకి, తెగలకి, భాషలకి వీటిన్నిటికీ తంపులు పెట్టి, వైషమ్యాలు పెంచితే లాభం వస్తుందనుకుంటే ఆ రకంగా చేయడాని కైనా సిద్ధం. దానికి శాంతిగా ఉండటం, తగా దాలు లేకుండా ఉండటం, దోచుకోకుండా ఉండటం చేతకాదు. పెట్టుబడిదారి విధానం యొక్క గత రెండున్నర దశాబ్దాల చరిత్ర కూడా ఈ విషయాన్నే చెపుతున్నది. ఈ విషయాన్ని ఇప్పుడు ప్రజలు స్వానుభవం నుంచి అర్థం చేసుకుంటున్నారు. సోషలిజం మంచిది కాదేమో నని 1991లో చాలా మంది అనుకున్నారు. ఈ రోజు అనేకమంది రకరకాల కారణాలతో ఉద్యమాల్లోకి, పోరాటాల్లోకి వస్తున్నారు. అవి ఉధృతమైన స్థాయికి రావడానికి కొంత సమయం తీసుకోవచ్చు. కానీ ఆ దిశగా అడు గులు కనబడు తున్నాయి. మనం నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు పోవాల్సిన అవసరముంది.

ఈ రోజు భారతదేశంలో చూసుకున్నా బిజెపి, ఎన్డీయే వచ్చిన తర్వాత ఈ మత వైషమ్యాలు, దళితులు, మైనార్టీలు, మహిళల మీద దాడులు పెరుగుతున్నాయి. సమాజాన్ని విచ్ఛిన్నం చేసి ముక్కలుముక్కలు చేసి తగాదాలు పెట్టే పరిస్థితి పెరుగుతున్నది. వీటన్నిటిని నిర్మూ లించి మనమందరం సామరస్యంగా, సంఘీ భావంగా, ఐక్యమత్యంగా ఈ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే పెటుట్టబడిదారి విధానం వల్ల కాదు. ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో 15 లక్షల ఎకరాల భూములు గుంజుకోబోతున్నారు. మొత్తం నదులు, కొండలన్నీ ప్రయివేటు వారికి ఇచ్చేస్తున్నారు. ప్రజల సంపదనంతటినీ వారికే (పెట్టుబడిదారులకే) అప్పజెప్పే పద్ధతిలో వుంటే, ప్రజలందరినీ రోడ్డు మీద వేసే పరిస్థితి వుంటే, అటువంటి పెట్టుబడిదారి విధానాన్ని ఎందుకు అంగీకరించాలి? ఈ విషయాలను ప్రజలు ఆలోచిస్తున్నారు. ఇటువంటి సందర్భంలో మనం అక్టోబర్ విప్లవం యొక్క శత వార్షికో త్సవం జరుపుకుంటున్నాం. పెట్టుబడిదారి విధానం వల్ల సమస్యలు పరిష్కారం కావు, దీన్ని నమ్ము కుంటే ప్రపంచమూ, మానవ మనుగడ దెబ్బతినే ప్రమాదముంది, ప్రత్యామ్నాయం చూసుకోవా ల్సిందే, ఆ ప్రత్యామ్నాయం సోషలిజం... అన్న అక్టోబర్ విప్లవ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్ళాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# ఉమ్మడి పౌరస్మృతిపై సంఘ్ పరివార్ కపటనాటకం



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**బృందాకరత్**

వివిధ సమూహాల మధ్య గాని, ఒకే సమూహంలో గాని సమానత్వంతో సంబంధం లేని 'ఏకీకృత' భావనను ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. ముందుకు తెస్తున్నవి. 'ఏకీకృత' అంశాన్ని 'సమానత్వం'తో గందరగోళపరచకూడదు. 'ఏకీకృతం' సమానత్వాన్ని ఖచ్చితంగా ఇస్తుందనే నమ్మకం లేదు.

ఇస్లాం సాంప్రదాయం కాని, మహిళలు అసంబద్ధమైనదిగా భావిస్తున్న త్రిపుల్ తలాక్‌ను నిషేధించాలని ముస్లిం మహిళలు చేస్తున్న ఉద్యమానికి సిపిఐ(యం) తన పూర్తి మద్దతును ప్రకటిస్తోంది. పురుషులు, మహిళల తేడా లేకుండా ఈ డిమాండ్ ముస్లింలో ఎక్కువ మంది మద్దత్తును కూడట్టగలిగింది. ముస్లిం మహిళలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేక సంఘాలు ఈ మోసపూరితమైన ఆచారాన్ని వ్యతిరేకిస్తూ గత దశాబ్దంలో వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు లక్షలాది సంతకాలు సేకరించాయి. కాని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పర్సనల్ చట్టాలలో సంస్కరణలకు మద్ధతిచ్చే వారి గొంతుకలను విస్మరించింది. ముస్లిం పర్సనల్ లా బోర్డుతో పలు దఫాలు జరిగిన చర్చలు ఫలించలేదు. ముస్లిం తెగలైన అహ్లె హదీస్, షియా వర్గాలు తక్షణ, ఏకపక్ష తలాక్‌ని గుర్తించటం లేదు.

సుప్రీంకోర్టులో నడుస్తున్న ఒక పిటీషన్ ద్వారా విషయం వెలుగులోకి వచ్చింది. ముస్లిం పర్సనల్ లా బోర్డు సుప్రీంకోర్టుకిచ్చిన సమాధానంలో కూడా ఈ విషయంలో అంతర్గత సవరణకు అవకాశం లేదు అని చెప్పింది. ఏ ఇతర ముస్లిం దేశాలు పాటించని ఈ సాంప్రదాయాన్ని, మత విశ్వాసాలను పరిరక్షించే పేరుతో ముస్లిం నాయకులు చేస్తున్న ప్రకటనలు పితృస్వామిక భావజాలంతో కూడి, పురుషుల హక్కులను కాపాడటం తమ ప్రాథమిక విధి అని సూచిస్తున్నాయి. మత విశ్వాసాలకంటే ఉన్న హక్కులను కాపాడుకోవటమే వారికి ముఖ్యమైనదిగా అనిపిస్తుంది. అందుకనే ఈ సాంప్రదాయాన్ని రద్దు చేయాలనే డిమాండుకు అన్ని లౌకిక శక్తులు తమ సంపూర్ణ మద్దతును ఇవ్వాలి. తమ హక్కుల కోసం ఉద్యమిస్తున్న ముస్లిం మహిళల చైతన్యాన్ని మహిళా హక్కుల రక్షణ పేరుతో తమ ముస్లిం వ్యతిరేక మతతత్వ ఎజెండాను ముస్లిం సమాజంపై రుద్దడానికి మోడీ ప్రభుత్వం చేసే సిగ్గుమాలిన ప్రయత్నానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంతో ఈ పోరాటాన్ని అనుసంధానించాలి. 'పర్సనల్ చట్టాలు' రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా ఉండాలి' అని అరుణ్‌జైట్లీ చెప్పారు. రవిశంకర్ ప్రసాద్ 'లౌకిక దేశం'లో మత స్వేచ్ఛ అంటే అమానవీ యతను అంగీకరించటం కాదు అని చెప్పారు. హిందూ చట్టాలకు సంబంధించి సంస్కరణలు అయిపోయాయి, ముస్లిం చట్టాలలో సంస్కరణలు అవసరం అని వారు చెప్పారు.


వీరి కపటత్వానికి అంతులేదు. హిందూ చట్ట సంస్కరణలును తీవ్రంగా వ్యతిరేకించిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ లాంటి వ్యక్తులను కలిగిన పార్టీ ఇది. ఉన్నత కులాల మనువాద సిద్ధాంతం ముందు తల వంచకుండా హిందూ చట్టంలో సంస్కరణల కోసం పట్టుబట్టినందుకు డా॥ అంబేద్కర్‌ను ఆయన తీవ్రంగా నిందించారు. అలాంటి వారు ఈ రోజు పర్సనల్ చట్టాలు రాజ్యాంగానికి అనుగుణంగా ఉండాలని దేశానికి బోధిస్తున్నారు.

హిందూ పర్సనల్ చట్టాల చట్రంలోని హిందూ వారసత్వ చట్టం, సంరక్షణ, దత్తత చట్టాలు వివక్షాపూరితంగా, మహిళలకు వ్యతిరేకంగా ఉన్నాయి. జైట్లీ బృందం ఎందుకు దీనిని రాజ్యాంగానికి అనుగుణంగా మార్చటం లేదు. లౌకిక చట్టాలకు తాము బద్ధులమని చెప్పుకునే వారి అనుయాయులు రాజస్థాన్‌లో బి.జె.పి. ముఖ్యమంత్రి మద్దతుతో 'సతి' వ్యతిరేక చట్టాన్ని వ్యతిరేకిస్తూ 'సతి' ఆచారాన్ని సమర్ధిస్తూ కత్తులతో వీరంగం వేస్తున్నారు. ఇది మహిళా హక్కుల పరిరక్షణ అవుతుందా? వారు ఖాప్ పంచాయితీలను ఎందుకు సమర్ధిస్తున్నారు? రాజ్యాంగ వ్యతిరేక శక్తులైన ఖాప్ పంచాయితీలను నిషేధిస్తూ చట్టాన్ని తీసుకురావడానికి ఎందుకు తిరస్కరిస్తున్నారు? ఈ విధంగా మనం చాలా ఉదాహరణలు చెప్పుకోవచ్చు. అన్ని పర్సనల్ చట్టాలకు సంస్కరణలు అవసరం. ముస్లిం పర్స నల్ చట్టాలను మాత్రమే ఎత్తి చూపి బి.జె.పి. మరోసారి ఈ సమస్యను మతపరం చేయాలని చూస్తున్నది.

దురదృష్టవశాత్తు సుప్రీంకోర్టుతో సహా న్యాయస్థానాలలో కూడా బి.జె.పి. సంకుచిత ఆలోచనను సమర్ధించే వారున్నారు. ఉదాహరణకు హిందూ వారసత్వ చట్టంలోని వివక్షాపూరిత సాంప్రదాయాలకు వ్యతిరేకంగా ఒక హిందూ మహిళ వేసిన పిటీషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున న్యాయవాది ముస్లిం పర్సనల్ చట్టాలలోని వివక్షను వ్యాఖ్యానించాడు. కేసుతో దానికి సంబంధం లేదు అని చెప్పకుండా ఆ విషయంపై కూడా పిటీషన్ ఫైల్ చేయమని సంబంధిత న్యాయవాదికి చెప్పడం, ఆయన ఉత్సాహంగా ఆ పని చేయడం జరిగింది. ఆ పిటీషన్‌ను కూడా న్యాయస్థానం విన్నది. ఈ విధంగా న్యాయ వ్యవస్థలోని పక్షపాతం కోర్టులు తరచుగా వ్యక్తం చేసే అసమంజసమైన వ్యాఖ్యల రూపంలో వ్యక్తమవుతున్నాయి.

ఆర్.ఎస్.ఎస్.కు సంబంధించిన వ్యక్తుల నాయకత్వంలో నడపబడుతున్న సంస్థల మద్దతుతో మోడీ ప్రభుత్వం సృష్టించిన వాతావరణంలో ముస్లిం సమాజంలోని సంస్కరణ వాదుల పోరాటానికి ఆటంకాలు పెరిగాయి. మోడీ ప్రభుత్వ మతతత్వ దాడితో ముస్లిం సమాజంలోని మతతత్వ వాదులు బలపడ్డారు. ముస్లింలలో స్త్రీ సమానత్వం కోసం పోరాడుతున్న వారు కూడా ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టబడ్డారు. ఇంకొక

**"మెజారిటీ మత సమూహాలతో పాటు వివిధ మత సమూహాల పర్సనల్ చట్టాలు మహిళల పట్ల వివక్ష చూపే విధంగా ఉన్నాయి తప్ప భారత రాజ్యాంగం పౌరులకు నిర్దేశించిన విధంగా మహిళలకు సమాన హక్కులు అనుభవించటానికి అవకాశం కల్పించటం లేదు. అందుకని వివిధ పర్సనల్ చట్టాలలో సంస్కరణలు అత్యంతావశ్యం. ఈ పని వెంటనే జరగాలి."**



దేవాలయ ప్రదేశం కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

విషయం. బి.జె.పి. మరోసారి కావాలనే త్రిపుల్ తలాక్ విషయాన్ని ఉమ్మడి పౌరస్మృతితో కలుపుతున్నది.

మోడీ ప్రభుత్వం నియమించిన లా కమీషన్ విడుదల చేసిన అనవసరమైన ప్రశ్నావళి ద్వారా కావాలనే ఉమ్మడి పౌరస్మృతి విషయాన్ని తీసుకువచ్చింది. ప్రభుత్వం ప్రత్యేకంగా చెప్పకుండా లా కమీషన్ ప్రశ్నావళిని విడుదల చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ప్రభుత్వం దీనిని ప్రోత్సహించే ముందు, ఇంతకు ముందు ప్రభుత్వం మహిళల స్థాయి మీద వేసిన అధికార కమిటీ చేసిన సిఫార్సులను విస్మరించారు. పామ్ రాజ్‌పుట్ ఆధ్వర్యంలోని ఈ కమిటీ 'అందరికీ ఒకే చట్టం అనే దానికంటే మహిళలందరూ వారు ప్రభుత్వ చట్టాలు, లేదా పర్సనల్ చట్టాలలో దేనిని ఎంచుకొన్నప్పటికీ వారు భారత రాజ్యాంగం వాగ్దానం చేసిన సమానత్వాన్ని అనుభవించగలగాలి' అని సూచించింది.

లా కమీషన్‌లో ఇటీవల నియమించిన సభ్యులు ఆర్.ఎస్.ఎస్. అనుయాయులు. లా కమీషన్ నోటీసు తయారు చేసిన విధానం కూడా "వివిధ సంస్కృతీ, సాంప్రదాయాల సామరస్యతకు' అని ప్రస్తావించింది. ఇది 'ఒక జాతి – ఒక సంస్కృతి' అనే హిందూత్వ ఎజెండాను రుద్ది భారతదేశం యొక్క భిన్న సంస్కృతులను నాశనం చేసే విధంగా ఉంది. కాని అది మహిళల హక్కులను పరిరక్షించేదిగా లేదు. ఈ విషయాన్ని ప్రత్యేకంగా చూడాలనే కేంద్ర మంత్రి, బి.జె.పి. నాయకుడు వెంకయ్య నాయుడి ప్రకటన ఆ పార్టీ యొక్క ద్వంద్వ నీతికి నిదర్శనం. మహిళల హక్కుల విషయంలో వారికి అండగా నిలబడతానని చెపుతూ, ఉమ్మడి పౌరస్మృతి పేరుతో బి.జె.పి. మొత్తం ముస్లిం సమాజంపై దాడిని ఎక్కుపెడుతున్నది.

అసంబద్ధమైన త్రిపుల్ తలాక్ సాంప్రదాయం రద్దు కావాలనే డిమాండ్‌కు మద్దతిస్తూనే ఉమ్మడి పౌరస్మృతిని బలవంతంగా రుద్దడాన్ని సి.పి.ఐ(యం) వ్యతిరేకిస్తుంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలోని సెక్షన్ 44 భారతదేశ భూభాగంలోని పౌరులందరికీ ఉమ్మడి పౌరస్మృతి అమలయ్యేట్లు రాజ్యం తన నిరంతర ప్రయత్నాలను కొనసాగించాలని చెబుతున్నది. కేంద్ర ప్రభుత్వము ఈ ఆదేశిక సూత్రాన్ని అమలు చేయటానికి ఎలాంటి చొరవ చూపటం లేదని అనేక సందర్భాలలో సుప్రీంకోర్టు యొక్క వివిధ బెంచ్‌లు అసంతృప్తిని వ్యక్తం చేశాయి. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న 2003లో అలాంటి తీర్పు వచ్చినపుడు సి.పి.ఐ(యం) ఒక ప్రకటనను విడుదల చేసింది. "హిందుత్వ వేదికగా జరుగుతున్న మతతత్వ రాజకీయాల దాడి ఫలితంగా మైనారిటీలలో, ప్రత్యేకంగా ముస్లింలలో అభద్రతా భావం పెరుగుతున్న సందర్భంలో సుప్రీంకోర్టు సూచించిన 'ఉమ్మడి పౌరస్మృతి' జాతీయ సమగ్రతకు దోహదపడకపోగా, వ్యతిరేక ఫలితాలనిచ్చే ప్రమాదముందని" ఆ ప్రకటనలో పేర్కొంది.

మెజారిటీ మత సమూహాలతో పాటు వివిధ మత సమూహాల పర్సనల్ చట్టాలు మహిళల పట్ల వివక్ష చూపే విధంగా ఉన్నాయి తప్ప భారత రాజ్యాంగం పౌరులకు నిర్దేశించిన విధంగా మహిళలకు సమాన హక్కులు అనుభవించటానికి అవకాశం కల్పించటం లేదు. అందుకని వివిధ పర్సనల్ చట్టాలలో సంస్కరణలు అత్యంతావశ్యం. ఈ పని వెంటనే జరగాలి".

ఆ సమయంలో వాజ్‌పాయి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ రోజు ఆ దాడి ఇంకా తీవ్రరూపం దాల్చింది. మైనారిటీ సమూహాలు తాము ప్రమాదంలో ఉన్నామని, తమ ఉనికిని కాపాడే సంస్థలలో రక్షణ పొందుదామని భావించే పరిస్థితిని ఈనాడు మతతత్వ రాజకీయాలు కల్పించాయి. భారతదేశంలో పర్సనల్ చట్టాల విషయంలో ఈ విధంగా జరుగుతున్నది. ఉమ్మడి పౌరస్మృతి యొక్క లక్ష్యమేమిటి? అన్ని మత సమూహాలలోని స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం, సమూహాల మధ్య స్త్రీ, పురుషులలో సమానత్వం ఉండాలనే ప్రజాస్వామిక భావన కలిగుండి. మన దేశం ఈ విషయంలో చాలా వెనుకబడి ఉంది. హిందూ, ముస్లిం ఇతర మత సమూహాలలోని స్త్రీ, పురుషులకు సంబంధించిన చట్టాలలో అసమానతలు ఉన్నాయి.

రాజ్యాంగం పౌరులందరికీ చట్టబద్ధమైన సమానత్వాన్ని కల్పించి, మత ప్రాతిపదికన వివక్షను నిషేధించినప్పటికీ ఆచరణలో అది భిన్నంగా ఉంది. మత సమూహాల మధ్య వివక్ష లేకపోయినట్లైతే సచార్ కమిటీ సిఫార్సులు, సూచనలు అవసరం లేదు. చాలా ప్రాంతాలలో వివక్ష ఫలితంగా ముస్లిం సమూహాలు షెడ్యూల్ కులాలు, తెగల కంటే పేదరికంలో ఉన్నాయి. సమూహంలోని అధిక సంఖ్యాకులకు అభివృద్ధి ఫలాలు అందకుండా ఏకీకరణ సాధ్యం కాదు.

(మిగతా 33వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# నోట్లు మోదీపాలు బతుకులు బజారుపాలు

**సిపిఐ(యం) ప్రచార విభాగం**

**2016** నవంబరు 8వ తేదీ 500, 1000 రూపాయల నోట్లను ఒక్కసారిగా రద్దు చేస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. తమ గుర్తింపుకు తగిన ఆధారాలు చూపి తమ వద్దను న్న పాత నోట్లను మార్చుకోవడమో, ఖాతాలలో జమ చేయడమో చేయాలన్నారు. ఈ నిర్ణయం భారతదేశాన్ని ఒక్కసారిగా స్థంభింప చేసింది.

మొత్తం చలామణిలో ఉన్న నోట్లలో 86 శాతం 500, 1000 రూపాయల నోట్లే. ఒక్క రాత్రిలో 14 లక్షల కోట్ల రూపాయలు చెల్ల కుండా పోయాయి. వాటి స్థానంలో కొత్తవి రాలేదు. మీ రక్తంలో 86 శాతం తీసివేసి 5 శాతం ఎక్కిస్తే ఎలా ఉంటుందో ఊహించండి. మీరు బతకరు. మోదీ ప్రభుత్వం భారత ఆర్థిక వ్యవస్థకు చేసిందిదే. దేశంలో ఉన్న అన్ని ముద్ర ణా యంత్రాలు నిర్విరామంగా పనిచేసినా రద్ద యిననోట్ల స్థానంలో కొత్త నోట్లు ముద్రించేందుకు ఆరునెలలు పడుతుందని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది.

ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాలాంటి దేశాలలో సహితం డబ్బులు అవసరం లేని ఆర్థిక వ్యవస్థ లేదు. కానీ మోదీ నాయకత్వం లోని మనదేశం రాత్రికిరాత్రే అటువంటి వ్యవస్థను ఏర్పరచాలని కలలు కంటున్నది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ నోట్ల పైనే ఆధార పడి ఉంది. 'ప్లాస్టిక్' అని పిలవబడే క్రెడిట్, డెబిట్ కార్డులు దేశంలో రెండు మూడు శాతం ప్రజల వద్ద మాత్రమే ఉన్నాయి. రిజర్వుబ్యాంకు గణాంకాల ప్రకారం " ఎలక్ట్రానిక్" పరికరాల ద్వారా జరిగిన లావాదేవీలు11లక్షల 30 వేల కోట్ల రూపాయలు మాత్రమే. భారతదేశ స్థూలజాతీయోత్పత్తి 136 లక్షల కోట్ల రూపా యలు.అంటే ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా జరిగే లావాదేవీలు 8 శాతం మాత్రమే.

ఇటువంటి ఆర్థిక వ్యవస్థలో రాత్రికిరాత్రి నోట్లు రద్దయిపోతే ఆ ప్రభావం దేశం మొత్తం పై ఉంటుంది. వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు,రోజువారి కూలీలు, గ్రామీణ కార్మికులు, ఫాక్టరీ కార్మికులు ఇంటి పనివారలు, చిన్న కొట్ల యజమానులు, మధ్యతరగతి ఉద్యోగులు తదితర సామాన్య ప్రజలే దీనివలన ఎక్కువగా నష్టపోతారు. రైతులు దేశవ్యాప్తంగా రబి పంట కు తయారవుతున్న సమయంలో నోట్ల రద్దు వలన తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు మరో ఉపద్రవం వచ్చిపడింది.ప్రధాని, రిజర్వు బ్యాంకు గవర్నర్ డిసెంబరు 31 వరకు నోట్లు మార్చుకో వచ్చని ముందు ప్రకటించినా, తగినన్ని నోట్లు ముద్రించలేక పోయినందు వలన అకస్మాత్తుగా నోట్ల మార్పిడిని నిలుపు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇది సామాన్య ప్రజలపై పడ్డ మరో పిడుగు పాటు. ప్రభుత్వం ఏ రోజుకారోజు మార్పిడి విధానాలు ప్రకటించడం (ఇప్పటికి 17 కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసింది. అందులో కొన్ని – 2000 రూపాయల వరకే సొమ్ము తీసుకొనే విధానం, పెళ్ళిళ్ళ కోసం, విత్తనాలు కొనేందుకు పాత నోట్లను అనమతించడం వగైరా)–ఇదిప్రణా ళిక, ముందు చూపు లేకపోవడాన్ని సూచిస్తోంది.

సిపిఐ(ఎం) ఈ నోట్ల రద్దును వ్యతిరేకించ డానికి కారణం, అది నల్లధనాన్ని చెప్పుకో దగ్గ స్థాయిలో వెలికి తీయకుపోగా, ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయడంతో పాటు కార్మికుల జీవనాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. డిసెంబరు 31 లేదా ఆర్థిక వ్యవస్థను ఆవరిం చిన ఈ సంక్షోభం నివారించబడి, ప్రస్తుతంవాడ కంలో ఉన్న నోట్ల స్థానంలో ప్రభుత్వం తగినన్ని కొత్త నోట్లను ప్రవేశపెట్టే వరకు సామాన్య ప్రజ లు వారి రోజువారీ అవసరాలకు 500, 1000 రూపాయల నోట్లను మార్చుకునే వీలు కల్పించా లని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

నల్లధనం దాచుకున్న వారిపై గట్టి చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎం) ఇది వరకే డిమాండ్ చేసింది. నల్లధనానికి, లంచగొండితనానికి వ్యతి రేకంగా జరిగే పోరాటాలలో సిపిఐ(ఎం), ఇత ర వామపక్షాలు ముందు వరుసలో ఉంటాయి. 2జి స్పెక్ట్రమ్, బెంగాల్‌లోని శారదా, నారద కుంభకోణాలకు, బళ్ళారిలో అక్రమ గనుల తవ్వ కం, వ్యాపమ్ కుంభకోణంతదితరాలను వ్యతి రేకించటంలో సిపిఐ(ఎం), ఇతర వామ పక్షాలు ముందున్నాయి. అవినీతి విషయంలో వామ పక్షాలు ఎప్పుడూ రాజీ పడలేదు. పడబోవు.

ఈచిన్న పుస్తకంలో నోట్ల రద్దుకు సంబంధిం చిన అనేక విషయాలు చర్చిస్తాం. నోట్లరద్దు అవినీతికి వ్యతిరేకంగానో,నల్లధనానికి వ్యతిరేకం గానో జరిగే పోరాటం కాదని, ప్రజలకు వ్యతిరే కంగా జరిగే పోరాటమని మేము ఎందుకం టున్నామో వివరిస్తాం.

**నోట్లరద్దుతో ప్రకటించిన లక్ష్యాలేమిటి?**


ఉన్న ధనమంతా, అన్నీ నోట్లు తెల్లవే. డబ్బు తో చట్టబద్ధమైన లావాదేవీలు చేయక పోయినా, ఆదాయంగా ప్రకటించకపోయినా నల్లధనంగా మారిపోతుంది. ఆదాయానికి తగ్గట్టుగా పన్ను చెల్లించకపోయినా, పరోక్ష పన్నులైన ఎక్సైజ్ పన్ను, కస్టమ్స్ పన్ను, వ్యాట్, చెల్లించకపోతే ఆ లావాదేవీలు చట్టబద్ధం కావు. అప్రకటిత ఆదాయాలవుతాయి. ఫలితంగా నల్లధనంతయా రవుతుంది. ఈ నల్లధనం, తెల్లధనం అన్నవి లావాదేవీలను బట్టి మారుతుంటాయి. పన్నులు ఎగగొట్టడం వలన నల్లధనం ఏర్పడుతుంది కాబట్టి అది సమాజానికి మంచిది కాదు. ఎందుకంటే ప్రభుత్వం అందరికి ఉపయోగపడే పనులు చేసేందుకు దానికి అందుబాటులో ఉ ండవలసిన వనరులు తగ్గుతాయి.

కంపెనీలు తప్పుడు లెక్కలు చూపిస్తున్నందు వలనే పెద్ద మొత్తాలలో నల్లధనం తయారవు తున్నదని పరిశీలనలు చెప్తున్నాయి. చట్టబద్ధం కాని డబ్బులో దీని వాటాయే 80 శాతం కన్నా ఎక్కువ ఉంటుంది. ఇది విదేశాలకు తరలిపో తుంటుంది. ఈ కంపెనీలు తమ ఉత్పత్తులను తక్కువగా చూపించి కార్మికులకు ఇస్తున్న వేతనా లు, ఇతర ఖర్చులను ఎక్కువగా చూపించి, లాభాలను తక్కువగా చూపించి పన్నులు ఎగ వేస్తుంటాయి. ఎగుమతుల విలువను తక్కువగా చూపించి దిగుమతుల విలువను ఎక్కువగా చూపించి విదేశాలకు సొమ్ము తరలించడం సర్వ సాధారణమైన విషయం. కాని మోదీగాని, అంతకు ముందున్న ప్రభుత్వాలు గాని వీటిని నివారించే దిశగా ఏ చర్యలూ తీసుకోలేదు.

**ఎంత నల్లధనముంది?**

ఎంతోమంది నిపుణులు, ఎన్నో కమిటీలు దేశంలో నల్లధనమెంతుందో అంచనా వేసే ప్రయత్నాలు చేశారు. ఇది చాలా కష్టమైన విషయం. ఎందుకంటే ఎంత మొత్తం తప్పుడు లెక్కలు చూపి దాచిపెట్టారో తెలుసుకోవడం కష్టంకదా! అయితే కొన్ని అంచనాల ప్రకారం ఇది ఆర్థిక వ్యవస్థలో 20 శాతం ఉంటుందని

**“ఇంత చిన్న మొత్తం కోసం 14 లక్షల కోట్ల నోట్లను రద్దు చేయడం సమంజసమేనా? ఐఎస్ఐ రిపోర్టు ప్రకారమే ‘ఇప్పుడు చలామణిలో ఉన్న నకిలీ నోట్లను పట్టుకోవడం, కనిపెట్టడం వలన నకిలీ నోట్లను అరికట్టవచ్చు’ ఇప్పుడు నకిలీ నోట్లను తయారు చేస్తున్న వారు భవిష్యత్‌లోనూ చేయవచ్చని ఏ మాత్రం ఇంగితమున్న వారెవ రైనా ఊహిస్తారు.”**



డబ్బుకోసం బ్యాంకు ముందు బారులు తీరిన జనం

చెబుతుండగా, కొంత మంది 66 శాతం వరకు ఉంటుందంటున్నారు. 2015-16లో భారతదేశ స్థూల జాతీయ ఉత్పత్తి 136 లక్షల కోట్లు. పై లెక్క ప్రకారం ఇందులో నల్లధనం 27 లక్షల కోట్ల రూపాయల నుండి 90 లక్షల కోట్ల రూపాయల వరకు ఉండవచ్చు.

**నల్లధనం 500, 1000 రూపాయల నోట్ల రూపంలో ఉంటుందా?**

నల్ల ఆస్తులలో 3 నుండి 5 శాతం మాత్రమే డబ్బు రూపంలో ఉంటుంది. అంటే ప్రస్తుత చర్య భారతదేశంలోని నల్ల ఆస్తులలో 1 లక్ష, 40 వేల కోట్ల రూపాయల నుండి 4లక్షల 50 వేల కోట్ల రూపాయలపై మాత్రమే ప్రభావాన్ని చూపుతుంది. అంటే మోదీ గర్వంగా ప్రకటిస్తున్న ట్టు, కొత్త సంవత్సరం కొత్త భారతదేశాన్ని ఆవిష్కరించడం ఒట్టిమాట.

మరో విషయం, ప్రభుత్వం వెయ్యి నోట్లను రద్దుచేసి 2000 రూపాయల నోట్లను ఎందుకు విడుదల చేసిందో చెప్పుకోవలసి ఉంది. ప్రజల వద్ద అందుకు తగిన చిల్లర నోట్లు లేవు కాబట్టి ఈ నోట్లు ఇప్పుడు ఎందుకూ కొరగావు.

నల్లధనవంతుల ఆస్తులను అరికట్టేందుకు ఇప్పుడు తీసుకున్న చర్యలు ఏ మాత్రం సరిపోవు.

**నల్లధనం ఎక్కడుంది?**

2012లోభారతదేశంలోనూ, విదేశాల లోనూ నల్లధనాన్ని అదుపు చేసేందుకు వేసిన కమిటీకి కేంద్ర ప్రత్యక్ష పన్ను బోర్డు ఛైర్మన్‌ను అధ్యక్షునిగా నియమించారు. “నోట్ల రద్దు వలన నల్ల ధనాన్ని నిర్మూలించలేం. ఎందుకంటే అది బినామీ ఆస్తుల రూపంలోనూ, బులియన్‌రూపం లోనూ, నగల రూపంలోనూ ఉంటుందని” అది సిఫార్సు చేసింది.

ప్రభుత్వ రిపోర్టుల ప్రకారమే ధనిక భారతీ యులు, పన్ను ఎగవేత దారులు నల్లధనాన్ని విదేశీ బ్యాంకులలోనూ, బంగారంలోనూ, బులి యన్ల రూపంలోనూ, రియల్ ఎస్టేట్ రంగం లోనూ, భూమిరూపంలోనూ దాచుకున్నారు. ప్రభుత్వం వద్ద 680 స్విస్ బ్యాంక్ ఖాతాల వివరాలున్నాయి. పన్నుల స్వర్గధామాలలో ఖాతాలున్న ఇంకా చాలా మంది పేర్లు వికీలీక్స్ ద్వారానూ, పనామా పేపర్స్ ద్వారానూ వెలుగులోకి వచ్చాయి. కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకూ రెండు దేశాలలో పన్నులు పడకుండా భారతదేశానికి ఈ పన్నుల స్వర్గధామ దేశాలతో ఒప్పందాలున్నాయి. నల్లధనం ఏర్పడడానికి ఇవి కూడా కారణం.భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు పేర్లను వెల్లడించక్కర్లేని ‘పార్టిసిపేటరీ నోట్స్’ ను భారత ప్రభుత్వం అంగీకరించింది. ఇదే నల్లధనానికి దారివేస్తున్నది. కొన్ని నిబంధన లు పెట్టినప్పటికీ ‘పార్టిసిపేటరీ నోట్స్’ను నిషేధించలేదు.

**నోట్ల నిషేధం నకిలీ నోట్ల ముద్రణను నిలువరిస్తుందా ?**

లేదు. ఆపలేదు; కిందటేడు దేశంలో ఎంత శాతం నకిలీ నోట్లు ఉంటాయో అంచనా వేసి ఇవ్వమని జాతీయ పరిశోధనా ఏజెన్సీ (ఎన్.ఐ.ఏ) కలకత్తాలోని స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐ.ఎస్.ఐ)ను అడిగింది. ఎన్.ఐ.ఏ లోని విభాగాలు, సిబిఐ, ఐబి, డిఆర్ఐ, ఆర్ అండ్ ఏడబ్లు, పోలీసు విభాగాలూ ఇందుకవసరమైన గణాంకాలను సమర్పించాయి. వీరి అంచనా ప్రకారం 400 కోట్ల రూపాయల నకిలీ నోట్లు మాత్రమే చలామణిలో ఉన్నాయి. అంటే పదిలక్షల రూపాయలలో 250 రూపాయలు మాత్రమే – 0.025 శాతం. ప్రభుత్వం గత ఆగస్టులో దీనిని అంగీకరించింది. ఆర్థికశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ఈ గణాంకాలనే రాజ్యసభలో వెల్లడించారు. ప్రభు త్వం కొద్దిరోజుల క్రితం వీటినే సుప్రీంకోర్టుకు కూడా అందజేసింది.

ఇంత చిన్న మొత్తం కోసం 14 లక్షల కోట్ల నోట్లను రద్దు చేయడం సమంజసమేనా? ఐఎస్ఐ రిపోర్టు ప్రకారమే “ఇప్పుడు చలామణిలో ఉన్న నకిలీ నోట్లను పట్టుకోవడం, కనిపెట్టడం వలన నకిలీ నోట్లను అరికట్టవచ్చు.” ఇప్పుడు నకిలీ నోట్లను తయారు చేస్తున్న వారు భవిష్యత్‌లోనూ చేయవచ్చని ఏ మాత్రం ఇంగితమున్న వారెవ రైనా ఊహిస్తారు.నకిలీనోట్లు లేకుండా చేయడం కోసం 14 లక్షల కోట్ల రూపాయల నోట్లను రద్దుచేసి అర్థరహితం.

**ఉగ్రవాదాన్ని ఈ రద్దు నిలవరిస్తుందా?**

ఉగ్రవాదానికి, ఉగ్రవాద చర్యలకూ దేశం మొత్తం వ్యతిరేకం. కాని ఉగ్రవాదులు డబ్బు సంచులతో దేశంలో తిరగడం లేదు. ఉగ్రవాదా నికి నిధులు సమకూర్చే దారులను, ఉగ్రవాదాన్ని తయారు చేస్తున్న రాజకీయ విధానాలను ఎదుర్కొవాలి. నిఘా విభాగాలను ఇతర అధికారయంత్రాంగాలను పటిష్టపరచాలి. నోట్లు రద్దుచేసిన రెండు వారాలలోనే కొత్త 2000 రూపాయల నోట్లను సరిహద్దులో చనిపోయిన ఇద్దరు ఉగ్రవాదుల వద్ద కనుగొనడం ఆశ్యర్యానికి గురిచేసింది. అంటే ఉగ్రవాదాన్ని అంతం చేయా లంటే నోట్లను రద్దు చేయడం కాదు. ఉగ్ర వాదానికి ఊతం ఇచ్చే దారులను మూసివేయా లని దీని వలన అర్థం అవుతున్నది.

**ఎంతో లాభాన్నిచ్చే ఈ అంశం కోసం కొంత బాధను భరించమని ప్రభుత్వం చెపుతున్నది నిజమేనా?**

ప్రభుత్వంలోని మంత్రులు, బిజెపి నాయకు లు ఈ రకంగా మాట్లాడడం సిగ్గుచేటు. దారు ణం. నోట్ల మార్పిడి కోసం క్యూలలో నిలబడి ఇప్పటికి 71 మంది మరణించారు. నోట్లు

> **"తమ సొమ్ము బ్యాంకులలో జమచేయమని సామాన్య జనాన్ని ప్రభుత్వం ఇప్పుడు బలవంత పెడుతున్నది. ప్రతి ఓటరు ఖాతాలో 15 లక్షల నల్లధనం వేస్తానన్న ఎన్నికల వాగ్దానం గాలిలో కలిసిపోయింది. కాని ఈ రోజు ప్రజలు తమ సొమ్మునే బ్యాంకుల నుండి తీసుకోలేకపోతున్నారు."**

మారకపోవడం వలన, సరైన వైద్యం అందక చిన్న పిల్లలు చనిపోతున్నారు.

మన జవాన్లు దేశ సరిహద్దులలో నిద్రమాని కాపలా కాస్తుండగా బ్యాంకుల ముందు క్యూలలో మనం నిల్చుని మన దేశభక్తిని చాటు కోవాలి అని అంటున్నారు. దేశ సరిహద్దులో ఉన్న జవాను, ఓ రైతు కొడుకు. ఈ రోజు అందరికంటే నష్టపోయినది రైతులే. పంటను అమ్ముకునేందుకు వచ్చిన లక్షలాది మంది రైతులకు కొనుగోలు కేంద్రాలలో డబ్బులు ఇవ్వడం లేదు. వారు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల ముందు క్యూలలో పడిగాపులు పడుతున్న వారిలో, విత్త నాల కొరకు కొట్ల ముందు నిలుచున్న వారిలో ఈ రైతులూ ఉన్నారు. రైతులు ఆందోళనలో ఉంటే జవాన్లు సంతోషంగా ఉండలేరు.




కాని ప్రభుత్వం, మోదీ కూడా ప్రజల బాధలు సమంజసమైనవని చెప్పేందుకు జవాన్ల పై నకిలీ ప్రేమను ఒలకబోస్తున్నారు. క్యూల్లో నిల్చోవడం వలన నల్లధనాన్ని నిర్మూలించలేము. అంతకంటే ముఖ్యమైన విషయం మరొకటి ఉంది. కష్టపడి ఆర్జించిన డబ్బును తీసుకునేందుకు క్యూలో గంటల తరబడి నిల్చోవడం కష్టం ఒకటేకాదు. క్యూలలో నిలబడేందుకు ఉపాధిని కోల్పోవడం, పనులకు వెళ్లేందుకు వీలవకపో వడం, అందుమూలంగా జీవన భృతిని కోల్పో వడం మరింత నష్టం కలిగించే విషయం.ఆర్థిక వ్యవస్థలో నోట్ల రూపంలో ఉన్న డబ్బుతో ముడిపడి ఉన్న పెద్ద భాగం ఈ రోజు స్థంభించి పోయింది. అసంఘటిత రంగంలో పనిచేస్తూ తక్కువ వేతనాలు పొందుతున్న వారే.దీనివలన నష్టపోయారు. నోట్ల రద్దు వలన వస్త్ర, దుస్తుల, చర్మం, నగల వంటి పరిశ్రమలలో గత రెండు వారాలలో 4 లక్షల మంది ఉపాధి కోల్పోయి నట్టు ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కౌన్సిల్ అంచనా వేసింది. ఈ రంగాలలో ఉన్న 320 లక్షల పనివారిలో 60 లక్షల మందికి జీతాలు చెల్లించబడలేదు. ఇది నిజానికి తక్కువగా అంచనా వేసినట్టే. ఒక్క ఆగ్రాలోనే 1.75 లక్షల మంది చర్మ పరిశ్రమలో పనిచేస్తున్నవారు నష్టపోయారు. ఇందులోనూ అత్యధికులు దళితులు అయినందువలన ఆభారం వారిపైనే పడింది. అలాగే తోటలలో పనిచేసే 20 లక్షల మంది పనివారు నష్టపోయారు. అసంఘటిత రంగంలో పనిచేసే కోట్లాది మంది ఈ విధంగా నష్టపోయారు.

ఉదాహరణకు డబ్బుల రూపంలోనే లావా దేవీలు జరిగే వ్యవసాయం, చిల్లర వర్తకం, నిర్మాణరంగాలను తీసుకోండి. ఇవే భారత దేశంలో అత్యధికులకు ఉపాధి నిచ్చే రంగాలు. అందువలన ఈ రంగాలలో కుదుపుల ప్రభావం కోట్లాది మంది ప్రజల ఉపాధిపై పడుతుంది. వారి జీవితాలు అతలాకుతలం అవుతాయి.

కార్మిక సంఘాలు ఇచ్చే పిలుపుల మేరకు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం ఒక రోజు సమ్మె చేస్తేనే వేల కోట్ల రూపాయల నష్టం జరిగిందని గగ్గోలు పెట్టేవారు క్యూలలో నిలబడ డం వలన పనులకు వెళ్ళలేక అనుత్పాదకంగా రోజులు గుడుస్తుంటే మౌనం వహిస్తున్నారెందుకు?

**మన ప్రధాని పేదల పక్షపాతి అనడం సబబేనా?**

ధనికులకు సహాయం చెయ్యడం. పేదల కోసమే అని చెప్పడం పుండు మీద కారం చల్లిన ట్టుంది. మోదీ తన కాల పరిమితిలో మొదటి సగం 'వ్యాపా రం సులభంగా' చేసేందుకు వినియోగిం చారు. అందుకు తోటి వ్యాపారుల అభినందనలు అందుకున్నారు. ఇవి ధనవంతు లకు ఇచ్చిన అనేక రాయితీల రూపంలో ఉన్నాయి.

తమ సొమ్ము బ్యాంకులలో జమ చేయమని సామాన్య జనాన్ని ప్రభుత్వం ఇప్పుడు బల వంత పెడుతున్నది. ప్రతి ఓటరు ఖాతాలో 15 లక్షల నల్లధనం వేస్తానన్న ఎన్నికల వాగ్దానం గాలిలో కలిసిపోయింది. కాని ఈ రోజు ప్రజలు తమ సొమ్మునే బ్యాంకుల నుండి తీసుకో లేకపో తున్నారు. ప్రజలు తమ డబ్బులను తీసు కోవడానికి అనుమతులు తీసుకోవలసిన పరిస్థి తులు ఎప్పుడూ ఏ దేశంలోనూ తలెత్తలేదు.

గ్రామీణ సహకారరంగంలో సొమ్ము పెట్టు కున్న వారి పరిస్థితి మరింత దయనీయం. నియంతృత్వ ధోరణిలో సహకార బ్యాంకుల లావాదేవీలు పూర్తిగా నిలిపివేయబడ్డాయి. ఉదాహరణకు కేరళ గ్రామీణ సహకార బ్యాంకులలో రెండు లక్షల కోట్ల రూపాయలు నిలిచిపో వటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.

**ధనికులకు స్నేహ హస్తం :**

ప్రభుత్వ విధానాలు పేదలకు సహాయం చేయడం అటుంచి పెద్దపెద్ద వ్యాపారులు తీసు కున్న అప్పులను రద్దు చేయమని బ్యాంకులను నిర్దేశించాయి.

వీరు 11లక్షల కోట్ల రూపాయలు ఈరోజు బ్యాంకులకు బకాయి పడ్డారు. చిన్న రైతులో, వర్తకులో, విద్యార్థులో అప్పుతీసుకుని కట్టకపోతే నోటీసులిస్తారు. ఆస్తులు జప్తు చేస్తారు. జైలుకి పంపుతారు. అప్పు ఎగగొట్టిన పెద్ద వ్యాపారినె వరినైనా ఈ ప్రభుత్వం శిక్షించిందా?

అందుకు భిన్నంగా ప్రభుత్వం వీరు తీసు కున్న అప్పులలో 2 లక్షల కోట్ల రూపాయలు రద్దు చేసింది. అందులో విజయ్‌మాల్యా లాంటి వారికి 1200 కోట్ల రూపాయలు బహుమతిగా ఇవ్వబడింది. ఇదేనా ప్రభుత్వ పేదల పక్షపాత

> **"రెండు జాబితాల్లోనూ ఒక పేరు ఉంది. ఒక జాబితాలో ఒక పేరు పక్కన 25 కోట్ల రూపాయలు, మరో జాబితాలో అదే పేరు పక్కన 55 కోట్ల రూపాయలు రాసి, ఆ పేరు దగ్గర గుజరాత్ ముఖ్యమంత్రి అని వ్రాసి వుంది. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి ఎవరు? సిబిఐ ఆ జాబితాతో పురోగతి ఎందుకు సాధించలేదు."**

విధానం!

**ఈ సమస్యలు తాత్కాలికమేనా?**

దీని ఆర్థిక ప్రభావ విస్తృతిని ఖచ్చితంగా అంచనా వేయడం చాలా కష్టం. కాని కొంత మంది విజ్ఞులు అంచనా వేసి అదిరిపోయారు. ఉదాహరణకి 2016-17 చివరి అర్ధసంవత్సర జాతీయ స్థూలఉత్పత్తి పెరుగుదల 0.5 శాతానికి పడిపోతుందని ఎమ్‌బిట్ కాపిటల్ అంచనా వేసింది. అంటే సంవత్సర సగటు పెరుగుదల 3.5 శాతం ఉంటుంది. 2017-18లో ఆర్థిక వ్యవస్థ 5.8 శాతం అభివృద్ధి సాధిస్తుందని అంచనాకొచ్చింది. ఈ అంచనాలు ఉజ్జాయింపుగానైనా నిజమైతే పరిస్థితి 2008 నాటి సంక్షోభం కన్నా తీవ్రంగా ఉంటుంది.

సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఇకానమీ (సిఎంఐఇ) అనే మరోసంస్థ అంచనా ప్రకారం నోట్ల రద్దు వలన 1 లక్ష 28 వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అంటే సగటున ప్రతి భారతీయ పురుషుడు, స్త్రీ, శిశువు 1000 రూపాయలు నష్టపోతున్నాడన్నమాట. దీని భారం పేద ప్రజలపై మరింత ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఎక్కువమంది పేద ప్రజలు పనిచేసేది అవ్యవస్థిత రంగంలోనే.

ప్రైవేటు సంస్థలు ఈ అంచనాలు వేశాయి. ప్రస్తుత నోట్ల రద్దు వలన ఆర్థిక వ్యవస్థ పెద్ద కుదుపుకు లోనవుతుంది గాని నల్లధనం పెద్దగా బయటపడదని ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ కూడా నివేదిక ఇచ్చింది. అందువలన మనం అపరిమితంగా జరగబోయే మంచి గురించి, పడాల్సిన చిన్న బాధల గురించి మాట్లాడడం లేదు. దేశానికి ఏ లాభం లేకుండానే ప్రజల జీవనానికి, ముఖ్యంగా పేదల జీవనానికి తగిలే పెద్ద దెబ్బ గురించి మాట్లాడుతున్నాం.

**మోదీగాని బిజెపిగాని ఎందుకు మౌనంగా ఉన్నారు?**

ఈ రోజు అవినీతి రాజకీయాలలోనే అతి పెద్ద అవినీతి ఉంది. కార్పొరేట్లకు, నల్లధన కుబేరులకు, అవినీతి రాజకీయ నాయకులకు గల సంబంధాలలోనే ఉంది. మన ప్రధాని నల్ల డబ్బుకు గల ఈ పార్శ్వం గురించి మాట్లాడడం లేదు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ ఉంది. బిర్లా, సహారాకు చెందిన రెండు సంస్థలపై తమ శోధనలో భాగంగా 2013లో సిబిఐ దాడులు చేసింది. దాడులలో వారికి దొరికిన ఒక చిట్టాలో కొంతమంది రాజకీయ నాయకులపేర్లు వాటి పక్కన కొంత డబ్బు రాసి ఉంది. రెండు జాబితాల్లోనూ ఒక పేరు ఉంది. ఒక జాబితాలో ఒక పేరు పక్కన 25 కోట్ల రూపాయలు, మరో జాబితాలో అదే పేరు పక్కన 55 కోట్ల రూపాయలు రాసి, ఆ పేరు దగ్గర గుజరాత్ ముఖ్యమంత్రి అని వ్రాసి వుంది. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి ఎవరు? సిబిఐ ఆ జాబితాతో పురోగతి ఎందుకు సాధించలేదు. తాను ఈ పిటిషన్‌ను పరిశీలించే ముందు మరింత సమాచారం ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. దీనిని సంబంధించి ఒక స్వతంత్ర పరిశోధనా సంస్థ ఉండాలి. అది సంబంధిత దోషులను తగిన విధంగా దండించేందుకు చర్యలు తీసుకోవాలి.



మోడి

**ప్రభుత్వం ఈ చర్య ఎందుకు తీసుకుంది?**

నోట్ల రద్దు వలన నల్లధనం పోదని నల్లధనాన్ని నిర్మూలించేందుకు వేసిన కమిటీ చెప్పింది. ఎంతోమంది నిపుణులు దీనితో ఏకీభవిస్తున్నారు. రిజర్వ్‌బ్యాంక్ డిప్యూటీ డైరెక్టర్ డా॥ కె.సి చక్రవర్తి దీని పర్యవసానాలను ప్రధానికి సరిగా వివరించ లేదని వ్యాఖ్యానించారు. నిజానికి వివిధ రంగాలలో, విదేశాలలోని నల్లధనాన్ని రప్పించడం, ఉద్యోగాలు కల్పించడం, ఆహార భద్రత కల్పించడం లాంటి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ ప్రభుత్వం తీసుకున్న చర్య అది. ఇతరులను దేశ ద్రోహులుగా చిత్రించేందుకు సంఘ్ పరివార్‌కు ఇది మరో అంశం. హిందూత్వ ఎజెండా అయిన ఘర్ వాపసి, గోరక్షణ పేరుతో దాడులు, లవ్ జిహాద్, ఇప్పుడు నోట్ల రద్దు, దేనిని వ్యతిరేకించినా దేశద్రోహులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్.ఎస్.ఎస్ ఇచ్చే సర్టిఫికెట్లతో భారతదేశానికి పని లేదు. కాని ఆర్.ఎస్.ఎస్, బిజెపిల ఎత్తుగడలను ఓడించాలి. ప్రధాని నవంబరు 8వ తేదీ రాత్రి 8 గంటకు నోట్ల రద్దు ప్రకటించారు. ఈ ప్రకటనకు కొద్ది గంటల ముందే కలకత్తాలో బిజెపి ఖాతాలో 1000, 500 రూపాయల నోట్లు జమచేయబడ్డాయి. ఖచ్చితంగా వారికి ముందస్తు సమాచారం ఉంది. అందుకిది ఒక్కటే ఉదాహరణ కాదు. నెల రోజుల క్రితం బీహార్‌లో ఒక భవనాన్ని చాలా తక్కువ ధరకు కొన్నట్టు బిజెపి చూపించింది. ఇదీ యాదృచ్ఛికమేనా? దీని నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు ఒక సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేయాలన్న డిమాండ్‌కు సిపిఐ(ఎం) మద్దతునిచ్చింది.

**ముగింపు :**

నవంబరు 28న దేశంలో ప్రతిఘటనా కెరటం ఉవ్వెత్తున లేచింది. ఇది పోరాటం ఆరంభం మాత్రమే. చలామణీ వ్యవస్థను సరైన స్థానంలో నిలిపే వరకు లేదా కనీసం డిసెంబరు 31 వరకైనా 500, 1000 రూపాయల నోట్లను చలామణిలో ఉంచాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

వ్యవసాయ రుణాలన్నింటినీ ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆస్తులను జప్తు చేసి 11 లక్షలకోట్ల రూపాయల పారు బకాయిలనువసూలు చేయలి. సహారా, బిర్లా పత్రాలను పరిశీలించి, నేరస్తులపై చర్యలు చేపట్టాలి. పన్నుల స్వర్గధామాలతో ద్వంద్వ పన్నుల నివారణ ఒప్పందాలను రద్దు చేయాలి. విదేశీ ఖాతాదారుల పేర్లు ప్రకటించి, వారిపై చర్యలను బహిర్గత పరచాలి. ఈ చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం నల్ల ధనంపై యుద్ధం చేస్తోందంటే అది బూట కమే. తమ జీవితాలను, జీవన భృతిని కోల్పోయిన వారికి ప్రభుత్వం తగిన రీతిగా నష్టపరిహారం చెల్లించాలి. ❋

# అమెరికాలో ట్రంప్ విజయం
# కల్లోల ప్రపంచంలో కొత్త సమస్య




రచయిత సిపిఐ (ఎం)
రాష్ట్రకమిటీ సభ్యులు

అమెరికా 44వ అధ్యక్షునిగా శత కోటీశ్వరుడు డొనాల్డ్ ట్రంప్ విజయం అమెరికాలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్ చేసిన ఉపన్యాసాలు, ప్రకటించిన విధానాలు పరిశీలించిన రాజకీయ పండితులు ఆయన విజయం ప్రపంచాన్ని మరింత కల్లోలంలోకి నెడుతుందని అంచనా వేశారు. ఎన్నికైన తరువాత ట్రంప్ ఇస్తున్న ఇంటర్వ్యూలు, వివిధ పదవులకు ఆయన చేస్తున్న నియామకాలు ఈ అంచనా సరైందేనని రుజువు చేస్తున్నాయి. అమెరికాలో ట్రంప్ విజయం ప్రపంచ రాజకీయాల్లో వస్తున్న మార్పులకు ప్రబల సంకేతం.



డొనాల్డ్ ట్రంప్





డొనాల్డ్ ట్రంప్ గెలుపును నిరసిస్తూ ప్రదర్శనలు

2008లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం పలు దేశాల్లో తీవ్రమైన మార్పులకు దారితీస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగం, దారిద్ర్యం, ఆర్థిక అంతరాలు పెరిగాయి. ప్రజలు రుణగ్రస్తులైనారు, కొనుగోలు శక్తి శీఘ్రంగా తగ్గిపోతోంది. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. దాని నుండి బయటపడడం కోసం అవి ప్రజల జీవన ప్రమాణాలపై కోతలు విధిస్తున్నాయి. శ్రామిక వర్గం ఎన్నడూ లేనంత దోపిడీకి, పీడనకు, అభద్రతకూ గురవుతోంది. ఇవన్నీ ప్రభుత్వాల విధానాల పట్ల, వ్యవస్థ పట్ల ప్రజల్లో వ్యతిరేక భావాన్ని పెంచుతున్నాయి. 1991లో సోవియట్ విచ్ఛిన్నం జరిగినపుడు 'చరిత్ర అంతమైంద'నీ, అమెరికా నాయకత్వంలో ప్రపంచీకరణ విధానాలు ప్రజలకు సుఖ సంతోషాలు ఇస్తాయనీ పెట్టుబడిదారీ పండితులు చెప్పారు. కానీ 25 ఏళ్ల ప్రపంచీకరణ విధానాలు దేశాలను యుద్ధాల్లోకి, ప్రభుత్వాలను అప్పుల్లోకి, ప్రజలను కష్టాల్లోకి నెట్టాయి. అందువల్ల ఈ విధానాలపట్ల ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు. కమ్యూనిస్టు పార్టీలు, పురోగామి శక్తులు బలంగా ఉన్న చోట అసంతృప్తికి గురైన ప్రజలు పోరాటాల్లోకి వస్తున్నారు. సోషలిస్టు ప్రత్యామ్నాయం వైపు పయనిస్తున్నారు. అలా లేని చోట పచ్చి అభివృద్ధి నిరోధక మితవాద, ఫాసిస్టు శక్తులు ప్రజల అసంతృప్తిని తమవైపు మలచుకుంటున్నాయి. దురదృష్టమేమంటే ప్రపంచంలోని ఎక్కువ ప్రాంతాల్లో పురోగామి శక్తుల కన్నా ఈ అభివృద్ధి నిరోధక శక్తులవైపే ప్రజలు సమీకృతులవుతున్నారు. అటువంటి పరిణామాల్లో ఒక ముఖ్య పరిణామం అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక. 1933లో జర్మనీలో హిట్లర్ ఎన్నికతో దీన్ని కొంతమంది పండితులు పోలుస్తున్నారు. అది పెద్ద పోలికే కావచ్చు కానీ ట్రంప్ విజయం యొక్క అభివృద్ధి నిరోధక ప్రభావాన్ని తక్కువగా చూడలేం.

**ట్రంప్ ఎన్నికల ప్రచారం ముందు, తరువాత**

డొనాల్డ్ ట్రంప్ అమెరికాలోని పెద్ద వ్యాపారవేత్తల్లో ఒకరు. రియల్ ఎస్టేట్, పేకాట క్లబ్బులు, గోల్ఫ్ కోర్సులు, అమెరికా సుందరి, ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించడం ద్వారా కోట్లు గడించాడు. అమెరికాలోనే కాకుండా అనేక దేశాల్లో ఆయన రియల్ ఎస్టేట్లు ఉన్నాయి. అమెరికా ఎన్నికల రంగంలోకి ట్రంప్ అకస్మాత్తుగా ప్రవేశించాడు. అంతకు ముందు ఎటు వంటి రాజకీయ ప్రవేశం లేని ట్రంప్ 2015లో రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీలో నిలబడి 17 మంది అభ్యర్థులను వెనక్కు నెట్టి విజేతగా నిలిచాడు.


ప్రపంచీకరణ పట్ల అమెరికా ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని ఉపయోగించుకునే నినాదాలిస్తూనే మరోవైపు పేదలకు ముఖ్యంగా నల్లజాతి ప్రజలకు ఇస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు వ్యతిరేకంగా, వలస వచ్చిన వారికి వ్యతిరేకంగా ప్రచారం చేసి మితవాద శక్తులను, ముఖ్యంగా మధ్యతరగతి తెల్లజాతీయులను కూడగట్టాడు. 'అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే', 'అమెరికా గొప్పదాన్ని మళ్లీ తీసుకురావాలి' అనే నినాదాలతో జాతీయ అహంకారాన్ని రెచ్చగొట్టాడు. నాఫ్టా, టిపిపి వంటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తానన్నాడు. 'ఇంధన స్వతంత్రం' కావాలనే పేరుతో అమెరికాలో తీవ్రమైన కాలుష్యానికి కారణమైన షేల్ ఆయిల్ వెలికితీతపై నియంత్రణలు ఎత్తేస్తానన్నాడు. పారిస్ వాతావరణ ఒప్పందాన్ని వ్యతిరేకించాడు. వలసలను నిరోధించేందుకు మెక్సికో, అమెరికా సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానన్నాడు. ఒబామా తెచ్చిన వైద్యబీమా – 'ఒబామా కేర్', మౌలిక విద్యా నాణ్యత పథకాలు ఎత్తేస్తానన్నాడు. ధనికులపై పన్నులు తగ్గిస్తాననీ, దేశంలో మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెంచుతాననీ చెప్పాడు. ముఖ్యంగా చైనా, భారత్‌ల నుండి ఉద్యోగాలను తిరిగి అమెరికాకు తెస్తాననీ, వీసా నిబంధనలు కఠిన తరం చేస్తాననీ వాగ్దానాలు చేశాడు. ఉగ్రవాద నిర్మూలన పేరుతో ముస్లిం వ్యతిరేకతను బాగా రెచ్చగొట్టాడు. ఇవన్నీ నిరుద్యోగం, దారిద్ర్యం, అభద్రతా భావతంతో ఉన్న అమెరికన్లపై బాగా పనిచేశాయి. అమెరికాలోని ఇతర జాతుల ప్రజలకు నల్లజాతీయులకు మధ్య అగాధం పెరిగిఉన్న నేపథ్యంలో ట్రంప్ నినాదా

**"ట్రంప్‌కు పోటీగా సాండర్స్ నిలబడి ఉంటే మితవాద ఆలోచనలకు వ్యతిరేకంగా ప్రజలను ఉత్సాహ పరిచే ప్రత్యామ్నాయ ఆలోచనలతో సాండర్స్ ప్రచారం చేసేవారనీ దాని వల్ల ట్రంప్ విజయం సాధ్యంకాకపోయి ఉండేదని పరిశీలకుల అంచనా. కానీ హిల్లరీ డెమోక్రటిక్ అభ్యర్థిగా వచ్చారు. ఆమెను డెమోక్రటిక్ అభ్యర్థిగా గెలిపించడంలో అమెరికా పాలక వర్గాల పాత్ర ఉంది."**

లు తెల్లజాతీయుల ఓట్లు కొల్లగొట్టడానికి ఉపయోగపడ్డాయి.

ఇన్ని చేసినా ట్రంప్‌కు ఎన్నికల్లో మెజారిటీ రాలేదు. ప్రత్యర్థి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్ కన్నా ఆయనకు సుమారు 20 లక్షల ఓట్లు తక్కువ వచ్చాయి. కానీ అమెరికా ఎన్నికల వ్యవస్థలోని లోపాల మూలంగా ఆయన ఎలక్టొరల్ కాలేజీ ఓట్ల ఆధిక్యతతో గెలవగలిగాడు. అమెరికా చరిత్రలోనే ఇన్ని ఓట్లు తక్కువ వచ్చి అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తిగా ట్రంప్ రికార్డు నమోదు చేసుకున్నాడు. గతంలో కూడా కొందరు అభ్యర్థులకు ప్రజా ఓట్లు తక్కువ వచ్చి ఎలక్టొరల్ ఓట్ల ఆధిక్యతతో గెలిచిన వారున్నారు. కానీ వారికి వచ్చిన ఓట్ల తేడా స్వల్పంగా వేలల్లో లేక ఒకటి రెండు లక్షల్లో ఉండేవి. తేడా ఇంత పెద్దగా ఉంది కనుకనే అమెరికా ఎన్నికల సర్వేలన్నీ ట్రంప్ గెలవడం లేదని చెప్పాయి. ఒక దశలో హిల్లరీకీ, ఆయనకూ 5 శాతం ఓట్ల తేడా ఉందని సర్వేలు చెప్పాయి. కానీ ట్రంప్ అనూహ్యంగా గెలిచారు. కారణం అమెరికా ఎన్నికల వ్యవస్థ ఒక్కటే కాదు అమెరికా పాలక వర్గాల్లో నెలకొన్న ఏకాభిప్రాయం కూడా దీనికి కారణమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఎన్నికల ప్రైమరీస్‌లో డెమోక్రటిక్ పార్టీలో హిల్లరీ క్లింటన్‌కు ప్రత్యర్థిగా నిలబడిన బెర్నీ సాండర్స్ ఒక దశలో డెమోక్రటిక్ అభ్యర్థిగా విజయం సాధిస్తారని అనుకున్నారు. అమెరికా చరిత్రలో సుదీర్ఘ కాలం స్వతంత్ర సెనెటర్‌గా పనిచేసిన సాండర్స్ అభ్యుదయ భావాలు గలవాడు. సోషలిస్టు విధానాలు ప్రచారం చేశాడు. అసమానతలు తగ్గాలన్నాడు. ఇరాక్ యుద్ధాన్ని వ్యతిరేకించాడు. దేశంలో అన్ని జాతుల మధ్య ఐక్యత కోసం ప్రచారం చేశాడు. ఎన్నికల్లో కార్పొరేట్ డబ్బును వ్యతిరేకించిన సాండర్స్ ప్రజలనుండి చిన్నచిన్న విరాళాలు సేకరించి పోటీలో నిలబడ్డాడు. అందువల్ల డెమోక్రటిక్ అభ్యర్థి ఎన్నికల్లో ఆయన అమెరికాలోని అన్ని జాతుల ప్రజలను ముఖ్యంగా



హిల్లరీ క్లింటన్

అభ్యుదయ శక్తులను ఉత్సాహపరిచాడు. ధనికుల మీద పన్ను వేయడం, పేదల సంక్షేమం, అసమానతలు తగ్గించడం, కాలుష్య నివారణకు, వాతావరణ ఒప్పందాలకు ప్రాముఖ్యత నివ్వడం వంటి ఆయన విధానాలను సోషలిస్టు విధానాలని రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. 43 శాతం మంది డెమోక్రటిక్ ప్రతినిధులు ఆయనకు మద్దతు తెలిపారు. కానీ కొద్ది తేడాతో ఆయన హిల్లరీ క్లింటన్ చేతిలో ఓడిపోయారు. వాస్తవానికి ఎన్నికల్లో హిల్లరీ కాకుండా సాండర్స్ డెమోక్రటిక్ అభ్యర్థి అయ్యుంటే ట్రంప్ విజయం అసాధ్యమయ్యేదని పరిశీలకులు ఎన్నికల ప్రచార సమయంలోనే చెబుతూ వచ్చారు. ఎందుకంటే హిల్లరీ అనేక అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయి ఉన్నారు. విధానాల పరంగా చూస్తే రిపబ్లికన్లకు ఏమాత్రం తీసిపోరు. మార్పు పేరుతో ఎన్నికైన ఒబామా తన రెండు దఫాల అధ్యక్ష కాలంలో ఆరు దేశాలపై యుద్ధాలు చేశారు. ఒబామాను మించిన యుద్ధపిపాసిగా హిల్లరీ గణుతికెక్కారు. ఆమె విదేశాంగ మంత్రిగా ఉండగా అనేక దేశాలపై కయ్యానికి కాలుదువ్వారు. అమెరికాను దుస్థితి నుండి బయటపడేసే ఒక్క ప్రత్యామ్నాయాన్ని కూడా ఆమె చెప్పలేకపోయారు. ట్రంప్‌కు పోటీగా సాండర్స్ నిలబడి ఉంటే మితవాద ఆలోచనలకు వ్యతిరేకంగా ప్రజలను ఉత్సాహ పరిచే ప్రత్యామ్నాయ ఆలోచనలతో సాండర్స్ ప్రచారం చేసేవారనీ దాని వల్ల ట్రంప్ విజయం సాధ్యంకాకపోయి ఉండేదని పరిశీలకుల అంచనా. కానీ హిల్లరీ డెమోక్రటిక్ అభ్యర్థిగా వచ్చారు. ఆమెను డెమోక్రటిక్ అభ్యర్థిగా గెలిపించడంలో అమెరికా పాలక వర్గాల పాత్ర ఉంది. కార్పొరేట్ డబ్బు, ప్రచారం ఆమెకు లభించాయి. అమెరికా ఎన్నికల్లో డబ్బు ప్రధానంగా పనిచేస్తుందన్న విషయం విదితమే. అందువల్ల పచ్చి మితవాద నినాదాలతో దూసుకువస్తున్న అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రజల్లో భ్రష్టు పట్టిన హిల్లరీని నిలపడం ద్వారా అమెరికా పాలక వర్గాలు ట్రంప్ విజయాన్ని సాధ్యం చేశాయి. అయినప్పటికీ ట్రంప్‌కు ప్రజా ఓట్లు తక్కువ వచ్చాయన్న విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. కానీ అమెరికా కార్పొరేట్ మీడియా దీనికి పెద్దగా ప్రచారం ఇవ్వడం లేదు. ప్రతిపక్షమైన డెమోక్రాట్లు కూడా ట్రంప్ విజయాన్ని సవాలు చేయకుండా సర్దుకు పోవడం వెనుక కూడా బడా పెట్టుబడి జోక్యం ఉందని చెబుతున్నారు.

ట్రంప్ గెలిచిన వెంటనే అమెరికాలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. అనేక నగరాల్లో విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి ట్రంప్ మా అధ్యక్షుడు కాదు అని నినాదాలిచ్చారు. దీనిపై ట్రంప్, ఆయన పరివారం స్పందిస్తూ అమెరికాలో ఇటువంటి నిరసనలను సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా పతాకాలను తగుల బెట్టిన ముగ్గురు యువకులపై దేశద్రోహం కేసులు పెడతామని ట్రంప్ స్వయంగా బెదిరించాడు. అమెరికాలో జాతీయ జెండాలు తగులబెట్టడం నేరం కాదని అది నిరసనలో భాగమని సుప్రీం కోర్టు తీర్పు ఉంది. అయినా ట్రంప్ అటువంటి ప్రకటన చేశాడంటే భవిష్యత్తులో ఇటువంటి నిరసనలను సహించబోమన్న హెచ్చరికేనని పౌరహక్కుల ఉద్యమకారులు చెబుతున్నారు.

**ఫాసిస్టు, యుద్ధోన్మాదులతో కొత్త ప్రభుత్వం**

గెలిచిన వెంటనే ట్రంప్ తన ఫాసిస్టు ఎజెండా బయట పెట్టాడు. మొదటిగా ఆయన తన కార్యనిర్వాహక వర్గంలోకి పచ్చి మితవాద, యుద్ధోన్మాదులను తీసుకుంటున్నాడు. ఆయన ప్రతిపాదిస్తున్న కింది వారి పూర్వరంగమే ఈ విషయాన్ని చెబుతోంది.

– అటార్నీ జనరల్‌గా ప్రతిపాదించిన జెఫ్ సెస్సియోన్స్ పచ్చి మితవాద భావాలుగలవాడు. పౌరహక్కులకు వ్యతిరేకి. ప్రజాజీవనంపై పక్కా గూఢచర్యం ఉండాలంటాడు. పోలీసులను సైనికీకరించాలనేది ఆయన వాదన. వలసలకు వ్యతిరేకి.

– సిఐఎ డైరెక్టర్‌గా ట్రంప్ ప్రతిపాదించిన మైక్ పోంపియో చట్ట విరుద్ధమైన గూఢచర్యం ఉండాలంటాడు. ప్రజావేగు ఎడ్వార్డ్ స్నోడెన్‌ను శిక్షించాలని గట్టిగా వాదిస్తాడు.

– ముస్లిం వ్యతిరేక ఉన్మాది అయిన జనరల్ మైఖేల్ ఫ్లిన్‌ను ట్రంప్ తన జాతీయ భద్రతా సలహాదారుగా ప్రతిపాదించాడు. భద్రత రీత్యా ప్రజలను చిత్రహింసలు పెట్టే విషయంలో ఎటువంటి నిబంధనలూ ఉండకూడదంటాడు.

– రక్షణ మంత్రిగా ట్రంప్ ఆలోచిస్తున్న వ్యక్తి రిటైర్డ్ మెరైన్ జనరల్ జేమ్స్ మట్టిస్ అత్యంత క్రూరుడు. 2004లో ఇరాక్‌లోని ఫల్లూజా నగరంమీద దాడిచేసి వేలాది మంది అమాయక ప్రజలను వధించిన హంతక చర్యకు ఆయనే కమాండర్ జనరల్. "కొంతమంది ప్రజలను కాల్చి చంపడం సరదాగా ఉంటుంది" అని బహిరంగంగా ప్రకటించిన మట్టిస్ పచ్చి యుద్ధోన్మాది.


– విదేశాంగ మంత్రిగా ప్రతిపాదించబోతున్న వ్యక్తి మిట్ రోమ్నీ కూడా అమెరికా సైనిక దురాక్రమణలను కోరుకునే వ్యక్తే.


– అన్నిటికీ మించి ట్రంప్ ప్రభుత్వ రాజకీయ ఎజెండాను నిర్ణయించే 'ముఖ్య వ్యూహకర్త' పదవికి స్టీఫెన్ బానన్‌ను ప్రతిపాదించాడు. ఈయన తెల్లజాతి దురహంకారి, ఫాసిస్టు భావాలు గల వ్యక్తి


### నిరంకుశత్వ ఛాయలు

స్వదేశంలో ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో పేర్కొన్న విధానాల అమలుతోపాటు నిరంకుశత్వానికి, పౌరహక్కుల అణచివేతకు పెద్దపీట వేయనున్నారని వివిధ పదవుల్లో ఆయన నిరంకుశ, యుద్ధోన్మాద, జాత్యహంకార వ్యక్తులను నియమిస్తున్న తీరు తెలియజేస్తోంది. దీంతోపాటు విజయానంతరం ఆయన ప్రకటనలు, ఇంటర్వ్యూలు కూడా ఇదే విషయం నిర్ధారిస్తున్నాయి. ట్రంప్ ఎన్నికైన తరువాత నవంబర్ 21న న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్‌లో గల తన ట్రంప్ టవర్స్‌లో కొందరు పచ్చిమితవాద, యుద్ధోన్మాద రాజకీయ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైనాడు. ఆ సమావేశంలో ట్రంప్ మాట్లాడిన రెండున్నర నిమిషాల వీడియో విడుదల చేశారు. అందులో ఆయన తన 'అమెరికన్ జాతీయ వాద' ఎజెండాను పక్కాగా అమలు చేస్తానని ప్రకటించాడు. జాతీయవాద ఎజెండాలో ఒక భాగం ఏమంటే దేశంలో కార్మిక సమ్మెల పైనా, ప్రజాందోళనలపైనా అణచివేత పద్ధతులు అమలు పరచడం, విదేశాంగ విధానంలో యుద్ధానికి, దురాక్రమణకు ప్రాధాన్యత ఇవ్వడం.


"ఈ స్వేచ్ఛా వాణిజ్యం వల్ల అమెరికా ఉద్యోగాలు చైనా, భారత్ వంటి దేశాలకు వలసపోయాయని ఆయన వాదన. అలాగే నాటో సైనిక కూటమి ఖర్చులో అధిక భాగం అమెరికా భరిస్తోంది కాబట్టి ఇకపై ఆయా దేశాలు తమ వాటాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశాడు. జపాన్‌లో సైనిక స్థావరాలకు అమెరికాతోపాటు జపాన్ కూడా ఖర్చు భరించాలని కోరాడు."



జేమ్స్ మట్టిస్


జెఫ్ సెస్సియోన్స్


మైఖేల్ ఫ్లిన్


మైక్ రోంపియో


మిట్ రోమ్నీ


స్టీఫెన్ బానన్

### ప్రపంచ వ్యాపిత ప్రకంపనలు

ఎన్నికల ప్రచారంలో ట్రంప్ 'అమెరికాకు ప్రాధాన్యత'అనే నినాదం ఇచ్చాడు. ఇది అంతర్జాతీయంగా వాణిజ్యంలో రక్షణాత్మక విధానాలను, రాజకీయాల్లో జాతీయ వాద, ఫాసిస్టు శక్తులను ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే యూరప్‌లోని అనేక దేశాల్లో ట్రంప్ బాటలో పయనించి అసంతృప్తులైన ప్రజల ఓట్లు కొల్లగొట్టుకోడానికి మిత వాద, ఫాశిస్టు శక్తులు సన్నాహాలు ప్రారంభించాయి.

నాఫ్టా (ఉత్తర అట్లాంటిక్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం), టిపిపి (ట్రాన్స్ పసిఫిక్ స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం)ల నుండి అమెరికా ఉపసంహరించుకుంటుందని ట్రంప్ చెప్పాడు. ఈ స్వేచ్ఛా వాణిజ్యం వల్ల అమెరికా ఉద్యోగాలు చైనా, భారత్ వంటి దేశాలకు వలసపోయాయని ఆయన వాదన. అలాగే నాటో సైనిక కూటమి ఖర్చులో అధిక భాగం అమెరికా భరిస్తోంది కాబట్టి ఇకపై ఆయా దేశాలు తమ వాటాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశాడు. జపాన్‌లో సైనిక స్థావరాలకు అమెరికాతోపాటు జపాన్ కూడా ఖర్చు భరించాలని కోరాడు. ట్రంప్ గెలుపొందిన తరువాత కూడా ఈ దిశలో చర్యలు తీసుకో బోతున్నట్లు ప్రకటించాడు. చైనాను నిలువరించడంలో ఆసియా మిత్రులూ, రష్యాను నిలువరించడంలో ఐరోపా మిత్రులూ మరింత ఖర్చు చేయాలనేది ట్రంప్ వాదన. దాంతో మొత్తం ప్రపంచ వ్యాప్తంగా సైనిక వ్యయం పెరిగే అవకాశం ఉంది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయి సైనికంగా వెనుకబడిన సామ్రాజ్యవాద దేశాలైన జర్మనీ, జపాన్‌లు గతంలోనే తమ సొంత సైనిక పాటవాన్ని పెంచుకోడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ట్రంప్ వైఖరితో ఈ క్రమం మరింత ఊపందుకుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐరోపా కూటమి నుండి బ్రిటన్ వైదొలగిన నేపథ్యంలో ట్రంప్ విధానాలతో సామ్రాజ్యవాద శిబిరంలో ఇప్పటివరకు స్తబ్దుగా ఉన్న వైరుధ్యాలు మరింత పెరిగేందుకు దోహదపడతాయి.

చైనాకు వ్యతిరేకంగా ట్రంప్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న నేపథ్యంలో టిపిపి (ట్రాన్స్ పసిఫిక్ (ట్రేడ్) ఒప్పందం రద్దు చేస్తానన్న ట్రంప్ నిర్ణయాన్ని చైనా తనకు అవకాశంగా మలుచుకోదలుచుకుంది. ఆసియా ఖండంలో చైనాను ఆర్థికంగా దెబ్బతీసే ఉద్దేశంతో ఒబామా హయాంలో టిపిపి ఏర్పడింది. పసిఫిక్ సముద్రానికి అటూ ఇటూ ఉన్న 12 దేశాలు – అమెరికా, జపాన్, మలేసియా, వియత్నాం, సింగపూర్, బ్రూనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, మెక్సికో, చిలీ, పెరూల మధ్య సుంకాలు లేని స్వేచ్ఛా వాణిజ్యం జరగాలన్నది ఈ ఒప్పందం ఉద్దేశం. దీనిలో చైనాను చేర్చుకోలేదు. దీనికి విరుగుడుగా చైనా 16 దేశాలతో ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒపందం (ఆర్‌సెప్)ను ముందుకు తెచ్చింది. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఆర్థిక కూటమిలో ఆసియాన్‌కు చెందిన పది దేశాలు – ఇండోనేసియా, మలేసియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, సింగపూర్, థాయ్‌లాండ్, బ్రూనీ, లావోస్, మ్యాన్మార్, కాంబోడియాలతో పాటు

(మిగతా 20వ పేజీలో)

పార్టీ నిర్మాణం

# విమర్శ - ఆత్మవిమర్శ

ఎస్ వీరయ్య



రచయిత సిపిఐ (ఎం) కేంద్రకమిటీ సభ్యులు

విమర్శ, ఆత్మవిమర్శ కమ్యూనిస్టు పార్టీకి అత్యంత కీలకమైనవి. పార్టీ అభివృద్ధికి జవం, జీవం ఇవే. స్వప్రయోజనం కోసం కాకుండా ప్రజల కోసం, కార్మికవర్గ పార్టీ కోసం పనిచేసే కమ్యూనిస్టులకు పార్టీ ఆంతరంగిక జీవితంలో విమర్శ, ఆత్మవిమర్శ ఒక అంతర్భాగం. అందుకే మంచి కమ్యూనిస్టులు విమర్శకు భయపడరు. ఆత్మవిమర్శకు వెనుకాడరు. కమ్యూనిస్టు పార్టీలోనే ప్రత్యేకంగా అమలుజరిపే కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో అంతర్భాగంగానే ఈ విమర్శ, ఆత్మ విమర్శలు ఉంటాయి. అయితే వీటి గురించి సరైన అవగాహన లేకుండా పైపై అవగాహనతో మాత్రమే వ్యవహరిస్తే సరైన ఫలితాలు ఉండవు. అందుకే కమ్యూనిస్టులకు విమర్శ, ఆత్మవిమర్శ పట్ల సమగ్రమైన అవగాహన ఉండటం అవసరం. అప్పుడే ఈ ఆయుధాలను సరైన దిశలో, సక్రమమైన పద్ధతిలో వినియోగించుకో గలం. లేనట్టయితే విమర్శ దుర్వినియోగం జరగవచ్చు. ఆత్మవిమర్శకు నిరాకరించటం, లేదా అరకొర ఆత్మవిమర్శకే పరిమితం కావచ్చు.

### విమర్శ లక్ష్యం

పొరపాటు చేస్తున్న తోటి కామ్రేడ్‌ను సరిదిద్దటం, పార్టీలో ఐక్యతను పెంచటం, పార్టీ శ్రేణుల ఆచరణను వేగవంతం చేయటమే విమర్శ లక్ష్యంగా ఉండాలి. తోటి కార్యకర్తల లోపాలను సరిదిద్దటం ద్వారా కార్యకర్తల శక్తిసామర్థ్యాలను పెంచవచ్చు. అపార్థాలను తొలగించడం, తప్పుడు ధోరణులను అధిగమించేలా చేయటం ద్వారా ఐక్యతను పెంపొందిచవచ్చు. ఈ రెండూ సాధించినప్పుడు అన్ని స్థాయిల్లోనూ పార్టీ శ్రేణుల దృష్టి యావత్తూ లక్ష్యం మీద, పనిమీదనే కేంద్రీకరించడం సాధ్యమవుతుంది. ప్రజాసమస్యల మీద ఆందోళన, పోరాటాలు చేస్తూ, ప్రజల చైతన్యం పెంపు మీద దృష్టి సారించగలుగుతారు. అందుకే లోపాలను సరిదిద్దుకోవడం కోసం విమర్శ, ఆత్మవిమర్శ అనివార్యం. తోటి కార్యకర్తలను సరిదిద్దగల సామర్థ్యం, నిరంతరం ప్రజల కోసం అంకితమై పనిచేసే కార్యకర్తకు మాత్రమే ఉంటుంది. పనిచేయకుండా, పనిలో ఫలితం చూపకుండా, కేవలం సుద్దులు చెప్పే వారికి సాధ్యం కాదు. అందుకే పనిచేయని వారికి విమర్శించే హక్కు లేదంటారు మావో. విమర్శించే విధానము, విమర్శ మోతాదు కూడా ముఖ్యమే. విమర్శ అనేది ఎదుటి కామ్రేడ్ లోపాన్ని సరిదిద్దేదిగా ఉండాలి తప్ప నిరుత్సాహపరిచేదిగా ఉండకూడదు. పసిబిడ్డ మురికి వదిలించటం కోసం స్నానం తప్ప సబ్బునీళ్ళలో కొట్టుకుపోయే స్థాయిలో ఉండకూడదు. పాపని కాపాడుకోవడానికి స్నానం తప్ప పాపనే కోల్పోయి తల్లి సాధించేదేముంది ('బేబీ షుడ్ నాట్ బి లాస్ట్ ఇన్ ద బాత్ వాటర్' అనేది ఇంగ్లీష్ నానుడి). ఇక్కడ కార్యకర్తల పట్ల కూడా అదే ధోరణి ప్రదర్శించాలి. కార్యకర్తలను సరిదిద్దుకోవాలి తప్ప కోల్పోయే స్థాయిలో విమర్శ ప్రయోగించకూడదు. ఇది రోగి పట్ల డాక్టర్ వ్యవహరించడం లాంటిది. రోగి శరీరంలో ఉన్న బాక్టీరియాను నాశనం చేయడం కోసమే వైద్యం తప్ప, రోగినే దెబ్బతీయడం కోసం కాదుకదా. అందుకే విమర్శించే తీరు కూడా వ్యక్తి మీద కాకుండా, ఆ వ్యక్తిలోని లోపం మీద చేయాలి. వ్యక్తిని విమర్శించినప్పుడు ఆ కామ్రేడ్ పనికిరాడనే అభిప్రాయం కలగజేస్తుంది. ఆ కామ్రేడ్‌లో ఉన్న పొరపాటు ధోరణి మీద విమర్శ చేసినప్పుడు ఆ లోపాన్ని సరిదిద్దుకుంటే ఆ కామ్రేడ్ శక్తి సామర్థ్యాలు బాగా ఉపయోగపడతాయనే విశ్వాసాన్ని ఇస్తుంది. అందుకే అనారోగ్యంతో మంచం పట్టిన రోగికి ప్రేమతో చేసే వైద్యం, సపర్యలు లాంటిది ఇది. ఆప్యాయతతో ఇచ్చే చేదు మందు లాంటిది. చేదు మందైనా, సూది మందైనా మంచం పట్టిన రోగి లేచి పరుగెత్త డానికే తప్ప ప్రాణం వదిలేయడానికి కాదుకదా. తోటి కామ్రేడ్స్‌ను విమర్శించే సమయంలో కూడా ఈ అంశాలను గమనంలో ఉంచుకోవాలి. అదే కమ్యూనిస్టు పద్ధతి.

### ఐక్యత కోసమే విమర్శ

చేస్తున్న విమర్శ సరైనదైనప్పటికీ, విమర్శించే హక్కు ఉన్నప్పటికీ పార్టీలో ఐక్యతకు దెబ్బతగలకుండా కూడా చూసుకోవాలి. ఆచరణలో ఐక్యతను దెబ్బతీసినప్పుడు విమర్శ లక్ష్యమే దెబ్బ తింటుంది. అందుకే అంతిమంగా ఐక్యతను పెంపొందించే ప్రక్రియకు తోడ్పడేదిగానే విమర్శ ఉండాలి. ఆచరణ ఆధారంగానే విమర్శ ఉండాలి. మాటల్లో కంటే ఆచరణలో విమర్శ గొప్పది. తోటి కార్యకర్త పనిని, సాధిస్తున్న ఫలితాలను పరిశీలించి వాటి ఆధారంగానే తప్పొప్పుల చర్చ ఉండాలి. నోటితో విమర్శకన్నా తన స్వీయ ఆచరణ ద్వారా చేసే విమర్శ ఎక్కువ ఫలితాలనిస్తుంది. ఎదుటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఆ కామ్రేడ్ స్థాయిని బట్టి నొచ్చుకోవచ్చు. విమర్శను స్వీకరించడానికి ఇబ్బందిపడవచ్చు. "నీవు సరిగా పనిచేయటంలేదు" అని గానీ, "నీ పనిలో ఫలితాలు లేవు" అని గానీ అన్నప్పుడు పనిచేయని వ్యక్తి తట్టుకోలేకపోవచ్చు. ఎదురుదాడికి దిగవచ్చు. తాము స్వయంగా బాగా పనిచేయడం ద్వారా, తమ పనిలో ఫలితాలు చూపించడం ద్వారా తోటి కామ్రేడ్స్ కూడా తమ తమ పని గురించి, సాధిస్తున్న ఫలితాల గురించి చెప్పక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. లోపాలను గుర్తించడం సులభమవుతుంది. దీనినే "ఆచరణలో విమర్శ" అంటాము. ముందు తమ పని విధానం గురించి, తమ పనిలో వ్యక్తమైన బలహీనతల గురించి ఆత్మవిమర్శతో ప్రారంభిస్తే విమర్శకు విలువ పెరుగుతుంది. తోటి కామ్రేడ్స్‌విమర్శను స్వీకరించడం మరింత సులభతర మవుతుంది.

### ఫలితానికే ప్రాధాన్యత

సూర్యోదయానికి ముందే నిద్రలేచి హడావుడిగా జనంలో పడి రోజంతా చాకిరీ చేస్తారు కొందరు. అర్ధరాత్రి వరకూ ఇంటిముఖం చూడకుండా నిద్రాహారాలు మాని కష్టపడతారు. కుటుంబాన్ని, బంధుమిత్రులను పక్కనపెట్టి పనిచేస్తారు మంచి కామ్రేడ్స్. కష్టపడి పనిచేసే తత్వానికి ఆదర్శం వీరు. కానీ ఇది మాత్రమే చాలదు. ఎంచుకున్న ఫలితం రానప్పుడు ఈ చాకిరీ అంతా బూడిదలో పోసిన పన్నీరే. కొంతమంది కామ్రేడ్స్ పొరపాట్లు చేస్తారు. కానీ ఫలితం కూడా చూపిస్తారు. వీరు పొరపాట్లను సరిదిద్దుకుంటే ఫలితం అనేక రెట్లు పెరుగుతుంది. ఫలితం చూపించగల సామర్థ్యం వీరిలో ఉన్నందు వల్లనే పొరపాట్లు చేసినా ఎంతోకొంత ఫలితం కూడా చూపించగలుగుతున్నారు. ఫలితం

చూపించగలుగుతారు కాబట్టే పార్టీ శ్రేణులకు వీరిమీద గౌరవం పెరుగుతుంది. ఆమేరకు వీరు చేసే పొరపాట్ల ప్రభావం కూడా పార్టీ శ్రేణుల మీద పడుతుంది. అందుకే పొరపాట్లను సరిదిద్దుకుంటే మంచి ఫలితాలుంటాయి. ప్రజా పునాది పెరగనప్పుడు, పార్టీ విస్తరించనప్పుడు ఎంత కష్టపడి పనిచేసినా ప్రయోజనం మాత్రం శూన్యం. అందుకే కష్టపడి పనిచేయటం మాత్రమే చాలదు. ఫలితం సాధించాలి. సాధారణ ప్రజలు కూడా అంతిమంగా ఫలితాలనే చూస్తారు. "ఇంతకాలం కష్టపడ్డారు. ఏం సాధించారు మీరు. విప్లవం వచ్చిందా?" అంటారు. అంటే ఫలితం గురించే కదా వారు ప్రశ్నించేది. అందుకే కమ్యూనిస్టులు ఎప్పుడూ ఫలితానికి ప్రాధాన్యతనివ్వాలి. కార్యకర్త పనిలో ఫలితాన్ని బేరీజు వేస్తూ లోపాలను సరిదిద్దాలి. విమర్శించే క్రమంలో, లోపాలను సరిదిద్దే క్రమంలో ప్రజా పునాదిని, పార్టీ కార్యకర్తలను కాపాడుకోవటమే లక్ష్యంగా ఉండాలి. పని కొనసాగడానికి, ప్రజాఉద్యమానికి నిర్మాణ సూత్రాలు తప్ప పని ఆగడానికి కాదు. సూత్రం పేరుతో పార్టీ కార్యాచరణకు నష్టం జరగకూడదు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ప్రజా ఉద్యమం నిర్మించే క్రమంలోనే అందుకవసరమైన నిర్మాణ సూత్రాలు ఆవిర్భవించాయి. అందుకే సూత్రం కోసం సూత్రాలు కాదు. ఉద్యమ నిర్మాణం కోసమే నిర్మాణ సూత్రాలు. ఆచరణ లేని సిద్ధాంతానికి విలువ లేదు. విప్లవ కార్యాచరణ లేని సిద్ధాంతానికి విలువ లేదు. అందుకే ఈ ఆచరణాత్మక సమస్యలను అర్ధం చేసుకుని ఫలితానికి ప్రాధాన్యతనిస్తూ విమర్శను వినియోగించాలి. ఫలితం పేరుతో విమర్శను ఆపటం కాదు. ఫలితాన్ని కాపాడుకుంటూ అందుకు ఉపయోగపడే పద్ధతిలో విమర్శ ఉండాలి. అది లోపాన్ని సరిదిద్దడానికి, మరిన్ని ఫలితాలు సాధించడానికి తోడ్పడుతుంది.

"విప్లవ కార్యాచరణ లేని సిద్ధాంతానికి విలువ లేదు. అందుకే ఈ ఆచరణాత్మక సమస్యలను అర్ధం చేసుకుని ఫలితానికి ప్రాధాన్యతనిస్తూ విమర్శను వినియోగించాలి. ఫలితం పేరుతో విమర్శను ఆపటం కాదు. ఫలితాన్ని కాపాడుకుంటూ అందుకు ఉపయోగపడే పద్ధతిలో విమర్శ ఉండాలి. అది లోపాన్ని సరిదిద్దడానికి, మరిన్ని ఫలితాలు సాధించడానికి తోడ్పడుతుంది."

### అనుసరించకూడని పద్ధతులు

ఫోరం తప్పి విమర్శ చేయకూడదు. తానున్న శాఖలో లేదా కమిటీలో తప్ప బహిరంగ విమర్శ చేయరాదు. తన శాఖకు లేదా కమిటీకి సంబంధం లేనివారి దగ్గర మూడవ వ్యక్తి గురించి విమర్శ సరైంది కాదు. ఇది దుష్ప్రచారానికి దారి తీస్తుంది. ఆరోపణలని ఎదుర్కొనే కామ్రేడ్ వివరణ ఇచ్చుకునే అవకాశం ఉండదు. ఏక పక్షంగా దుష్ప్రచారం సాగుతుంది. తన శాఖకు లేదా తన కమిటీకి సంబంధం లేనివారు ఆ ఆరోపణలలో నిజానిజాలను నిర్ధారించజాలరు. లోపాలు నిజమని తేలితే సరిదిద్దడం కూడా వారి పరిధిలో లేని అంశం. అవి అపోహలే తప్ప నిజాలు కావని తేలితే తప్పుడు ప్రచారంగా సాగిపోయి జరగవలసిన నష్టం జరిగిపోతుంది. ఇది పార్టీని సరిదిద్దడానికి బదులు పార్టీకి కొత్త సమస్యలు సృష్టించే పని. మన కృషి సమస్యలను పరిష్కరించేదిగానూ లేదా తగ్గించేదిగానూ ఉండాలి తప్ప కొత్త సమస్యలు సృష్టించడానికి తోడ్పడకూడదు.

తోటి కామ్రేడ్స్ లోపాలను రుజువు చేయడానికి తగిన సాక్ష్యాలు సేకరించే పేరుతో నిఘా పద్ధతులను అనుసరించకూడదు. ఆధారాలు తనకు అందినప్పుడు విమర్శించడం వేరు, ఆధారాల కోసం అన్వేషించడం వేరు. తోటి కామ్రేడ్స్‌తో వ్యంగ్యంగా మాట్లాడటం కానీ, దెప్పి పొడుపు మాటలు కానీ సరైంది కాదు. ఈ పద్ధతుల ద్వారా లోపాలను సరిదిద్దడం సాధ్యం కాదు. పార్టీలో పరస్పరం అనుమానాలు, అనైక్యత పెరగడానికే తోడ్పడతాయి. ఇవన్నీ శత్రుపద్ధతులు. శత్రుదేశం మీద, శత్రు వర్గాల మీద, శత్రువులైన వ్యక్తులమీద ప్రయోగించే శత్రుపూరితమైన పద్ధతులివి. కమ్యూనిస్టు పార్టీ శ్రేణుల్లో ఒకరికొకరు శత్రువులుండరు. కుటుంబం, బంధుమిత్రులను మించిన బంధమిది. విస్తృత ప్రజాప్రయోజనం కోసం త్యాగాలకు సిద్ధపడిన కామ్రేడ్స్ మధ్య ఏర్పడిన బంధమిది. అందుకే ప్రేమపూరితంగా చేరదీసి సరిదిద్దే పద్ధతులే తప్ప శత్రుపూరిత పద్ధతులు తగవు.

తానున్న శాఖలో లేదా కమిటీలో కూడా సంబంధిత కామ్రేడ్ సమక్షంలోనే విమర్శ చేయాలి. సంబంధిత కామ్రేడ్ లేనప్పుడు విమర్శ చేయడం వల్ల నష్టం జరుగుతుంది. సంబంధిత కామ్రేడ్‌తో వ్యక్తిగతంగానే లోపాన్ని దృష్టికి తేవడం మరింత ఉత్తమమైన పద్ధతి. అది సత్ఫలితాలు ఇవ్వనప్పుడు శాఖలో లేదా కమిటీలో కూడా విమర్శ చేయవచ్చు. అది కూడా సంబంధిత కామ్రేడ్ సమక్షంలో చేయడం ద్వారానే సత్ఫలితాలిస్తుంది. ఆ కామ్రేడ్ వివరణను కూడా వినేందుకు, తుది నిర్ధారణకు వచ్చేందుకు అవకాశముంటుంది.

తోటి కామ్రేడ్ గురించి ఆరోపణలు ఇతరుల నుండి వినగానే నిర్ణయానికి రాకూడదు. నిజానిజాలను నిర్ధారించుకోకుండా (వెరిఫై చేసుకోకుండా) విమర్శ చేయకూడదు. ఆధారం లేని విమర్శ అనైక్యతకే దారితీస్తుంది. అందుకే తగిన ఆధారాలు లేనప్పుడు అనుమానాల మీద ఆధారపడి విమర్శ చేయకూడదు. ఆధారాలు దొరకనంత మాత్రాన తప్పు జరగలేదని చెప్పగలమా అంటారు కొందరు. ఆధారాలు లేనప్పుడు తప్పు జరిగిందని కూడా రుజువు చేయలేము. తప్పు జరిగిందని నిర్ధారించగలిగినప్పుడే సరిదిద్దగలుగుతాము. ఆధారం దొరికేటప్పటికే ఆలస్యం జరిగి నష్టం పెరుగుతుంది కదా అంటారు కొందరు. ఆధారం లేని ఆరోపణలను నిజాలుగా నిర్ధారించడం మొదలుపెడితే ఇక ఆరోపణలకు హద్దుండదు. అనైక్యత పెరుగుతుంది. శత్రువుల ప్రచారాలన్నీ నమ్మే పరిస్థితి ఏర్పడుతుంది. పార్టీలో పరస్పర విశ్వాసం చెదిరిపోతుంది. అభద్రతాభావం పెరుగుతుంది. పార్టీ విచ్ఛిన్నమవుతుంది. కొన్ని సందర్భాలలో లోపాలు జరుగుతున్నప్పటికీ ఆధారాలకు సమయం పట్టవచ్చు. అంతే తప్ప ఆలస్యమవుతుందనే పేరుతో అనుమానాలు, అనైక్యతను పెంచుకోకూడదు. ప్రతి సందర్భంలోనూ గతాన్ని తవ్వకూడదు. పరిష్కరించిన విషయాలను పదే పదే లేవనెత్తకూడదు. ఎప్పటిదప్పుడు పరిష్కారం చేసుకోవడం ఉత్తమం. "ఆ కామ్రేడ్ ఎప్పుడూ ఇంతే" అనే పద్ధతుల్లో విమర్శ చేయరాదు. ఇక సరిదిద్దడం సాధ్యం కాదని, ఆ కామ్రేడ్ పనికిరాడనే అర్థాన్ని స్ఫురిస్తుందది. అందువల్ల సరిదిద్దడానికి బదులు అపార్థాలకు, అనైక్యతకు దారితీస్తుంది. ఒక ఆరోపణను ఎదుర్కొనేటప్పుడు ప్రత్యారోపణ సరైంది కాదు. తన మీద వచ్చిన ఆరోపణకు సమాధానం ఇవ్వాలి తప్ప ఎదురు దాడి చేయకూడదు. "నా లోపాన్ని నువ్వు గుర్తు చేస్తే నీ లోపాన్ని నేను గుర్తు చేస్తాను" అనే పద్ధతి బ్లాక్‌మెయిలింగ్‌కు తోడ్పడుతుంది తప్ప సరిదిద్దుకోడానికి ఏమాత్రం ఉపయోగపడదు. ఒకరు మాట్లాడుతున్నప్పుడు మధ్యలో అడ్డు

> **"విమర్శకన్నా ఆత్మవిమర్శే విలువైనది. లోపాలను సరిదిద్దుకునేందుకు, పనివిధానాన్ని మెరుగుపర్చుకునేందుకు పార్టీ అభివృద్ధికి పదునైన ఆయుధం ఆత్మవిమర్శ. ఆత్మవిమర్శ అంటే తనపై తాను చేసుకునే ఆంతరంగిక పోరాటం. తన లోపాలను సరిదిద్దుకునేందుకు తాను చేసే కసరత్తు. ఇది మరో వ్యక్తితో సంబంధం లేని విషయం. తనను తాను సరిదిద్దుకునే ప్రక్రియ."**

తగలకూడదు. తగాదా పడకూడదు. పూర్తిగా విని వివరణ ఇవ్వవచ్చు. తన లోపాలను అంగీక రించకుండా ఆత్మ విమర్శ లేకుండా దాట వేయడం, చిన్న చిన్న కారణాలు చూపి అనివార్య మైన పరిస్థితుల్లోనే లోపం జరిగినట్టు చెప్పటం దీర్ఘకాలంలో పార్టీ ఐక్యతను బలహీనపరు స్తుంది. తోటి కామ్రేడ్‌లో చిన్న చిన్న లోపాలను భూతద్దంలో చూపే ప్రయ త్నం, తప్పు జరిగినట్టు నిర్ధారించే ప్రయత్నాలు కూడా లోపాలను సరి దిద్దేందుకు తోడ్పడవు. అనైక్యతను పెంపొంది స్తాయి. ఇలాంటి సమస్యల పట్ల బృందంలోని ఇతర కామ్రేడ్స్ శ్రద్ధ పెట్టక పోవటం వల్ల గానీ, వీటి లోతుపాతుల పట్ల తగిన అవగాహన, అనుభవం లేకపోవటం వల్ల గానీ ఇలాంటివి దొర్లుతుంటాయి. వీటి పర్య వసానాలు తక్షణం కనిపించవు. దీర్ఘకాలంలో పార్టీనష్టపోతుంది. అందుకే పార్టీలో లోపాలను సరిదిద్దుకునేందుకు అనుసరించ వలసిన పద్ధతుల పట్ల తగిన అవగాహన పెంపొందించుకోవటం అవసరం.

**ఆత్మవిమర్శ**

విమర్శకన్నా ఆత్మవిమర్శే విలువైనది. లోపాలను సరిదిద్దుకునేందుకు, పనివిధానాన్ని మెరుగుపర్చుకునేందుకు పార్టీ అభివృద్ధికి పదునైన ఆయుధం ఆత్మవిమర్శ. ఆత్మవిమర్శ అంటే తనపై తాను చేసుకునే ఆంతరంగిక పోరాటం. తన లోపాలను సరిదిద్దుకునేందుకు తాను చేసే కసరత్తు. ఇది మరో వ్యక్తితో సంబంధం లేని విషయం. తనను తాను సరిదిద్దుకునే ప్రక్రియ. తన శక్తి సామర్థ్యాలకు సానబట్టే ప్రక్రియ. ఇందులో తొలిమెట్టు లోపాన్ని సూటిగా అంగీ కరించటం. లోపాన్ని అంగీకరించేవారు గణ నీయంగానే ఉంటారు. ఇది మంచిదే. కానీ లోపాన్ని అంగీకరించటం తోటే ఆత్మవిమర్శ పూర్తయిందని భావిస్తారు. ఇక్కడే పప్పులో కాలు వేస్తారు. నిజానికి ఆత్మవిమర్శకిది ఆరంభం మాత్రమే. ఒకసారి లోపం జరిగిందన్న విష యాన్ని గుర్తించిన తర్వాత అలాంటి లోపం పునరావృతం కాకుండా తీసుకునే చర్యలు ప్రారంభం కావాలి. ఈ చర్యలు లేనప్పుడు లోపా న్ని అంగీకరించడం వల్ల ఫలితమేమీ ఉండదు. అవే లోపాలు మళ్ళీ మళ్ళీ జరుగుతాయి. సరిదిద్ద డం సాధ్యం కాదు. అందుకే లోపం పునరావృ తం కాకుండా చూసుకుంటేనే అది నిజమైన ఆత్మవిమర్శ అవుతుంది. లోపం జరగడానికి దారితీసిన కారణాలను వెతకాలి. ఏ పరిస్థితు లలో ఆ లోపం జరిగిందో అందుకు తోడ్పడిన భౌతిక పరిస్థితులేమిటో విశ్లేషించాలి. అలాంటి భౌతిక పరిస్థితులను అధిగమించేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. వాటిని అమలుజరపాలి. నిర్దిష్ట కాలపరిమితుల్లో తనకు తాను ఫలితాలను సమీక్షించుకోవాలి. అప్పుడే ఆత్మవిమర్శ సం పూర్ణమవుతుంది. ఆచరణలో సత్ఫలితాలని స్తుంది. తన శక్తిసామర్థ్యాలు పెరుగుతాయి. అందుకే పార్టీ ఆంతరంగిక జీవితంలో విమర్శ, ఆత్మవిమర్శ పార్టీ శ్రేణులకు శక్తివంతమైన ఆయుధాలు. వీటిని పూర్తిస్థాయిలో మార్క్సిస్టు పద్ధతిలో వినియోగించుకోవాలి. ❋

# ట్రంప్ విజయం : కల్లోల ప్రపంచంలో కొత్త సమస్య

(17వ పేజీ తరువాయి)

మరో మూడు దేశాలు చైనా, జపాన్, దక్షిణ కొరియా ఉన్నాయి. భారత్, ఆస్ట్రేలియా, న్యూజి లాండ్‌లను కూడా ఇందులోకి ఆహ్వానించారు. ఈ కూటమిలో అమెరికా లేదు. ట్రంప్ వైఖరితో టిపిపి బలహీనపడి ఆర్‌సెప్ బలపడే అవకా శాలు పెరిగాయని విశ్లేషకులు భావిస్తున్నారు.


చైనా నుండి, ఇతర దేశాల నుండి వచ్చే వస్తువులపై 45 శాతం పన్నులు వేస్తామని ట్రంప్ ప్రకటించాడు. అమెరికా ఉద్యోగాలు కాపాడుకోడానికి ఇది తప్పని సరి అంటున్నాడు. ఇదే జరిగితే ఇతర దేశాలు కూడా అమెరికా లాగా రక్షణాత్మక విధానాలు అమలుపరుస్తాయి. దాంతో రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచాధిపత్యం కోసం అమెరికా సృష్టించిన స్వేచ్ఛా వాణిజ్య సౌధం కుప్ప కూలిపోయే అవకా శం ఉంది. అందుకే ట్రంప్ వైఖరితో ఆయా దేశాల ప్రభుత్వాలు వాణిజ్య కూటములకు సంబంధించి పునరాలోచనలో పడ్డాయి. చైనా మాత్రం ఆర్‌సెప్‌ను ముందుకు తీసుకుపోడానికి ఇదే అదనుగా భావిస్తోంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో విదేశీ పెట్టుబడులకు తమ దేశం మరింత అవకాశం ఇస్తుందని, చైనా అభివృద్ధిలో ఈ ప్రాంత దేశాలన్నీ పాలుపంచుకోడానికి ఇదే మంచి అవకాశమని గతమాసం కెనడాలో జరిగిన 'ఎపెక్' శిఖరాగ్ర సభలో అధ్యక్షుడు సి జిన్‌పింగ్ పిలుపు నిచ్చాడు. ఆస్ట్రేలియా, న్యూజి లాండ్ ప్రభుత్వాలు టిపిపి రద్దయితే తాము ఆర్‌సెప్‌లో చేరుతామని పరోక్షంగా హెచ్చరిం చాయి. చైనాను నిలువరించేందుకు అమెరికా ఏర్పరిచిన సైనిక కూటమిలో ఆస్ట్రేలియా ముఖ్య భూమిక పోషిస్తున్న సంగతి విదితమే. ట్రంప్ విజయంతో జపాన్‌లోని సింజె అబె ప్రభుత్వం కూడా పెద్ద సంక్షోభంలో పడింది. ఒక వైపు చైనాకు వ్యతిరేకంగా అమెరికాతో జతకట్టిన జపాన్ ఇప్పుడు సైనికంగా, వాణిజ్య పరంగా అమెరికా తమను వదిలేస్తుందన్న భావనలో ఉంది. అందుకు విరుగుడుగా రష్యా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్‌లతో బంధాన్ని పెంచుకో డానికి అబె ప్రభుత్వం పావులు కదుపుతోంది.

మొత్తం మీద చూసినప్పుడు అమెరికా అధ్యక్షు డిగా ట్రంప్ విజయంతో దేశంలో నిరంకుశ పాలన, అంతర్జాతీయంగా రక్షణాత్మక విధా నాలు పెరిగే అవకాశం ఉంది. ఈ రక్షణాత్మక విధానాలు రెండవ ప్రపంచ యుద్ధం ముందు లాగా వాణిజ్య యుద్ధాలకూ, సైనిక యుద్ధాలకూ దారితీస్తాయన్న భయం వ్యక్తమవుతోంది. అయితే ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లు ట్రంప్ ఆచరణ లో చేయలేడనీ, వాస్తవ పరిస్థితులు ఆయనకు బ్రేకులు వేస్తాయని పదవినుండి తప్పుకుంటున్న అధ్యక్షుడు బరాక్ ఒబామాతో సహా డెమోక్రటిక్ పార్టీ నాయకులు పలువురు చెబుతున్నారు. జనవరిలో పదవీ స్వీకారం చేశాక డొనాల్డ్ ట్రంప్ అమెరికానూ, ప్రపంచాన్నీ ఎటువేపు తీసుకుపోతాడో వేచి చూడాలి.

**విశ్లేషణ**

# ప్రపంచీకరణ రాజకీయ పర్యవసానాలు

**కొండూరి వీరయ్య**



రచయిత అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యవర్గ సభ్యులు

**అ**మెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక ప్రపంచ వ్యాప్తంగా పలువురిని ఆశ్చర్య చకితులను చేసింది. ఎన్నికల ప్రచారం తీరు పరిశీలించిన వారికెవరికైనా ఇది విస్మయం కలిగించే అంశమే. కానీ ప్రపంచీకరణ ధోరణులు, పర్యవసానాలు అధ్యయనం చేస్తున్న వారికి మాత్రం ఈ పరిణామం అంత విస్మయం కలిగించేది కాదు.

ప్రపంచ రాజకీయాల్లో గుర్తించదగిన కల్లోలం చెలరేగుతోందని చెప్పవచ్చు. అటువంటి కల్లోల రాజకీయ పరిణామాల పర్యవసానమే ట్రంప్ ఎన్నిక. ప్రపంచీకరణ క్రమం ఊపందుకుంటున్న కొద్దీ, ఆయా దేశాల్లో ఆర్థిక అంతరాలు పెరుగుతున్న కొద్దీ పాలక వర్గాలు ప్రజాభిప్రాయాన్ని మితవాద శక్తుల చుట్టూ సమీకరించటం అనివార్యమైన రాజకీయ పరిణామంగా ఉంటుంది. యూరోపియన్ దేశాల్లో విజృంభిస్తున్న మితవాద రాజకీయ శక్తులను, వారి నినాదాలను, ఆ నినాదాలకు ప్రజల స్పందన పరిశీలిస్తే ఒకే ధోరణి వ్యక్తం అవుతున్న విషయం కనిపిస్తుంది. ప్రపంచీకరణ విధానాల పర్యవసానంగా ప్రజలు ప్రజాస్వామిక వ్యవస్థల పట్ల విశ్వాసం కోల్పోయారు. తొలుత సంక్షేమ ఆర్థిక వ్యవస్థల మీద ప్రజల విశ్వాసం సన్నగిల్లటం ప్రపంచీకరణ విధానాలను సార్వత్రికంగా అంగీకరించటానికి ఒక కారణం అన్నది ఇక్కడ గుర్తుచేయాలి. ప్రజా సంక్షేమం విషయంలో ప్రభుత్వాన్ని పక్కన పెట్టటానికి అవసరమైన నియంత్రణా వ్యవస్థలను తెరమీదకు తెచ్చే విధి విధానాలు ప్రపంచీకరణ మార్గదర్శకాల్లో కీలకమైనవి.

1980 దశకం నుండీ ప్రారంభమైన ప్రపంచీకరణ విధానాలు ప్రపంచంలో పెరిగిన సంపదను ప్రజల చేతికి అందించటంలో విఫలమైనాయి. నవంబరు చివరి వారంలో విడుదలైన క్రెడిట్ సూయిసీ నివేదిక అంచనా ప్రకారం భారతంలో అగ్రస్థానంలో ఉన్న ఒక్క శాతం జనాభా చేతుల్లో 58 శాతం సంపద కేంద్రీకృతమై ఉంది. పైస్థానంలో ఉన్న పది శాతం కుటుంబాల చేతుల్లో 85 శాతానికి మించిన జాతీయ సంపద కేంద్రీకృతమై ఉంది. సంస్కరణలు అమలు జరిగిన అన్ని దేశాలలోనూ సంపద పంపిణీలో అంతరాలు ఈ మోతాదుల్లోనే ఉన్నాయి. ఇటువంటి సందర్భాల్లో ప్రజలు తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కేందుకు, డిమాండ్లు ముందుకు తెచ్చేందుకు మిగిలిన ఏకైక సాధనం ప్రజాస్వామ్యం. రాజ్యాంగ బద్ధంగా ప్రజలకు సంక్రమించిన హక్కులు. ఈ హక్కులు వినియోగించుకునే క్రమంలో ప్రజలు తమ మనోభావాలను, ఆశలను, ఉద్దేశ్యాలను వెల్లడించేందుకు రాజకీయ రంగమే వేదికగా ఉంటుంది. ఈ రాజకీయాలే ప్రజాస్వామ్యానికి ఊపిరి. అటువంటి ప్రజాస్వామ్యం క్రమంగా సాధారణ ప్రజలకు దూరం కావటం ప్రపంచీకరణ క్రమంలో రాజకీయాల ప్రత్యేక లక్షణంగా ఉంటుంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక కొత్త చట్రం ఉనికిలో రావటం ఈ ప్రత్యేక లక్షణం పర్యవసానంగానే జరుగుతుంది.

వివిధ రంగాల్లో కనిపిస్తున్న రెగ్యులేటరీ సంస్థలు (ఉదాహరణకు భారతదేశంలో విద్యుత్ రెగ్యులేటరీ సంస్థ, టెలికం రెగ్యులేటరీ సంస్థ, పౌర విమానయాన రెగ్యులేటరీ సంస్థ, రైల్వే రెగ్యులేటరీ సంస్థ, పర్యావరణ రెగ్యులేటరీ సంస్థ, పెన్షన్ రెగ్యులేటరీ సంస్థలు, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కనిపిస్తున్న విధంగా రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థలు వంటివి) మచ్చుకు కొన్ని. ఈ కోవకు చెందినదే తాజాగా రిజర్వు బ్యాంకు నియమించిన ద్రవ్య విధాన నియంత్రణ కమిటీ. సాధారణ ఎన్నికల్లో ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వాలు తీసుకోవాల్సిన అనేక నిర్ణయాలను ఈ రెగ్యులేటరీ సంస్థలకు బదలాయించటం ప్రపంచీకరణలో ఒక కోణం మాత్రమే. ప్రభుత్వాలు తీసుకోవాల్సిన కొన్ని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు ఈ రెగ్యులేటరీ సంస్థలు తీసుకుంటాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రెగ్యులేటరీ సంస్థ విద్యుత్ ఛార్జీల పెంపుపై నిర్ణయం చేయటం, తర్వాత ప్రజల ఒత్తిడికి తలొగ్గి చార్జీలు కొద్దో గొప్పో తగ్గించినట్లు వ్యవహరించటం తెలుగు ప్రజలు గత 15 ఏళ్లుగా చూస్తూనే ఉన్నారు. ప్రపంచీకరణ ఈ విధంగా ప్రజలను ప్రభుత్వాల నుండి వేరుచేస్తుంది. మరో మాటగా చెప్పాలంటే ప్రభుత్వాలు ప్రజల నుండి వేరుపడతాయి. ఈ క్రమం అంతా చట్టబద్ధంగా జరుగుతున్నట్లుగానే కనిపించేలా చేయటం ప్రపంచీకరణ విధానాల ప్రత్యేకత. పైన ప్రస్తావించిన అన్ని రకాల రెగ్యులేటరీ సంస్థలకు సంబంధించిన చట్టాలు అటు పార్లమెంట్‌లోనో, ఇటు శాసనసభల్లోనే ఆమోదం పొందేవే. ప్రజల ద్వారా, ప్రజల కోసం ఎన్నుకోబడ్డ మన ప్రజా ప్రతినిధులు ఆమోదిస్తున్న ఈ చట్టాలే రానున్న కాలంలో ప్రభుత్వాలు ప్రజల నుండి వేరుపడటానికి కావల్సిన పునాదులు వేస్తున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజాస్వామ్యం ఈ విధంగా వికృతరూపం తీసుకుంటుంది. తద్వారా ప్రజల నుండి వేరు పడటంతో ప్రజల నిత్య జీవితంలో ప్రజాస్వామిక ప్రతిఘటన, భాగాస్వామ్యం మొక్కుబడి సంఘటనలుగా మారతాయి. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం మొక్కుబడిగా మారిపోవటమే నిజమైన ప్రజాతంత్ర శక్తుల స్థానంలో మితవాద మార్కెట్ ప్రాయోజిత శక్తులు ఆధిపత్య స్థానాలకు చేరుకోవటానికి పునాదులు వేస్తాయి. ప్రపంచీకరణ క్రియాశీల రాజకీయాల నుండి ప్రజల దృష్టి మళ్లించిన ఫలితమే ఇది అని చెప్పుకోవచ్చు. రాజకీయ క్రియాశీలతకు బదులు ప్రజల ఆర్థిక అవసరాలు, ప్రయోజనాలు ముందుకు నెట్టడటం ప్రజల దృష్టిని మళ్లించే యుక్తుల్లో ఒకటి. ఈ ఆర్థిక అవసరాలు, ప్రయోజనాలు నెరవేర్చుకోవాలంటే అదే వ్యవస్థలో కొనసాగుతున్న మరో శక్తిని, వ్యవస్థ భాగాన్ని

“ దీని ఫలితమే అన్ని దేశాల్లోనూ అట్టడుగున ఉన్న యాభై శాతం ప్రజల ఆదాయాలు నిరంతరం కుచించుకుపోతూ ఉంటే ఉన్నత స్థానంలో ఉన్న ఒక్క శాతం ప్రజల ఆదాయాలు మోతాదులోనే కాదు. ఆదాయ వనరుల వైవిధ్యంలోనూ విస్తరిస్తూ పోతున్నాయి. ప్రపంచీకరణ పరా కాష్టకు చేరిన అన్ని దేశాల్లోనూ కేవలం శ్రమపైనే ఆధార పడ్డ శ్రామిక వర్గంతో పాటు సంఘటిత రంగ కార్మికులు, ఆధునిక మేధో కార్మికుల వేతనాలు స్థంభించిపోతున్నాయి.”

శత్రువుని చేసి నిలబెడతాయి. ఈ సదరు శత్రువు అంతగా రక్తమాంసాలు నింపుకుని కండపట్టి ప్రజాస్వామిక వ్యవస్థనే శాసించే స్థితికి చేరుకోవటం వెనక ఈ వ్యవస్థాగత ప్రయోజనాలను కాపాడే వర్గ పరిపాలనే కీలకం అన్న విషయాన్ని ప్రజలు మర్చేంతగా ప్రపంచీకరణ శక్తులు, వాటి అండదండలతో పాలకులుగా ఎదిగిన దేశీయ పాలకవర్గాలు నైపుణ్యం సాధించాయి. అమెరికాలో “ సరికొత్త అమెరికా శకం” అని ట్రంప్ నినాదం ఇచ్చినా భారతదేశంలో “నల్లధనంపై పోరాటం” అని మోడీ పిలుపునిచ్చినా ఈ రెండు ధోరణుల మధ్య ఉన్న సారూప్యత ఒక్కటే. ప్రపంచీకరణ దుష్ప్రభావాలతో రాజకీయంగా క్రియాశీలమవుతున్న సాధారణ ప్రజానీకాన్ని తిరిగి దైనందిన జీవన్మరణ ఆర్థిక సమస్యల కొలిమిలో నెట్టడమే. ప్రపంచీకరణను పెంచి పోషించిన మితవాద శక్తులకు ప్రాతినిధ్యం వహించే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తిరిగి అదే ప్రపంచీకరణ వల్ల అమెరికా నష్ట పోయిందనీ, దేశీయ ప్రజల ఉద్యోగాలు విదేశీయుల వశం అయ్యాయనీ వాదిస్తారు. భారత దేశంలో నల్లధనం కుప్పలు పోయటానికి మార్గం సిద్ధం చేసిన పాలకవర్గాల ప్రతినిధిగా ఉన్న మోడీ మరో వైపున నల్లధనంపై పోరాటం పేరుతో ప్రజల చేతుల్లో ఉన్న కొద్దిపాటి సొమ్ముపై పూర్తి నియంత్రణాధికారాలు తీసుకుంటాడు. ఎన్డీయే ప్రభుత్వం నల్లధనంపై ప్రారంభించిన పోరాటం అంతిమంగా ప్రజలు తమ కష్టార్జితం పై హక్కు కోల్పోయే పరిస్థితికి పునాదులు వేస్తోంది.

ఈ మొత్తం వికృత ప్రజాస్వామిక క్రీడలో విజేతలు అన్ని దేశాల్లో ఒకే లక్షణాలను పోలిన వర్గాలు ఉంటాయి. అవి సంపద కలిగిన వర్గాలు, లాభార్జన చేయగలిన వర్గాలు, అంతర్జాతీయ విపణి అవసరాలు తీర్చగలిగే రీతిలో ఆధునిక మార్కెట్ పట్టభద్రులు, ఏ నిముషంలోనైనా ఎక్కడికైనా వెళ్లి బతగ్గల శక్తులు వర్గాలు. ఈ క్రీడలో నిరంతరం ఓడిపోతున్న వర్గాలు కూడా ఉన్నాయి. అవి సంపద, ఆధారపడగలిగిన స్థాయిలో స్థిరాస్థి లేని పేదలు, శ్రమ తప్ప మరో వనరు లేని వర్గాలు, అసంఘటిత, నైపుణ్యం లేని కార్మికులు, ఉద్యోగులు, ఉన్న ఊరు వదిలేస్తే అస్థిత్వం కోల్పోయే చిన్న సన్నకారు రైతులు, భూమి లేని వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికులు. ప్రపంచీకరణ ఫలితాలు వివిధ వర్గాలపై వివిధ స్థాయిల్లో ప్రభావాన్ని చూపుతాయి. ఆయా వర్గాల మధ్య ఆర్థిక అంతరాలు కూడా వ్యత్యాసంతో కూడి ఈ ప్రభావం మోతాదుకు అనుగుణంగా ఉంటాయి. దీని ఫలితమే అన్ని దేశాల్లోనూ అట్టడుగున ఉన్న యాభై శాతం ప్రజల ఆదాయాలు నిరంతరం కుచించుకుపోతూ ఉంటే ఉన్నత స్థానంలో ఉన్న ఒక్క శాతం ప్రజల ఆదాయాలు మోతాదులోనే కాదు. ఆదాయ వనరుల వైవిధ్యంలోనూ విస్తరిస్తూ పోతున్నాయి. ప్రపంచీకరణ పరా కాష్టకు చేరిన అన్ని దేశాల్లోనూ కేవలం శ్రమపైనే ఆధారపడ్డ శ్రామిక వర్గంతో పాటు సంఘటిత రంగ కార్మికులు, ఆధునిక మేధో కార్మికుల వేతనాలు స్థంభించిపోతున్నాయి. నిరుద్యోగం సాధారణ పరిధిని మించి ఉంటుంది. ఉదాహరణకు యూరోపియన్ యూనియన్‌లో నిరుద్యోగం ఈ కాలంలో 10 శాతాన్ని మించి ఉండగా అమెరికాలో 20 శాతం వరకు ఉన్నది. అమెరికాలో 1970 మొదలు సాధారణ ఉద్యోగుల వేతన పెరుగుదల స్థంభించి పోయింది. తద్వారా జాతీయ ఆదాయంలో వేతనాల మోతాదు కుదించుకుపోతుంది. ప్రపంచీకరణ విధానాల వల్ల అపారమైన ఉపాధి అవకాశాలు వస్తాయని యువతను పాలకులు నమ్మించటం మనం చూస్తూనే ఉన్నాము. తాము అధికారానికి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన మోడీ అధికారానికి వచ్చాక ఎస్టీ ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులతో సహా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలన్నీ (పోస్టులతో సహా) రద్దు చేస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేయటం ఈ విధానాల పర్యవసానమే. ఇంత నష్టం జరుగుతున్నా ప్రజలు ఎందుకు కళ్లు తెరవటం లేదన్న ప్రశ్న ముందుకు రావటం సహజం. ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవటానికి ప్రపంచీకరణ పర్యవసానంగా తలెత్తే ఆర్థిక అంతరాలతో పాటు సామాజిక అంతరాలు కూడా పరిశీలించటం అవసరం.


పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించింది మొదలు రెండో ప్రపంచ యుద్ధం వరకు అనుసరించిన వ్యవస్థాగత విధానాలు నేడు ప్రపంచీకరణ విధానాల కంటే భిన్నమైనవి. నాటి విధానాలు జాతీయ రాజ్యాలు, వాటి ప్రయోజనాలతో ముడిపడి ఉండేవి. ఫలితంగా ఆయా పెట్టుబడిదారీ దేశాల ఆధీనంలో ఉన్న వలస దేశాల్లో నిత్య దరిద్రం తాండవిస్తున్నా స్వదేశాల్లో మాత్రం వలస దోపిడీ ఫలితాలను పాక్షికంగానైనా శ్రామిక వర్గానికి సంక్షేమం రూపంలో పాలక వర్గాలు అందచేసేవి. తద్వారా విదేశాల్లోని శ్రామిక వర్గాలను బహిరంగంగా దోపిడీ చేయటానికి స్వదేశంలో శ్రామిక వర్గం మద్దతు కూడా సమకూర్చుకునేవి. రెండో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కుప్పకూలటానికి ఈ విధానమే కారణం అని చరిత్ర ఘోషిస్తుంది. ఈ తరహా విధానాల్లో ఆయా దేశాల్లో దోపిడీ క్రమం బాహాటంగా కనిపిస్తుంది. అభివృద్ధి ఒకవైపున, వెనకబాటు తనం మరో వైపున కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. నేటి విధానాలు దీనికి భిన్నమైనవి. కేవలం పెట్టుబడి ప్రయోజనాలతో మాత్రమే ముడిపడి ఉన్నాయి. ఈ పెట్టుబడి దేశీయ గుత్త పెట్టుబడి వర్గాలది కావచ్చు విదేశీ ద్రవ్యపెట్టుబడి కావచ్చు. ఈ క్రమలో రెండున్నర శతాబ్దాల అనుభవంతో పెట్టుబడిదారీ విధానం ఒక కొత్త మార్గాన్ని తెరమీదకు తెచ్చింది. గతంలో లాగా ఒక శిబిరంలో అభివృద్ధి మరో శిబిరంలో దారిద్ర్యంకి బదులు ఒకే దేశంలో ఒకే వర్గంలో కొందరిని అభివృద్ధి రైలు ఎక్కించుకుని మిగిలిన వారిని వెయిటింగ్ లిస్టులో పెట్టే క్రమమే ఇది. ఈ విధంగా వెయిటింగ్ లిస్టు టిక్కెట్లు పొందిన వారు తాము ఎక్కాల్సిన రైలు జీవిత కాలం లేటు అన్న విషయాన్ని గుర్తించ లేక ప్రపంచీకరణ ముందుకు తెచ్చే ఘటోత్కచుడి మాయా దుప్పటి కోసం ఎదురు చూస్తూనే ఉంటారు. ఈ క్రమం అటు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోనూ, ఇటు అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ దేశాల్లోనూ ఒకే తరహాలో కనిపిస్తుంది. దీంతో ప్రపంచీకరణను ముందుకు తీసుకెళ్లే ఎజెండాయే జాతీయాభివృద్ధి ఎజెండాగా చిత్రీకరించటం పాలకవర్గాలకు మరింత సులభ సాధ్యం అవుతుంది.

భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల

విషయంలో గత పాతికేళ్లుగా జరుగుతున్న ప్రచారం సారాంశం ఇదే. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు దేశీయమార్కెట్‌ను అప్పగించటం ప్రపంచీకరణను ముందుకు తీసుకెళ్లే క్రమంలో అంతర్భాగం. దేశీయ ఆర్థిక వ్యవస్థలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతోనూ, దేశీయ గుత్తపెట్టుబడిని అంతర్జాతీయ గుత్తపెట్టుబడితోనూ, దేశీయ పారిశ్రామిక పెట్టుబడిని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితోనూ మిలాఖత్‌ చేయించే క్రమం ఇది. కానీ అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు గానీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మన దేశాన్ని అభివృద్ధి చేయటానికి వస్తున్నట్లు ప్రచారం చేయటంలో కౌటిల్యుడిని కూడా అధిగమించాయి. స్వాతంత్ర్యానంతరం వివిధ రాష్ట్రాల్లోని ప్రత్యేక వ్యవసాయోత్పత్తులు, వాటిని పండించే రైతాంగానికి రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన నియంత్రణా వ్యవస్థలు నేడు రద్దు అవుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో రైతులకు కనీస భద్రత కల్పించే వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌ విధానం స్థానంలో జాతీయ వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌ విధానం తెరమీదకు వచ్చింది. దీన్ని ప్రారంభిస్తూ కూడా ప్రధాని రైతాంగం ఆదాయం రెట్టింపు చేయటంలో ఈ జాతీయ ఏకీకృత మార్కెట్‌ వ్యవస్థ పెద్ద ముందడుగు అని ఉపన్యాసం చేస్తే భళా అని చప్పట్లు కొట్టే 21వ శతాబ్దపు భట్రాజులు (ఎలక్ట్రానిక్‌, ప్రింట్‌ మీడియా) ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయారు.

ఈ మొత్తం వ్యవస్థీకృత ప్రపంచీకరణ క్రమం పర్యవసానంగా ముందుగా ప్రస్తావించుకున్నట్లు ప్రభుత్వం ప్రజల నుండి దూరం అవుతుంది. ప్రజా సంక్షేమం కోసం పాటు పడే ప్రధాన సాధనంగా ఉన్న ప్రభుత్వం క్రమంగా కార్పొరేట్‌ ప్రయోజనాలు కాపాడే ఏకైక లక్ష్యానికి పరిమితం అవుతుంది. అది తీసుకునే అన్ని నిర్ణయాలు బహిరంగ సభలు, ధర్నాలు, సమ్మెలు నియంత్రించటం మొదలు సామాజిక మాధ్యమాల్లో ఏమి చర్చించాలి ఏమి చర్చించకూడదు అన్నది నిర్ణయించే వరకు, ప్రభుత్వ నిర్ణయాన్ని హేతుబద్ధంగా ప్రశ్నించే తత్వానికి బదులు కిమ్మనకుండా అంగీకరించి అమలు చేసే విధంగా పౌరులను తయారు చేయటం వరకు ఈ కాలంలో అన్ని దేశాల్లో ప్రభుత్వాలు తీసుకునే విధాన నిర్ణయాలు అన్నీ అప్రతిహత ప్రపంచీకరణకు దారితీసే చర్యలే. వీటిని ప్రశ్నించే గొంతుకలు ఎక్కువగా ఉన్న లౌకిక సమ్మిళిత ఉద్యమ సాంప్రదాయాలు ఉన్న భారతదేశం వంటి దేశాల్లో ఈ నిర్ణయాలను ప్రశ్నించటం జాతి వ్యతిరేకత, దేశ ద్రోహం అవుతుంది.

"సంపన్న దేశాల్లో ఈ క్రమం ముందుగా మొదలైంది కాబట్టి ప్రజలు ముందుగా మేల్కొంటారు. అలా మేల్కొన్న వారిని కూడా పక్కదారి పట్టించిదోపిడీ వర్గాలు ప్రపంచీకరణ శక్తులు తమ ప్రయోజనాలు కాపాడుకునేందుకు సరికొత్త ఎజెండాను తెరమీదకు తెస్తాయి. అదే జాతీయోన్మాదం."



నిష్ఠ దరిద్ర్యంలో పేదలు

ప్రభుత్వ నిర్ణయంలో లోపాలు గుర్తించి చర్చకు పెట్టడం ఉగ్రవాదులతోనో, దేశ ద్రోహులతోనో కుమ్మక్కు కావటం అయిపోతుంది. నిరూపణలకు నిలవని ఆరోపణలు ఆరంగేట్రం చేస్తాయి.

సంపన్న దేశాల్లో ఈ క్రమం ముందుగా మొదలైంది కాబట్టి ప్రజలు ముందుగా మేల్కొంటారు. అలా మేల్కొన్న వారిని కూడా పక్కదారి పట్టించిదోపిడీ వర్గాలు ప్రపంచీకరణ శక్తులు తమ ప్రయోజనాలు కాపాడుకునేందుకు సరికొత్త ఎజెండాను తెరమీదకు తెస్తాయి. అదే జాతీయోన్మాదం. ఏ దేశంలో ప్రపంచీకరణ వలన జరిగిన నష్టాన్ని ప్రజలు మదింపు వేసుకునే సమయం వస్తుందో ఆ దేశాల్లో జాతీయత, జాతీయాభిమానం క్రమంగా జాతీయోన్మాదం రూపం తీసుకుంటాయి. వాల్‌ స్ట్రీట్‌ ఆక్రమణ ఉద్యమం మొదలు గత దశాబ్ద కాలంగా అమెరికా ప్రజలు ప్రపంచీకరణ దుష్ప్రభావాల నుండి పాఠాలు నేర్చుకునేందుకు ఉపక్రమించారు. ఈ తరం మర్చిపోయిన సంక్షేమ రాజ్యం 2016 అమెరికా ఎన్నికల్లో మళ్లీ చర్చనీయాంశంగా మారింది. హిల్లరీ క్లింటన్‌కు పోటీ ఇచ్చే స్థాయికి బెర్నీ సాండర్స్‌ ఎన్నికల పోరాటం ఎదిగింది. ఒక దశలో హిల్లరీ స్థానంలో డెమొక్రాట్ల అభ్యర్థిగా సాండర్స్‌ ఎంపిక అయితే ట్రంప్‌ విజయం కష్టమే అన్న అంచనాలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా పాలక వర్గాలు క్రమంగా సాండర్స్‌ను బరిలో నుండి తప్పించాయి. గత దశాబ్ద కాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు నాయకత్వం వహించింది డెమొక్రాట్లే కావటం, ఈ కాలంలోనే అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎన్నడూ లేనంతగా సంక్షోభంలో కూరుకుపోవటం, ప్రజలు కడగండ్ల పాలు కావటం ట్రంప్‌ వంటి మితవాద రిపబ్లికన్లకు కలిసి వచ్చింది.

2014 నాటి భారతదేశ ఎన్నికల పోరాటం దీనికి భిన్నంగా ఏమీ కనపడదు. అమెరికా ఆర్థిక వ్యవస్థ తరహాలోనే భారత ఆర్థిక వ్యవస్థ సైతం ఈ కాలంలో అంతర్జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం ప్రభావానికి కుంగిపోయింది. ఉపాధి పతనం అయ్యింది. నిజవేతనాలు స్తబ్దతకు లోనయ్యాయి. వరుసగా రెండు సార్లు అధికారానికి వచ్చిన కాంగ్రెస్‌ నేతృత్వంలోని సంకీర్ణం అంతర్జాతీయ పెట్టుబడితో దేశానికి ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించి, ఆర్థిక వ్యవస్థను పురోగతి పట్టాలు ఎక్కించలేకపోయింది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సరసన కూర్చున్న దేశీయ బడాపెట్టుబడిదారులు తమ అవకాశాలనుకాపాడుకోవాలని నిర్ణయించటంతో అటువంటి కర్తవ్య నిష్ఠకలిగిన కరసేవకుడు మోడీ రూపంలో ఈ వర్గాలకు ప్రత్యక్షమయ్యాడు. ట్రంప్‌ ఎన్నికల్లో జాతీయోన్మాదం, అమెరికా గొప్పదనం ప్రజాభిప్రాయాన్ని మలచే సాధనంగా మారినట్లే ఆరెస్సెస్‌ విరచిత హిందూ మతోన్మాదం మన దేశంలో ప్రజాభిప్రాయాన్ని మలచే సాధనంగా నిలిచింది. దీనికి తోడు మధ్యతరగతి మేధావులు అటు అమెరికాలోనూ, ఇటు భారతదేశంలోనూ మార్కెట్‌ మంత్రమే ప్రజాస్వామ్యం అని పల్లవి ఎత్తుకున్నారు. భారతదేశం వంటి దేశాల్లో ప్రజాస్వామ్యం మాత్రమే ఉన్నది. ఈ ప్రజాస్వామ్యంలో ప్రజలు సాధికారవంతులు కావటానికి బదులుగా పెట్టుబడిదారీ వర్గాలు సాధికారవంతులు, శక్తిసంపన్నులయ్యారు. అందువల్ల ఈ తరహా ప్రజాస్వామ్యాన్ని కాపాడటం వారి రాజకీయ ప్రయోజనాల్లో అంతర్భాగం. ప్రజలను శక్తి

> **“ ఈ జంట ప్రమాదాలకు ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాలు వివిధ దేశాల్లో వివిధ రూపాల్లో అంకురిస్తున్నాయి. లాటిన్ అమెరికాలో ఈ కాలంలో తెరమీదకు వచ్చిన ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు 1950 దశకంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహాలతో జరిగిన ప్రయోగాలను గుర్తుకు తెస్తున్నాయి. ”**

సంపన్నులను, సాధికారవంతులను చేసే ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్యం అంటే పాలక వర్గాలకు ఎనలేని భయం. పర్యవ సానం పెట్టుబడి దారీ వర్గ ప్రయోజ నాలు కాపాడే రెండు ప్రత్యామ్నాయాలకు మాత్రమే ప్రజాతంత్ర పోరాటం, ప్రత్యే కించి ఎన్నికల పోరాటం కుదించుకు పోయింది. ట్రంప్ రిపబ్లికన్ పార్టీలో ఆధిపత్య స్థానానికి ఎదిగిన తీరు ఇక్కడ భారతదేశంలో మోడీ బిజెపిలో అద్వానీ వంటి బాహుబలిని మట్టికరిపించి ప్రధాని అభ్యర్థిగా ఆధిపత్యం సాధించిన తీరు మధ్య సారూప్యత ఉండటం ఆశ్చర్యం కలిగించక మానదు.

పెట్టుబడిదారీ వ్యవస్థ అకృత్యాలను, దురా గతాలను సవరించి, 'చట్టబద్ధ దోపిడీ వ్యవస్థ'ను తెరమీదకు తెచ్చే ప్రయత్నంలో భాగంగానే ప్రజాస్వామ్యం తెరమీదకు వచ్చింది. 1945 పరిణామాల తర్వాత ప్రపంచంలో మూడో వంతు భూభాగంపై ఎర్రజెండా జయకేతనం ఎగురవేయటంతో అనివార్యంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తనను తాను సంస్కరించుకోవల్సిన దుస్థితికి నెట్టబడింది. ఈ క్రమంలో తెరమీదకు వచ్చిందే సంక్షేమ రాజ్యం. సోవియట్ వ్యవస్థలో ప్రజా సంక్షేమం మౌలిక పునాది అయితే పెట్టు బడిదారీ వ్యవస్థల్లో సంక్షేమం తమ రాజకీయ పునాదులు కాపాడుకునే సాధనంగా అక్కరకొచ్చింది.



సంపద పెంచుకుంటున్న శత కోటీశ్వరులు

వలసవాదం అంతర్ధానం కావటంతో పాటు విముక్తి పొందిన వర్ధమాన దేశాలు ఆయా దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా స్వతంత్ర అభివృద్ధి పంథాలను అనుసరిస్తూ, అభివృద్ధి వ్యూహాల్లో పలు రకాలైన ప్రయోగాలకు తెరలేచింది. భారతదేశంలో అమలు జరిగిన రాజ్య పెట్టుబడిదారీ విధానం ఈ ప్రయోగాల్లో ఒకటి కాగా అమెరికా అను సరించిన సంక్షేమ విధానాల కంటే యూరో పియన్ యూనియన్ దేశాలు అనుసరించిన సంక్షేమ విధానాలు భిన్నమైనవి కావటం ప్రయోగాల్లో విలక్షతను చూపించే అంశం.

వైవిధ్య పూరితమైన ప్రజాతంత్ర అభివృద్ధికి బదులు మార్కెట్ శక్తుల అభివృద్ధే నిజమైన అభివృద్ధి అన్న ప్రచారానికి తెర లేచింది. మార్కెట్ ఛాందసవాదం, మత ఛాందసవాదం జంట శక్తులుగా ముందుకు వచ్చాయి. ప్రత్యేకించి పెట్టుబడిదారీ వ్యవస్థలోని చక్రీయ సంక్షోభాలు ఉధృతం అయిన 20వ శతాబ్దం చివరి దశాబ్దం, 21వ శతాబ్దం తొలి దశాబ్దాలో ఈ ధోరణి మరింత ఘనీభవించింది. మార్కెట్ ఛాందసవాదం, మతోన్మాదం ఒకదాని కొకటి పరస్పర సహాయకారిగా నిలిచాయి. ఈ జంట ప్రమాదాలకు ప్రజాతంత్ర ప్రత్యామ్నా యాలు వివిధ దేశాల్లో వివిధ రూపాల్లో అంకు రిస్తున్నాయి. లాటిన్ అమెరికాలో ఈ కాలంలో తెరమీదకు వచ్చిన ప్రభుత్వాలు అను సరిస్తున్న ఆర్థిక విధానాలు 1950 దశకంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహాలతో జరిగిన ప్రయోగా లను గుర్తుకు తెస్తున్నాయి. మరోవైపున సాంప్రదాయక వామపక్షశక్తులతో పాటు గ్రీస్‌లో సిరిజా, స్పెయిన్‌లో పోడెమోస్ వంటి శక్తులు తలెత్తుతు న్నాయి. అమెరికా ఎన్నికల్లో బెర్నీ సాండర్స్ పొందిన ప్రజాదరణను ఈ కోణంలో అర్థం చేసుకోవాల్సి ఉంది. బ్రిటన్‌లోని లేబర్ పార్టీలో జెర్మీ కార్బిన్ నాయకత్వ స్థానానికి రావటమే కాదు. బ్రెక్సిట్ ఉత్పాతాన్ని తట్టుకుని నిలవటం కూడా గమనించదగ్గ పరిణామం. ప్రస్తుతానికి భారతదేశంలో మోడీ, అమెరికాలో ట్రంప్, మరి కొన్ని యూరోపియన్ దేశాల్లో మిత వాద శక్తులు ప్రపంచీకరణను మరింత ముందు కు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే వివిధ దేశాల్లో ఊపిరి పోసుకుంటున్న జనతా ప్రజాతంత్ర శక్తులు ఇప్పటి వరకు ఆర్థిక రంగానికి పరిమితం అయిన ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాన్ని రాజకీయ రంగానికి విస్తరించటానికి అనువైన పరిస్థితులను వేగవంతం చేస్తున్నాయనటంలో సందేహం లేదు.

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

# విద్వేష విషం చిమ్మిన దీనదయాళ్ ఉపాధ్యాయ



రచయిత
విశ్రాంత న్యాయమూర్తి

**ఏజి నూరానీ**

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీకి కాంగ్రెస్‌తో ఏ విధమైన సంబంధం ఉన్నదో, దీనదయాళ్ ఉపాధ్యాయకు భారతీయ జనతా పార్టీతో ఆ విధమైన సంబంధం ఉన్నదని, ప్రశిక్షణ మహా అభియాన్‌పై మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సిద్ధాంత పత్రిక 'ఆర్గనైజర్' కు గతంలో సంపాదకునిగా పనిచేసిన, ప్రస్తుత బి.జె.పి. కేంద్ర కమిటి సభ్యుడు ఆర్. బాలశంకర్ అభిప్రాయపడినాడు. ఆయన వివరించినట్లుగా "సెప్టెంబర్ 25 భారతదేశ రాజకీయ దిఙ్మండలంలో ఒక ప్రసిద్ధి చెందిన కొత్తవ్యక్తిని గుర్తించే పనిని ప్రారంభించారు. ఒక సంవత్సర కాలం పాటు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ యొక్క శత జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం యోచించింది. సెప్టెంబర్ 24న కోజికోడ్‌లో జరిగిన బి.జె.పి. జాతీయ కౌన్సిల్ సమావేశాలలో నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించాడు." సెప్టెంబర్ 23న మోడీ ప్రభుత్వం స్మారక ఉత్సవాల నిర్వహణకు గాను రెండు కమిటీలను ప్రకటించింది. 149 మంది సభ్యులు గల జాతీయ కమిటీకి నరేంద్ర మోడీ అధ్యక్షునిగా, 23 మంది సభ్యులు గల కార్య నిర్వాహక కమిటీకి హోంశాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

ప్రస్తుత పాలక పార్టీకి చెందిన రాజకీయ నాయకుని శత జయంతి స్మారక ఉత్సవాలకు నిస్సిగ్గుగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, నిధులను దుర్వినియోగపరచడం రాజ్యాంగ విరుద్ధం. వారి ప్రభుత్వాలు సాధించిన విజయాలను ప్రచారం చేసుకోవడాన్ని, ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రుల వ్యక్తిగత ప్రతిష్టలను పెంచుకునే విధానాలను సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా నిరాకరించింది. సంబంధిత లౌకికవాదులు, మేధావులు, ప్రభుత్వేతర సంస్థలచే దాఖలు చేయబడిన రిట్ పిటిషన్లతో ఈ విధానాలు సుప్రీంకోర్టుచేత నిరాకరించబడవచ్చు.

ఇంకా బహిరంగపర్చబడిన బి.జె.పి. యొక్క స్పష్టమైన విధానం ఏమంటే ప్రాధాన్యతలలో దీనదయాళ్ ఉపాధ్యాయను స్వీకరించి, గాంధీని తిరస్కరించడం; మోడీ ప్రభుత్వం వెర్రిగా, పిచ్చి పట్టినట్లుగా మతతత్వ సిద్ధాంతాన్ని వెనుకేసుకొని రావడం; రానున్న సంవత్సర కాలంలో ఉత్తర ప్రదేశ్, పంజాబ్‌లలో జరగబోయే ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా మతతత్వ సిద్ధాంతాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళుతున్నది. ఉపాధ్యాయ భావాలను దేశంలో ప్రవేశపెట్టడంతోపాటు, మన దేశ రాజ్యాంగానికి పునాదిగా ఉన్న గాంధీ-నెహ్రూల యొక్క లౌకిక భావాలను తిరస్కరించడం.

నరేంద్ర మోడీ తన ఆలోచనలను కోజికోడ్‌లో సెప్టెంబర్ 25న బహిర్గతపరచడంలో తన సమయాన్ని వృధా చేయలేదు. బి.జె.పి. జాతీయ కౌన్సిల్‌నుద్దేశించి మాట్లాడుతూ, "యాభై సంవత్సరాల క్రితం పండిట్ ఉపాధ్యాయ ఈ విధంగా పేర్కొన్నాడు: ముస్లింలకు పురస్కారాలివ్వవద్దు, వారిని తిరస్కరించవద్దు, కాని శుద్ధి చేయండి". "సీనియర్ ఆర్.ఎస్.ఎస్. సిద్ధాంతకర్త రాకేష్ సిన్హా, మోడీ గారు శుద్ధి చేయండి అంటే "ముస్లింలు విమర్శనాత్మకంగా పరీక్షించుకొని ఇస్లాం సంస్కృతి కన్నా ముందు ఉన్న భారతదేశ మేధోపరమైన వారసత్వాన్ని అంగీకరించాలి' అని అర్థం చెప్పారు. బి.జె.పి. యొక్క హిందూత్వ వాద రహస్యం బయటపెట్టబడింది. ఉపాధ్యాయ పట్ల తనకున్న విధేయతను చాలా భద్రంగా తన 56 అంగుళాల ఛాతీలో మోడీ దాచుకున్నాడు. ఆలస్యంగా బయటపెట్టిన తన విధేయతకు ఒక లక్ష్యం ఉన్నది. ఉపాధ్యాయ సిద్ధాంతాన్ని దేశ పాలనలో మళ్ళీ కొత్తగా ఉపయోగించడం కోసం నరేంద్ర మోడీ ఎదురు చూస్తున్నాడు.

**దుర్మార్గమైన మతతత్వ ఎజెండా**

ఉపాధ్యాయ దుర్మార్గమైన మతతత్వవాది. అతడు ముస్లింలను ద్వేషించాడు. వారిని అనుమానించేవాడు. భారతదేశ సరిహద్దు పొడవునా 10 మైళ్ళ వెడల్పు ప్రాంతాన్నుండి ముస్లింలను తరలించి, సురక్షిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాడు. దేశ విభజన రద్దు కావాలని, కుల వ్యవస్థ ఉండాలని అతను కోరుకున్నాడు. పంజాబి సుబా కొరకు చేసిన ప్రతిపాదనలను వ్యతిరేకించాడు. ఉన్మాదపూరితంగా వ్యవహరిస్తూ జవహర్‌లాల్ నెహ్రూను, కాంగ్రెస్‌ను ఖండించాడు.

'ద హిందూ నేషనలిస్ట్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా (1996)' రచయిత, ఫ్రెంచ్ పరిశోధకుడు క్రిస్టోఫి జాఫ్రీలాట్ 'హిందూత్వాస్ ప్యూరిఫికేషన్ డ్రైవ్' అనే వ్యాసంలో హిందూత్వ వాదుల సాకులను, నెపాలను చీల్చి చెండాడాడు. ఆయన ఈ విధంగా పేర్కొన్నాడు. "శుద్ధి చేయడం యొక్క ముఖ్య భావం హిందూ మతంలోని కుల వ్యవస్థతో సంబంధం కలిగి ఉండడం. 1875 లో ఆర్య సమాజాన్ని స్థాపించిన స్వామి దయానంద యొక్క శుద్ధి ఆచార కర్మ, క్రియల ద్వారా స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఆయనే హిందూ మత పునరుజ్జీవన నిర్మాణకర్త. పంజాబ్‌లో ముస్లింలు, క్రైస్తవులుగా మారిన దళితులను తిరిగి హిందూ మతంలోకి మార్పిడి చేయడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాడు. 19వ శతాబ్దం చివరలో 'అంటరానివారుగా' పిలవబడుతున్న కొంతమందికి సంస్కృతీకరణపై ఉన్న వెర్రితనంతో ఆర్య సమాజం నాటకమాడింది. వారికి జంధ్యాలను ధరింపచేసి ఆర్య సమాజవాదులు సామాజిక శక్తుల సుడిగుండం అనే ప్రమాదం నుండి తప్పించే ప్రయత్నంచేసి, వారిని సవర్ణ విలువల పట్ల భక్తిని ప్రదర్శించే విధంగా ప్రోత్సహించారు. దయానంద దృష్టిలో

> **“దళితులనేకాక, ఇతర మతాలలోకి మారిన వారిని కూడా హిందూ జాతీయవాద సిద్ధాంత కర్తలు ఎందుకు శుద్ధిచేసే ప్రయత్నాలు కొనసాగించారో వివరించారు'. వి.డి. సావర్కర్ రచించిన 'హిందూత్వ' కూడ అదే కోణాన్ని ప్రదర్శించింది. కాబట్టి దీనదయాళ్ ఉపాధ్యాయ కూడా అదే దృష్టితో చూశాడు.”**

శుద్ధి చేయబడిన అనంతరం అంటరానివారితో సహా ప్రతి కులం భాగంగా ఉండేదే వర్ణ వ్యవస్థ.

ఉపాధ్యాయ అవే విశ్వాసాలను పొలుపంచుకున్నాడు. 'సమగ్ర మానవతావాదం' అనే అతని యొక్క వేదాంతంలో వర్ణ వ్యవస్థ యొక్క సజీవ ఐక్యత ముఖ్యమైన భావనలలో ఒకటిగా ఉన్నది. దానినే సంఘ్‌పరివార్ నాయకులు వారి సిద్ధాంతానికి మూలస్తంభంగా పరిగణించారు.” 1965లో ఆయన (ఉపాధ్యాయ) ఈ విధంగా వ్రాశాడు: 'నాలుగు వర్ణాలు అనే మన భావనలో, అవి విరాట పురుషుని యొక్క వివిధ అవయవాలతో సమానం. ఋగ్వేదం ప్రకారం ఆది మానవుడు త్యాగం చేసి వర్ణ వ్యవస్థ రూపంలో నున్న ఒక సమాజానికి జన్మనిచ్చాడు'. ఈ జాతి నిర్మాణ ప్రక్రియను భరించే సజీవ ఐక్యతను కలిపి వర్ణ వ్యవస్థ దానంగా ఇవ్వబడింది.

“దళితులనేకాక, ఇతర మతాలలోకి మారిన వారిని కూడ హిందూ జాతీయవాద సిద్ధాంత కర్తలు ఎందుకు శుద్ధిచేసే ప్రయత్నాలు కొనసాగించారో వివరించారు'. వి.డి. సావర్కర్ రచించిన 'హిందూత్వ' కూడ అదే కోణాన్ని ప్రదర్శించింది. కాబట్టి దీనదయాళ్ ఉపాధ్యాయ కూడ అదే దృష్టితో చూశాడు. ఈ శుద్ధిచేసే సిద్ధాంతం శుద్ధి ఉద్యమం వద్ద ప్రారంభమై, నేడు ఘర్‌వాపసీ కార్యక్రమంగా రూపొందించబడింది.

జాఫ్రీలాట్ ఇక్కడ కొద్దిమంది మాత్రమే గమనించిన ఒక ముఖ్య విషయాన్ని పేర్కొన్నాడు: “భారతదేశంలో ఇస్లాంను స్థాపించిన ఏ సూఫీ సన్యాసులు మక్కా కానీ, మదీనాకు గానీ వెళ్ళలేదు. దానికి బదులుగా వారు చాలా తీవ్రంగా యోగులతో ఆధ్యాత్మిక సంభాషణలను సాగిస్తూ, వారి యొక్క పవిత్ర హిందూ స్థలాల ప్రక్కనే నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. వారి సమాధులు యాత్ర కేంద్రాలుగా తయారయ్యాయి. సుల్తానులు, ఔరంగజేబుతో సహా గొప్ప గొప్ప మొగలులు ఎవ్వరూ మక్కా గానీ, మదీనాకు గానీ వెళ్ళలేదు. దానికి బదులుగా వారు అజ్మీర్‌లోని 'ము ఇన్ అల్‌దిన్ చిష్టికి, ఢిల్లీలోని నిజాముద్దీన్ ఆలియాకు , ఇతర ప్రాంతాలకు వెళ్ళారు.

“సిద్ధాంతకర్తలు సౌదీ అరేబియాచేత ఆకర్షించబడుతుండగా, ముస్లీంలు మాత్రం స్థానికంగా ఉన్న పవిత్ర స్థలాలవైపు కొనసాగుతున్నట్లుగా దర్గాలను సందర్శించే గుంపులు తెలియజేస్తున్నాయి. 'భారతీయ ముస్లింల విషయంలో 'శుద్ధి' 'జాతీయీకరణ' ద్వారా విస్తారంగా జరిగింది. వీరు (భారతీయ ముస్లింలు) వారి మత సన్యాసుల (పెద్దల) దేశాన్నే తమ స్వంత పవిత్ర దేశంగా చూశారు”.

**హిందూత్వీకరణ**

1969 డిసెంబర్‌లో పాట్నాలో జరిగిన 16వ అఖిల భారత భారతీయ జనసంఘ్ సమావేశం 'అంతర్గత పరిస్థితి'పై ఒక తీర్మానం ప్రవేశపెట్టింది. ఆ తీర్మానం నాటి అధ్యక్షుడు బల్‌రాజ్ మథోక్‌చే ప్రచారం చేయబడిన 'భారతీయీకరణ'ను గురించి నొక్కి చెప్పింది. అది ముస్లింలను హిందువులుగా మార్చాలని చెప్పే కఠినమైన విషయానికి మృదువైన మాట. ముస్లింలు శుద్ధి కావాలని మోడీ చెప్పే మాట ఆ భావం నుండే వచ్చింది. “నాడు మథోక్ చెప్పింది కూడ 'ముస్లింలను హిందువులుగా మార్చడం' లేక 'భారతీయీకరణ' యొక్క అర్థం యిదే”. 1969లో ప్రచురించబడిన మథోక్ రచన 'భారత జాతీయతావాదం' యొక్క భావం కూడ ఇదే: “హిందూ అనే పదాన్ని పూజ్యమైన వస్తువుగా తయారుచెయ్యడం అర్థం లేని విషయం. నేడు ఆ పదం అంటే ఇష్టం లేనివారిని బలవంతం చేయడానికి బదులు, మాటల్లో, రాతల్లో “భారతీయతకు” పర్యాయ పదంగా ఆ పదాన్ని (హిందూ) ప్రచారం చెయ్యాలి. కానీ ఇది, ఎప్పుడైతే ఈ సమాజంలోని అభిమానులు వారంతట వారు దానియొక్క విశాల జాతి ప్రయోజనాలను అర్థం చేసుకొని, హిందూ మతాన్ని ఇస్లాం, క్రిస్టియన్ మతాల స్థాయికి దిగజార్చే హిందూ మతం, కులాల గురించి మాట్లాడటం నిలిపి వేసినపుడు సాధ్యం అవుతుంది. భారతదేశంలో నివసించే ముస్లింలు, క్రైస్తవులు కూడ హిందువులే. భారతదేశం, భారతీయ సంస్కృతి వారియొక్క మొట్ట మొదటి రాజభక్తిని శాసిస్తే, వారంతా హిందూ రాజ్యంలో లేక భారతజాతిలో భాగంగా రూపొందుతారు.

“ఈ స్పృహ నేడు భారతదేశంలోని చాలా మంది క్రైస్తవులలో, ముస్లింలలో లోపించింది. నేడు భారత జాతీయతా వాదంలో ఉన్న సమస్యకు అత్యవసర పరిష్కారమేమంటే, అలాంటి ముస్లిం, క్రైస్తవులను 'భారతీయీకరణ' లేక 'హిందూత్వీకరణ' చేయడం, వివిధ మతాలకు, కులాలకు చెందిన సభ్యులుగా ఉన్నారన్న స్పృహను కలిగించే సర్వోత్కృష్టమైన జాతీయతా స్పృహను వారిలో అభివృద్ధి చేయడం”.

“ఇండోనేషియన్ లేక చైనా ముస్లింలు ఇండోనేషియన్ లేక చైనీయుల పేర్లను స్వీకరించినట్లుగానే వారు (ముస్లింలు, క్రైస్తవులు) భారతీయ పేర్లను స్వీకరించాలి అని పేర్కొంటాడు. ఒక్క మాటలో చెప్పాలంటే భారత జాతీయవాదానికి ప్రభుభక్తిని ప్రదర్శించని వారి మతం – జాతీయ స్వభావాన్ని స్వీకరించాలి. ముస్లిం లేక క్రైస్తవ ఆ మాటకొస్తే సిక్కు లేక జైన్‌ల సంస్కృతులపై ప్రత్యేక చర్చలు నిలిచిపోవాలి”. 1990 దశకంలో ఎల్.కె. అద్వానీ ఆగిపోయిన సావర్కర్ హిందూత్వ సిద్ధాంతాన్ని ముందుకు నడిపి, దానిపట్ల తనకున్న విశ్వాసాన్ని ప్రదర్శించాడు.

**సడలింపులేని ఆర్ఎస్ఎస్ పట్టు**

1951 ఆర్.ఎస్.ఎస్.కు రాజకీయ సంస్థగా ఏర్పడిన జనసంఘ్‌ను ఆర్.ఎస్.ఎస్. కంట్రోల్ లోనే నడిపించగల వ్యక్తి కొరకు వెదికే క్రమంలో నాటి ఆర్.ఎస్.ఎస్. చీఫ్ ఎం.ఎస్.గోల్వాల్కర్ చేత ప్రత్యేకంగా ఏరికోరి ఎంపిక చేయబడిన వ్యక్తి ఉపాధ్యాయ. గోల్వాల్కర్‌కు ప్రియమైన అనుచరునిగా గుర్తింపు పొందడానికి ఉపాధ్యాయ చాలా కష్టపడినాడు.

ఆర్.ఎస్.ఎస్. బంధాల నుండి బి.జె.పి బయటపడి ఒక లౌకిక కన్సర్వేటివ్ పార్టీగా అవతరిస్తుందని, కోరుకొని అమెరికాలో ఉన్న భారతీయులు వారిని వారు మోసంచేసుకున్నారు. ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో నడిచిన ఎల్.కె. అద్వానీ బిజెపి మూడవ అధ్యక్షుడు. ఆర్ఎస్ఎస్ నియంత్రణ బలహీనపడలేదు, ఇంకా బిగువయింది. ఇప్పుడు ఒక ప్రచారక్ ప్రధానమంత్రి.

ఉపాధ్యాయ 1916లో జన్మించాడు. 1937లో ఆర్.ఎస్.ఎస్.లో చేరి, 'పాంచజన్య' పత్రికకు 1947లో సంపాదకునిగా పనిచేసి గాంధీ హత్యానంతరం రహస్య జీవితం గడిపారు. 1951 అక్టోబర్ 21న జనసంఘ్ స్థాపించబడింది. 1952 డిసెంబర్‌లో కాన్పూర్‌లో

జరిగిన దాని వార్షిక సదస్సులో ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడినాడు. జాఫ్రిలాట్ ఈ విధంగా పేర్కొన్నాడు: “అదే సమయంలో 1960వ దశకం మధ్యలో ఆర్.ఎస్.ఎస్. జనసంఘ్‌పై ఉచ్చు బిగించింది. 1967లో మథోక్ నుండి ఉపాధ్యాయ జనసంఘ్ అధ్యక్ష పదవిని స్వీకరించాడు.

**శుద్ధి సిద్ధాంతము**

ప్రస్తుతం నరేంద్ర మోడీ చేసేది ‘శుద్ధి సిద్ధాంతం’ అమలుకు ప్రయత్నం చేస్తున్నాడు. ‘అఖండ భారత్’ అనే వ్యాసంలో ఉపాధ్యాయ ఈ విధంగా పేర్కొన్నాడు: “మనసున్న ఏ మనిషి కూడ 6 కోట్ల మంది ముస్లింలు భారతదేశం నుండి బయటికి వెళ్ళగొట్టబడాలి లేక నిర్మూలించబడాలి అని అనడు. కానీ వారు వారిని భారతీయ జీవన విధానాన్ని అనుసరించే వారిగా గుర్తుంచుకోవాలి. భౌగోళికంగా విభజించబడిన భారతదేశంలో ఐక్యత సాధ్యమవుతుందన్న స్పృహ ఉంటే, మిగిలిన విభజించబడని భాగాన్ని గుర్తించడం అనతికాలంలోనే సాధించబడుతుంది. ఐకమత్య దృష్టి లోపంతో ఒక దేశం విభజించబడితే, ఐక్యతా దృష్టి ఏర్పడితే మళ్ళీ దేశాన్ని ఐక్యం చేస్తుంది. దానికోసం మనమంతా కృషి చేయాలి. ముస్లింలను సరియైన భారతీయులుగా తయారు చేయడానికి, గత అర్ధ శతాబ్ద కాలంగా అనుసరించిన విధానాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ హిందూ–ముస్లిం ఐక్యత కొరకు తప్పుడు విధానాలను అనుసరించింది. వాస్తవ జాతి ఐక్యత, సంస్కృతిలో భాగస్వాములు కావాలన్న విధానాన్ని నొక్కి చెప్పడానికి బదులు, విభజనను రెచ్చగొట్టే విధానాలను కాంగ్రెస్ అనుసరించింది. రాజకీయ లబ్ధి కొరకు భిన్న వర్గాలకు చెందిన అనేకమంది ప్రజలను కృత్రిమంగా ఐక్యం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేసింది. అలాంటి ప్రయత్నాలు ఎన్నటికీ విజయవంతం కాలేవు. జాతీయవాదం, జాతి వ్యతిరేక వాదం కలిసి ఎప్పటికీ సామరస్యంగా ఉనికిలో ఉండజాలవు”.

1965లో పూనాలో చేసిన ప్రసంగంలో (ఉపాధ్యాయ) ఈ విధంగా సూటిగా ప్రశ్నిస్తాడు: “స్వతంత్ర పాలన, విదేశీ పాలన ఏ విధంగా కలిసి ఉనికిలో ఉంటాయి? ఈ రెండు పరస్పర విరుద్ధమైనవి. శివాజీ మహారాజు స్వరాజ్య సార్వభౌమత్వాన్ని స్థాపించాడు. ఆ స్వరాజ్య విధానాలు, పద్ధతులను అనుసరించడం ద్వారానే భారతదేశాన్ని విముక్తం చేయాలని కోరుకుంటాడు. హైదరాబాద్, గోవాలను సాధించిన పద్ధతిలోనే పాకిస్తాన్‌ను కూడ సాధించుకుంటాం. ఇది మన బాధ్యత, మన హక్కు. మన దేశంలో

> **“హైదరాబాద్, గోవాలను సాధించిన పద్ధతిలోనే పాకిస్తాన్‌ను కూడా సాధించుకుంటాం. ఇది మన బాధ్యత, మన హక్కు. మన దేశంలో ఏ విదేశీ శక్తులు ఉండడాన్ని మనం సహించకూడదు. పాకిస్తాన్‌ను విముక్తిచేసి దానిని భారతదేశంలో ఐక్యం చేయడం దాడి చేసినట్లు కాదు, ఎందుకంటే మనదైనటువంటి దానిని తీసుకునే హక్కు మనకు ఉన్నది.”**



ముస్లింల ఆస్తులను దగ్ధం చేస్తున్న ఆర్ఎస్ఎస్

ఏ విదేశీ శక్తులు ఉండడాన్ని మనం సహించకూడదు. పాకిస్తాన్‌ను విముక్తిచేసి దానిని భారతదేశంలో ఐక్యం చేయడం దాడి చేసినట్లు కాదు, ఎందుకంటే మనదైనటువంటి దానిని తీసుకునే హక్కు మనకు ఉన్నది.

“ఆ విధంగా మాట్లాడే ప్రయత్నం చేయడం ఒక దాడి. కానీ వాస్తవమేమంటే, పాకిస్తాన్ యొక్క ఉనికే స్వతంత్ర భారత్‌పైన ఒక దాడి. ముస్లింలు మన సోదరులే, వారు విదేశీయులుగా పిలువబడకూడదని కొంతమంది వాదిస్తారు. ఇక్కడే నివసించి, ఇక్కడి సంపదను ఉపయోగించుకున్న ఔరంగజేబు ఎందుకు విదేశీ పాలకునిగా పరిగణింపబడినాడు? మొగలు చక్రవర్తులు విదేశీయులుగా పరిగణింపబడవలసినవారు కాదా? ఒకవేళ కాకుంటే, మొగలుల అధికారానికి వ్యతిరేకంగా పోరాడిన శివాజీ ఈ దేశం యొక్క కుట్రదారుడిగా పరిగణించబడాలి. ఒకవేళ అక్బర్ మనవాడే అయితే, అతనికి వ్యతిరేకంగా పోరాడిన రాణా ప్రతాప్ ఒక దేశభక్తుడు కాకూడదు. ఒకవేళ రాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ, ఛాత్రసాల్, దుర్గావతి మొదలగువారు దేశభక్తులైతే, వీరు ఎవరికి వ్యతిరేకంగా పోరాడినారో వారు విదేశీయులుగా ఖచ్చితంగా పరిగణింపబడాలి. అక్బర్ గొప్పవాడు కావచ్చు, కానీ అతడు మనవాడు కాదు. వెయ్యి సంవత్సరాల బాని సత్వం అనంతరం మనం స్వేచ్ఛను పొందిన విషయం గురించి మాట్లాడతాం. అంటే దీనర్థం అక్బర్ పరిపాలనా కాలంలో మనం దాస్యంలోనే ఉన్నాం అని అర్థం”. ఇదే విషయాన్ని మోడి 2014లో పార్లమెంట్‌లో తన మొదటి ప్రసంగంలో పేర్కొన్నాడు.

“1947లో పాకిస్తాన్ సృష్టించబడింది. దీని గురించి చెప్పాలంటే మొగలుల కాలం నుండి విదేశీ ఆధిపత్యంలో ఉన్న మన దేశం గురించి చెప్పాలి. ఒక భాగం స్వేచ్ఛాయుతంగా మారింది కానీ ఇంకొక భాగం మళ్ళీ బానిసత్వంలోకి పోయింది. బానిసత్వంలో ఉన్న భాగం యొక్క ప్రభుత్వం స్వతంత్ర భారతం అన్న భావనతో నడిపించబడడం లేదు. ముస్లింలు ఒక ప్రత్యేక గుర్తింపును, జాతిని కోరుతూ ప్రత్యేక దేశం కావాలని డిమాండ్ చేశారు. ముస్లింలు ఇక్కడికి చేతిలో కత్తితో వచ్చారు, కాబట్టి ముస్లింలతో యుద్ధం అనేది మతపరమైనది కాదు రాజకీయ పరమైనది అన్న విషయాన్ని మరచిపోకూడదు”.

“మన పోరాటం మహ్మద్‌లతో కాదు లేక ముల్లాలు, మౌల్వీలతో కూడ కాదు. మన పోరాటం మతపరమైన సాహసంతో కూడుకున్న

> **"వాస్తవానికి ఆయనకు భారతీయ ముస్లింల దేశభక్తి పైన దూషణలు చేసే హక్కులేదు. 5 కోట్లమంది భారతీయులు ఇస్లాం మతాన్ని విశ్వసిస్తున్నారు. సంక్షోభ కాలంలో వారియొక్క దేశభక్తిని నమ్మకంలోకి తీసుకొనకపోతే ఇండియా- పాకిస్తాన్ సరిహద్దులో ఇండియావైపు 10 మైళ్ళ దూరపు 'ముస్లిం ఫ్రీ జోన్' ఎంత సహాయకరంగా వుంటుంది"?"**

రాజకీయ ఆకాంక్షను ప్రదర్శిస్తున్న ముస్లింల ప్రవర్తనతో మాత్రమే. అందుకే ఈ యుద్ధం మతపరమైనది కాదు, కానీ రాజకీయపరమైనది. ఛత్రపతి శివాజీకి ఈ విషయం బాగా తెలుసు. అందుకే ఆయన మసీదులను కూల్చకుండా ఔరంగజేబుతో పోరాడినాడు. నేడు మన యుద్ధం కూడ రాజకీయ స్వాతంత్ర్యం కొరకు మాత్రమే. ఎందుకంటే ముస్లింలు భారతీయ జాతీయతా వాదం యొక్క జన జీవనప్రవంతిలో కలవక పోవడమే కారణం".

ఉపాధ్యాయ ఈ విధంగా వివరిస్తాడు: "ముస్లింల యొక్క దురభిమానాన్ని ఓడించే ఒకే ఒక విధానం ఉన్నది. అది వారిని రాజకీయంగా ఓడించడం. ముస్లింల సమస్యకు అదే తగిన పరిష్కారం. వారు రాజకీయంగా ఓడించబడ నంతకాలం ఈ కుళ్ళు పెరిగిపోవడం కొనసాగు తూనే ఉంటుంది. ఆ విధమైన ఓటమి మాత్రమే వారిలో రెండవ ఆలోచనకు తావిస్తుంది. అప్పుడు హిందూ, ముస్లిం సహకారం ప్రారంభ మౌతుంది. ఓటమి మనుషులను ఆలోచింప చేస్తుందని ఒక సాధారణ నియమం ఉన్నది. హిందువులకు సంబంధించినంత వరకు వారి సాంప్రదాయం ఏ వర్గంతోనైనా సర్దుబాటు ధోరణితో ఉంటుంది. మన విధానం జాతీయతకు సంబంధించిన ఆలోచనపై దాడిచేసినట్లుగా, మతపరమైన ఆలోచనపై సహనంతో, సామాజిక ఆలోచనపై సర్దుబాటు ధోరణిలో ఉండాలి". పాకిస్తాన్‌కు సరిహద్దుకు 10 మైళ్ళ దూరంలో ముస్లింలు ఉండాలని 1965లో ఉపాధ్యాయ డిమాండ్ చేశాడు. దానికి కారణం ముస్లింలు సందేహాత్మక విశ్వాసాన్ని ప్రదర్శించడమే. 'ద టైమ్స్ ఆఫ్ ఇండియా' మే 20, 1963 సంపాదకీయం పరుషమైన విమర్శలు చేసింది. ఉపాధ్యాయ చేసిన ఆరోపణ ప్రకారం భారత్, పాకిస్తాన్ మధ్య తగాదా ఉన్న పరిస్థితులలో భారతీయ ముస్లింలు భద్రతా సమస్యలకు సంబంధించిన ఇబ్బందులు కలుగజేయవచ్చు. వాస్తవానికి ఆయనకు భారతీయ ముస్లింల దేశభక్తి పైన దూషణలు చేసే హక్కులేదు. 5 కోట్లమంది భారతీయులు ఇస్లాం మతాన్ని విశ్వసిస్తున్నారు. సంక్షోభ కాలంలో వారియొక్క దేశభక్తిని నమ్మకంలోకి తీసుకొనకపోతే ఇండియా–పాకిస్తాన్ సరిహద్దులో ఇండియావైపు 10 మైళ్ళ దూరపు 'ముస్లిం ఫ్రీ జోన్' ఎంత సహాయకరంగా వుంటుంది"?

ఉపాధ్యాయకు, జనసంఘ్‌కు భారతదేశం, పాకిస్తాన్ ముస్లింలు ఒక రాజకీయ సమస్య తెచ్చిపెట్టారు. ఆయన 1965లో పూనేలో ఈ విధంగా వ్యాఖ్యానించాడు: "ఈ రాజకీయ సమస్య పరిష్కరించబడాలా, వద్దా? అన్న విషయంపై ఏ విధమైన సందేహం అవసరం లేదు. ఇది పరిష్కరింపబడవలసి ఉంది. అది పరిష్కరించబడే మార్గం ఒకటి ఉన్నది. ముస్లింలు రాజకీయంగా ఓడించబడకుంటే లేదా ఓడించబడనంతవరకు, ఆ సమస్య పరిష్కరించబడదు. అలాంటి ఓటమి అనంతరం మాత్రమే, ముస్లింలను సమానంగా చూడటం సాధ్యమవుతుంది. జ్ఞానంతో కూడిన హిందూ–ముస్లింల సమస్య ఉపశమన పరిష్కారాలకు దారి చూపింది. వారు విఫలం చెందారనడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. వేరుపడిన వారి ఓటమితో (ముస్లింల), హిందువుల ఆత్మన్యూనతా భావనల ఫలితంగా ఏర్పడిన తప్పుడు విధానాలు కూడ మాయమవుతాయి. ఓటమి ఏ వ్యక్తినైనా తనను తాను విశ్లేషించుకునేటట్లు చేస్తుంది. ముస్లింలు నిష్కపటమైన స్వీయ విశ్లేషణ చేసుకున్నప్పుడు వారి సాంప్రదాయాలు భారతీయ సాంప్రదాయాలేనని, పూర్వీకులు అందరికీ ఒక్కరేనని, భారతమాత వారి మాతృభూమి అన్న నిజాన్ని తెలుసుకుంటారు.

**జనసంఘ్ సిద్ధాంతకర్తగా**

శ్యాంప్రసాద్ ముఖర్జీ బతికి ఉన్నప్పుడే, ఉపాధ్యాయ జనసంఘ్‌లో ప్రముఖుడిగా ఉన్నాడు. 1952 మేలో జనసంఘ్‌చే అమలు జరపబడాల్సి ఉన్న నియమాలను ఆయన వివరించాడు. "అవిభక్తమైన భారతదేశం ఊహాజనితమైన భావం కాదు, కానీ ఎంతో ఆలోచించబడిన ఆదర్శం. కొంతమంది ప్రజలకు భారతదేశ విభజన ఒక పరిష్కరించబడిన వాస్తవం. ఈ దృష్టి పూర్తిగా తప్పు. ఈ దృష్టి ఉండడానికి గల కారణం ఏమంటే, 'మాతృభూమి' పట్ల ప్రేమ లేకపోవడమే. ఈ ప్రజలు చరిత్రను మరచిపోయారు వారు ఈ చిక్కులను సరిగా అర్థం చేసుకొనలేదు. ముస్లింల ఆధిపత్య పాలనలో దేశం చాలా భాగాలుగా విభజింపబడింది. కానీ మన హిందూ నాయకులు దానిని ఒక 'పరిష్కరింపబడిన వాస్తవం'గా ఒప్పుకోలేదు. దానికి వ్యతిరేకంగా పోరాడినారు".

"జనసంఘ్ యొక్క రెండవ నియమం ఈ దేశంలో ఒకే ఒక జాతి ఉండాలి. ఈ జాతిలో మైనార్టీలు ఎవరూ లేరు. మానవ శరీరానికి ఒక ముక్కు, రెండు కళ్ళు కానీ ఆ లెక్కన కళ్ళను మెజార్టీగా, ముక్కును మైనార్టీగా చూడకూడదు. దీనికి కారణం చాలా చిన్నది; కళ్ళు, ముక్కు రెండూ కూడ ఒకే శరీరంలో ఉండే భాగాలే".

"మూడవ నియమం ఏమంటే ఇక్కడ ఒకే ఒక సంస్కృతి ఉండాలి. క్రైస్తవులకు, ముస్లింలకు ఇక్కడ ప్రత్యేకమైన సంస్కృతులు ఏమీలేవు. సంస్కృతి పూజించే పద్ధతి ఒక వర్గానికి సంబంధించినది కాదు; ఇది దేశానికి సంబంధించినది. కబీర్, జయసీ, రసఖాన్ ముస్లింలకు ఆదర్శంగా నిలవాలి. కానీ నేడు ముస్లింలు ప్రదర్శించే రాజభక్తి భారతదేశానికి వెలుపల ఉన్న వారిపట్ల కేంద్రీకరించబడుతుంది. ముస్లింలు వారియొక్క భావాలను, దృష్టిని పూర్తిగా మార్చుకోవాలి".

ఉపాధ్యాయ జనసంఘ్ యొక్క సిద్ధాంత కర్తగా ప్రసిద్ధికెక్కాడు. థామస్ బ్లామ్ హాన్‌సెన్ అనే స్కాలర్ ఈ విధంగా పేర్కొంటాడు: "దీనదయాళ్ ఉపాధ్యాయ భారతీయ జనసంఘ్ స్థాపించబడిన 1951 నుండి ఆర్.ఎస్.ఎస్.కు పూర్తికాలపు ఆర్గనైజర్‌గా పనిచేసాడు. 1965లో 'సమగ్ర మానవతావాదం'పేరుతో తన అధికారిక సిద్ధాంతంగా జనసంఘ్‌చే ఏర్పాటు చేయబడిన భావాలను ఆయన వృద్ధిచేశాడు.

ఢిల్లీకి చెందిన ఒక విద్యావేత్త ప్రళయ్ కానుంగో ఈ విధంగా పేర్కొన్నాడు: "దీనదయాళ్ ఉపాధ్యాయ, గోల్వాల్కర్ యొక్క సాంస్కృతిక జాతీయవాదానికి తన సమగ్ర మానవతావాద సిద్ధాంతం నుండి అనుబంధంగా కొంత భాగాన్ని చేర్చాడు. ఆర్.ఎస్.ఎస్. యొక్క హిందూ రాష్ట్ర భావనలకు ఈ కొత్త సిద్ధాంతం అత్యాధునికతను చేర్చినట్లు అయింది, దానితో సైద్ధాంతిక శక్తి మరింత బలపడినట్లయింది. సమగ్ర మానవతావాదం'ను మార్గదర్శిగా జనసంఘ్ 1965లో స్వీకరించింది. 1980లో


బి.జె.పి. కూడ అదే విధంగా స్వీకరించింది.

"సామ్యవాదం, స్వేచ్ఛా ఆర్థిక విధానం నియంతృత్వానికి కారణభూతమవుతాయని" ఉపాధ్యాయ, ఆర్.ఎస్.ఎస్. వేదిక నుండి పేర్కొన్నాడు. "ప్రపంచంలోని సమస్యలకు పరిష్కారం హిందూ మతంలో లభిస్తాయని, సోషలిజంలో ఉండవని" కూడ పేర్కొన్నాడు.

గతంలో జనసంఘ్, ప్రస్తుతం బి.జె.పి. లాగ సోషలిజంతోపాటు, లౌకికతత్వాన్ని ఉపాధ్యాయ ద్వేషించాడు. అలీఘర్‌లో జరిగిన ఒక ఆర్.ఎస్.ఎస్. సమావేశంలో "భారత్ లౌకిక దేశంగా ప్రకటించడం ద్వారా, భారత్‌మాత ఆత్మ దాడికి గురైంది. ఒక లౌకిక దేశం అంటే అది బాధలతో నిండి ఉండే దేశం. ధర్మం లేని రావణ రాజ్యం అయిన లంకలో బోలెడంత బంగారం ఉన్నప్పటికీ, అక్కడ రామరాజ్యం లేదని" పేర్కొంటాడు.

ఇదంతా అవిశ్రాంతంగా ఆయన దృష్టి కోణం నుండి అనుసరించబడింది. ఒక వ్యాసంలో ఈ విధంగా పేర్కొన్నాడు: "మనం ఐక్యతను కోరుకుంటే, హిందూ జాతీయవాదమైన భారతీయ జాతీయవాదాన్ని తప్పకుండా అర్థం చేసుకోవాలి. హిందూ సంస్కృతి అయిన భారతీయ సంస్కృతిని అర్థం చేసుకోవాలి. హిందూయేతరులైన వారు శుద్ధి చేయబడకుండా, హిందువులుగా మారకుండా, తన భారత్‌లో వారికి స్థానం లేదంటాడు. సాంస్కృతిక జాతీయవాదం అంటే అర్థం అదే. రాజ్యాంగం వెంటనే మార్చబడవలసి ఉన్నది. ఉపాధ్యాయ దృష్టిలో "రాజ్యాంగం భారత్ యొక్క ఐక్యత, అవిభాజ్యతకు సవాల్‌గా తయారయ్యింది. మన ప్రజల హృదయాలలో పవిత్రమైన మాతృభూమిగా లిఖించబడిన భారత్‌మాత అనే భావనకు గుర్తింపులేదు. భారత రాజ్యాంగంలోని మొదటి పేరా ప్రకారం, ఇండియా అంటే భారత్, రాష్ట్రాల సమాఖ్యగా బీహార్ మాత, బంగ మాత, పంజాబ్ మాత, కన్నడ మాత, తమిళ మాత అంతా కలిపి భారత్‌మాతగా చెప్పబడింది. ఇది హాస్యాస్పదం. ప్రాంతాలన్నీ భారత్‌మాత అవయవాలుగా ఉంటాయన్న ఆలోచన మనకున్నది గాని ఆ ప్రాంతాలన్నీ ఒక్కొక్క మాతగా చూడబడకూడదు. కాబట్టి మన రాజ్యాంగం సమాఖ్యగా కాకుండా ఏకీకృతంగా ఉండవలసి ఉన్నది. భారతవర్ష లాగా భారతీయ సంస్కృతి ఏకీకృతమైనదిగా, అవిభాజ్యమైనదిగా ఉండాలని జనసంఘ్ విశ్వసించింది. కాబట్టి విభిన్న సంస్కృతుల యొక్క చర్చ వాస్తవ దూరమైనదే కాదు అపాయకరమైనది కూడ. అది జాతి ఐక్యతను బలహీన

> **"ఉపాధ్యాయ 'అఖండ భారత్' కావాలని చాలా బలంగా ప్రతిపాదించాడు. 1954 ఆగస్ట్ 24న 'ఆర్గనైజర్' లో తన వ్యాసంలో ఈ విధంగా వ్రాశాడు: "అఖండ్ భారత్ అనేది దేశం యొక్క భౌగోళిక ఐక్యతను ప్రదర్శించడమే కాదు, భారతీయ జీవన విధానాన్ని కూడా సూచిస్తుంది. అది భిన్నత్వంలో ఏకత్వాన్ని విశదపరుస్తుంది."**



దీనదయాళ్ ఉపాధ్యాయ

పరుస్తుంది. విభజనధోరణులను ప్రోత్సహిస్తుంది".

**అఖండ భారత్**

ఉపాధ్యాయ 'అఖండ భారత్' కావాలని చాలా బలంగా ప్రతిపాదించాడు. 1954 ఆగస్ట్ 24న 'ఆర్గనైజర్' లో తన వ్యాసంలో ఈ విధంగా వ్రాశాడు: "అఖండ్ భారత్ అనేది దేశం యొక్క భౌగోళిక ఐక్యతను ప్రదర్శించడమే కాదు, భారతీయ జీవన విధానాన్ని కూడ సూచిస్తుంది. అది భిన్నత్వంలో ఏకత్వాన్ని విశదపరుస్తుంది.

1965 ఆగస్ట్ 17న జనసంఘ్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది: "విభజన ఉనికిలో ఉన్నంతకాలం భారత్, పాకిస్తాన్‌ల మధ్య శాంతి నెలకొనదు. పాకిస్తాన్ గూండాయిజంకు మనం తలవంచిన కారణంగా, శాంతి విధానాన్ని కొనసాగించిన కారణంగానే ఈ రెండింటి మధ్య దూరం పెరిగింది. అనేకమంది భారతీయ ముస్లింలు పాకిస్తాన్ పట్ల భావపూరిత సంబంధాలు కలిగి ఉన్నారు. ఈ స్థితిలో మార్పు రావాలంటే రెండు చర్యలకు పూనుకోవాలి. ఒకటి, పాకిస్తాన్‌తో మనం సాగించే సంబంధాలలో 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' విధానాన్ని అనుసరించాలి. భారత్‌ను జయించా లన్న కల నిజం కాదన్న విషయం పాకిస్తాన్ తెలుసుకున్న రోజున అది (పాకిస్తాన్) ఆత్మ పరిశీలన చేసుకొని భారత్‌ను విభజన చేయడంలో తన తప్పిదాన్ని తెలుసుకుంటుంది. కానీ ఇది జరగా లంటే 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' విధానాన్ని అనుసరించాలి. రెండవది, భారతీయ ముస్లిం లను శాంతపరచడానికి ఏ విధమైన ఒడం బడికలు జరగకూడదు. మతరహిత రాజ్యం అయిన భారత్‌లో ముస్లింల హక్కులన్ని రక్షించబడతాయి. కానీ భారతీయ ముస్లింల పాకిస్తాన్ అనుకూల వైఖరిని సహించని విషయంలో, వారి వైఖరిలో మార్పు వచ్చి, అది భారతీయ వైఖరిగా మార్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి". భారతీయ ముస్లింలు, పాకిస్తాన్‌లను కలిపి జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది.

1964 మార్చిలో ఢిల్లీలో జనసంఘ్ కేంద్ర కమిటీ ఒక తీర్మానం చేసింది: "విభజన రద్దు చేయబడి, పాకిస్తాన్ విముక్తి చేయబడాలి. అదే భరతజాతి యొక్క అంతిమ లక్ష్యంగా ఉండాలి". దీనికి గల కారణాలను ఢిల్లీలో జరిగిన జనసంఘ్ ప్రతినిధుల సమావేశంలో నివృత్తి చేయబడినాయి. ఆ వెంటనే 'కుచ్ సంధి' ని వ్యతిరేకిస్తూ ఒక ప్రదర్శన కూడ చేయబడింది. "పాకిస్తాన్ ఉనికిలో ఉన్నంత కాలం భారత్-పాక్ శాంతి చర్చలు నిష్ప్రయోజనం అవుతాయి. పాకిస్తాన్ ఒత్తిళ్ళకు తలొగ్గడం అంటే, దాని గర్వం పెరిగేట్లు చేయడమే. భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్ ఆశలు నానాటికీ పెరిగిపోతున్నాయి. హిందుస్తాన్‌లో ఒక పెద్ద ముస్లిం గ్రూపు భావావేశంతో పాకిస్తాన్‌తో ఒక్కటైంది. వీరిరువురు ఒకరినొకరు బలపరుచుకుంటున్నారు. రెండు పరిష్కార మార్గాలు చూపబడినాయి: పాకిస్తాన్ యొక్క మొగలు సామ్రాజ్యం కలలు బద్దలు చేయబడాలి. భారతీయ ముస్లింలతో ఏ విధమైన రాజకీయ బేరసారాలు ఉండకూడదు" ఆ తీర్మానం ఈ విధానం యొక్క ఫలితాలను వివరించింది. "పాకిస్తాన్ ప్రజలు, పాలకులు తప్పకుండా ఆత్మ పరిశీలన చేసుకుంటారు.

> **"సెప్టెంబర్ 25న నరేంద్ర మోడీ కోజి కోడ్‌లో ముస్లింలు 'శుద్ధి' చేసుకోవాలని బెదిరిస్తూ చేసిన ప్రసంగం తన యొక్క బి.జె.పి. యొక్క వాస్తవ రూపాలను బహిర్గత పరిచింది. వారు ఏ విధంగా శుద్ధి చేసుకోవాలో ఆయన సూచించ లేదు. గతంలో జరిగిన వాటిని తలచుకుని ముస్లింలు విచారంతో మునిగిపోయారు."**

విభజన ఎంత తెలివి తక్కువ చర్యో గ్రహిస్తారు".

ఆ విధమైన వైఖరి ఉన్న వ్యక్తి, జనసంఘ్‌ను కంట్రోల్‌లో ఉంచడానికి, ఆర్.ఎస్.ఎస్.కు ఉపయోగపడే కార్యకర్తగా తగినవాడు. 1950లో జవహర్‌లాల్ నెహ్రూ కేబినెట్ నుండి రాజీనామా చేయడానికి ముందు శ్యాంప్రసాద్ ముఖర్జీ, గోల్వాల్కర్ , అతని కార్యకర్తలతో సంభాషణలలో ఉన్నాడు. అప్పుడు ఉపాధ్యాయ ఉత్తరప్రదేశ్ ఆర్‌ఎస్‌ఎస్, శాఖకు ప్రధాన బాధ్యుడుగా ఉన్నాడు. చర్చలలోని అంశాలను 'ఆర్గనైజర్' పత్రికలో తన వ్యాసంలో గోల్వాల్కర్ తెలియపరచినాడు. 'కొత్త పార్టీని స్థాపించడానికి, ఆ బాధ్యతలను మోయడానికి నిస్వార్థంగా పనిచేసే నాతోటి సహచరులలో కొంతమందిని నేను ఎంపిక చేసుకున్నాను" వారిలో ఉపాధ్యాయ ప్రథముడు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ " 'హిందూజాతి' అనే భావన తనకు అంగీకారమే" అని పేర్కొన్నట్లు గోల్వాల్కర్ అంటాడు. మన రాజ్యాంగం 'భారత జాతీయవాదాన్ని' స్పష్టంగా నిర్వచించడంలో విఫలం చెందిందని పేర్కొంటూ, డా.ముఖర్జీ ఈ విధంగా కూడ అంటాడు: "హిందూ జాతికి తన వైభవాన్ని తిరిగి ఇచ్చే ఉద్దేశ్యం, ఆఖరికి ఆధునిక ప్రజాస్వామ్య భావనలో కూడ అసంబద్ధమైనది కాదు. హిందూయేతర వర్గాలకు చెందిన ప్రజలు అధికారాన్ని పొందడం ద్వారా జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడనంత కాలం, ప్రగతిలో దేశాన్ని వెనుకకు నెట్టే కుట్ర పన్ననంత కాలం వారికి పౌరహక్కులు, రాజకీయ, మత, సాంస్కృతిక రంగాలలో సమానస్థాయిని సమకూరుస్తారన్న గ్యారంటీ 'హిందూజాతి' భావనలో ఉన్నది.

"ఈ విధంగా మేము ఒక అంగీకారానికి వచ్చిన పిమ్మట, నేను అంకితమై పనిచేసే సమర్థులైన కార్యకర్తలను ఎంపిక చేసుకున్నాను. ఒక ప్రముఖ అఖిల భారత రాజకీయ పార్టీకి ఒక రూపం ఇచ్చే, పటిష్టమైన పునాదులు వేయ గలిగిన, నిస్వార్థంగా, దృఢ నిశ్చయంతో అంకితమై పనిచేసే కార్యకర్తలను నేను డా. ముఖర్జీకి అప్పజెప్పాను".

జాఫ్రిలాట్ ఫాస్టియన్ సంధి యొక్క పరిణామాలను చాలా సక్రమంగా వివరించాడు. "ఆర్.ఎస్.ఎస్. రాజకీయ సంఘటనలకు ప్రతిస్పందనగా రాజకీయ రంగంలోకి స్వయం సేవకుల ఒత్తిడితో ప్రవేశించింది, కానీ కొన్ని గ్యారంటీలతో; వాస్తవానికి జనసంఘ్ యొక్క విధానాలను కంట్రోల్ చేయడానికే. దాని స్థాపకులలోని రాజకీయవేత్తలే ఆ విధానాలతో విభేదిస్తే, ఆర్.ఎస్.ఎస్. ఆ పార్టీలోని అధికారాన్ని తీసుకోవడానికి సంకోచించదు". 1980లో జనతా పార్టీని వదిలేసి తరువాత, జనసంఘ్‌లోని నిజాయితీపరులే మళ్ళీ పార్టీని పునరుద్ధరించినారు. కానీ అది ద్వేషాన్ని పొందింది. వారు వదిలివేసిన పార్టీ పేరును వారు దొంగిలించారు. దానికి ముందు 'భారతీయ' పదాన్ని చేర్చారు. జనసంఘ్ సిద్ధాంతమే అన్నట్లుగా దానిని విశ్వసించారు. "మేము జనసంఘ్‌ను ఎప్పుడు వదిలేసినాము?" అని దాని మొట్ట మొదటి అధ్యక్షుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అడిగినాడు.

2016లో నరేంద్ర మోడీ & కంపెనీ దీనదయాళ్ ఉపాధ్యాయను పైకెత్తడం ద్వారా వారి నిజ స్వరూపాలను బయటపెట్టుకున్నారు. ముస్లింలు, క్రైస్తవులు, దళితులకు వ్యతిరేకంగా జరిగిన దాడుల పట్ల మోడీ వహించిన మౌనం అతని యొక్క వైఖరిని వెల్లడించింది. 'ద న్యూ యార్క్‌టైమ్స్' కరెస్పాండెంట్ జెరిమీ ఎం. పీటర్స్ డొనాల్డ్ ట్రంప్ లాంటి వ్యక్తికి 'హిందూ జాతీయ వాదులు మద్దతు' ప్రకటించిన విపరీత వైఖరిని వివరించాడు: "ట్రంప్ మాటలు కొన్ని జాతీయంగా ప్రసారం అయి వుండవచ్చు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం వ్యతిరేక భావాలను రగిలించారని కొంతమంది వాదించారు. ఇవి ఏకకాలంలో సంభవించి ఉండవచ్చు. కానీ ఇవి ఖచ్చితంగా ఏకకాలంలో జరిగినవి కావు. ట్రంప్‌కు పెద్ద సంఖ్యలో ఉన్న హిందూ మత మద్దతుదారులు అనేకమంది మోడీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారు".


"హంటర్ కళాశాలలో 'దక్షిణ ఆసియా చరిత్ర' ను బోధించే మను భగవాన్, భారతదేశంలోని హిందూ జాతీయవాద ఉద్యమం, అమెరికాలో ఉన్న దానియొక్క మద్దతుదారులు 'భారతీయ జీవన విధానంలో ఒకప్పుడు పరిశుద్ధంగా, సుగుణాలు కలిగిన పద్ధతి ఇప్పుడు మలిన పడిందన్న' విశ్వాసాన్ని పంచుకున్నారు. 'ముస్లింలు భారతదేశంలోకి ప్రవేశించడానికి ముందే మీరు వెళ్తే, ఈ విదేశీయులు వచ్చి, సమస్యలు సృష్టించడానికి ముందే, సంఘ్ పరివారానికి చరిత్రతో పెద్ద పోరాటం ఉన్నది. ఇది పురాతన, ఊహాజనిత తప్పిదాలతో పోరాడే ప్రయత్నం చేస్తుంది. ఇది, ఇన్ని సంవత్సరాలుగా భారత జాతి నిర్వహించిన, నిర్వహిస్తున్న విషయాల పట్ల ఒక ఆవేశపూరిత ప్రపంచ దృష్టికోణం. కాబట్టి బాలశంకర్ గాంధీని తిరస్కరించి, ఉపాధ్యాయకు ప్రాధాన్యతనిచ్చాడు. 1961లో దీనదయాళ్ ఉపాధ్యాయ ఈ విధంగా పేర్కొన్నాడు: "గాంధీజీపై గౌరవం ఉంచుతూనే, ఆయనను మనందరం 'జాతిపిత' అని పిలవడం ఆపుదాం. మనం జాతీయవాదం యొక్క పురాతన పునాదిని అర్థం చేసుకుంటే, అది 'హిందూ మతం' తప్ప మరొకటి కాదు అని మనకు స్పష్టం అవుతుంది". అతని వారసుడు ఎల్.కె. అద్వానీ దానిని అంగీకరించాడు. 1989 అక్టోబర్ 17న 'ద టైమ్స్ ఆఫ్ ఇండియా' తన సంపాదకీయంలో ఇలా పేర్కొన్నది: "అద్వానీ 'భారత్‌మాత' పై మాట్లాడుతూ మహాత్మాగాంధీని జాతిపితగా అంగీకరించనంత దూరం వెళ్ళాడు".

బి.జె.పి. ఎంతో చురుకుగా 'గాంధేయ సోషలిజం' యొక్క ప్రాథమిక విశ్వాసాలను విడిచిపెట్టి 47 పేజీల నివేదికతో సహచర గ్రూపుచే సిఫారసు చేయబడిన ఉపాధ్యాయ యొక్క 'సమగ్ర మానవతావాదాన్ని' స్వీకరించింది. దీనర్థం జనసంఘ్‌కు తిరిగి వెళ్ళడమా అని అడిగినపుడు, మేము జనసంఘ్ నుండి ఎప్పుడు బయటకు వెళ్ళాం? అని వాజ్‌పేయి బదులు ప్రశ్నించాడు.

సెప్టెంబర్ 25న నరేంద్ర మోడీ కోజి కోడ్‌లో ముస్లింలు 'శుద్ధి' చేసుకోవాలని బెదిరిస్తూ చేసిన ప్రసంగం తన యొక్క బి.జె.పి. యొక్క వాస్తవ రూపాలను బహిర్గతపరిచింది. వారు ఏ విధంగా శుద్ధి చేసుకోవాలో ఆయనసూచించ లేదు. గతంలో జరిగిన వాటిని తలచుకుని ముస్లింలు విచారంతో మునిగిపోయారు.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

# కాషాయ ఉడిపిని తాకిన ఉనా మంటలు



రచయిత
సామాజిక కార్యకర్త

ఆనంద్ టెల్‌టుమ్డే

**చా**లా కాలం తరువాత మొట్ట మొదటి సారిగా దళితులు వారి బ్రతుకుదెరువుకు సంబంధించిన విషయంలో పెద్ద సంఖ్యలో ప్రజలందరిని కదిలించారు. పెద్ద ఎత్తున లేచిన ఉనా ఉద్యమం గుజరాత్‌లోని రాజకీయ వర్గాలను కదిలించి, కర్ణాటకలోని కాషాయమయమైన ఉడిపితో సహా భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించింది.

గుజరాత్‌లో ఒక దళిత కుటుంబాన్ని బహిరంగంగా శిక్షించిన గోరక్షక దళాల చర్యలకు నిరసనగా ప్రజలు నిర్వహించిన దళిత పోరాటం దేశవ్యాప్తంగా దళితుల యొక్క క్రొత్త ఆలోచనలను, భావాలను ఆకర్షించింది. ఈ విధమైన పోరాటం జరగడం ప్రథమం కాదు. ఆవును వధించారన్న అనుమానంతో హర్యానా రాష్ట్రంలో జజ్జర్ దగ్గర దసరా పండుగ రోజున (అక్టోబర్15,2002) అత్యంత భయంకరంగా దళితులను చిత్రహింసలకు గురిచేయడం జరిగింది. పశువుల చర్మాన్ని కార్నాల్‌కు తీసుకొని వెళ్తున్న ఐదుగురు దళితులను దులీనా పోలీస్ చౌక్ దగ్గరలో హిందూత్వవాదుల గుంపు ఒకటి పట్టుకొని అత్యంత క్రూరంగా వారిని గాయపరచి, వారి కళ్ళను పీకివేసి, చంపి నిప్పంటించారు. గత సంవత్సరం మన దేశంలో అధికారిక లెక్కల ప్రకారం దళితులకు వ్యతిరేకంగా 47వేల దుర్మార్గాలు, నేరాలు నమోదు చేయబడినాయి. ఆ లెక్క ప్రకారం ప్రతిరోజు ఇద్దరు దళితులు హత్యకు గురవుతూ, ఐదుగురు దళిత మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారు. ఉనా నిరసనల వలన వచ్చిన తేడా ఏమంటే, దళితులను దుర్మార్గమైన వృత్తులైనటువంటి సఫాయి పనులు, చనిపోయిన జంతువులకు సంబంధించిన పని నుండి విముక్తిచేసి, భూమిని పంచాలన్న డిమాండ్ తెరపైకి తేవడం జరిగింది. మరొక తేడా ఏమంటే ఈ ఉద్యమం కొన్ని సంవత్సరాలుగా నరేంద్రమోడీచే అభివృద్ధికి నమూనాగా చెప్పబడుతున్న గుజరాత్ రాష్ట్రంలో జరిగింది. ఈ ప్రచారమే నరేంద్రమోడీని అభివృద్ధిచేసే వ్యక్తిగా తన ప్రతిష్టను పెద్ద ఎత్తున పెంచింది. అదే మోడీని ఉన్నతమైన స్థానంలో ఉంచింది. ఉనా ఉద్యమం ఈ అబద్ధాన్ని ప్రపంచానికి చూపింది.

మొట్టమొదటి ఉనా ప్రభావిత దళిత ఉద్యమం అనుకోకుండా కర్ణాటకలో ప్రారంభమైంది. ఉనా ఉద్యమంపై జరిగిన చర్చలన్నీ సోషల్ మీడియాలో ప్రచారమై, ఏ విధంగాను సన్నాహకాలు లేకుండానే బెంగుళూరులో ఒక సమావేశానికి దారితీసింది. 300 మంది యువకులు ఆ సమావేశానికి హాజరయ్యారు. హిందూత్వ శక్తుల గుహలలో ఒకటైన ఉడిపి వరకు (బెంగుళూరు నుండి) ‘ఛలో ఉనా’ కార్యక్రమాన్ని నిర్వహించాలని వారు నిర్ణయించారు. ప్రవీణ్ పూజారి అనే వెనుకబడిన కులానికి చెందిన యువకుడు రెండు ఆవులను రవాణా చేస్తున్నాడని 18 మంది విశ్వ హిందూపరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు (హిందూ జాగరణ వేదికముసుగులో) 2016 ఆగస్టులో కొట్టి చంపినారు. విచిత్రమేమంటే ఆ 29 సంవత్సరాల పూజారి బి.జె.పి. సభ్యుడు. అతడు రెండు ఆవు దూడలను తన స్నేహితుని కొరకు రవాణా చేయిస్తున్నానని వారిని వేడుకుంటాడు. సంఘపరివారం యొక్క గోరక్షణ దళాల హింసాకాండలో అతడు హతుడయ్యాడు.

రెండు దశాబ్దాలకు పైగా హిందూత్వ వాదుల యొక్క గుర్తించబడిన ప్రయోగశాలగా ఉన్నటువంటి గుజరాత్‌తో కర్ణాటక పోటీపడుతున్నది. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం ముస్లింల ఆస్తులు తమవంటూ హిందూత్వ శక్తులు దాడులు ప్రారంభించారు. హుబ్లీ ఈద్గా మైదాన్ యొక్క యాజమాన్యానికి సంబంధించిన తగాదా కోర్టులో ఉన్న విషయం తెలిసి కూడ ఆగస్ట్ 15, 1994న ఉమాభారతి దానిలో జాతీయ జెండాను ఎగురవేసింది. 1998లో చిక్‌మగళూర్ పర్వతాలలో ఉన్న బాబా బుడాన్ గిరి దర్గాను ఎంచుకున్నారు. అది ప్రసిద్ధి చెందిన పురాతన కాలం నాటి ‘సూఫీ’ పుణ్యక్షేత్రం. అది విచిత్రంగా శైవ, వైష్ణవ మరియు సూఫీ విశ్వాసాల కలయికతో కూడుకున్న పూజ్యస్థలం. కొన్ని లక్షల హిందూ, ముస్లింలు ఆ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటారు. కొన్ని శతాబ్దాలుగా ఆ పుణ్యక్షేత్రం వారసత్వంగా వస్తున్న ఒక ముస్లిం కుటుంబం యొక్క యాజమాన్యంలో ఉంటూ వస్తున్నది. బీజాపూర్‌లోని ఆదిల్‌షా పాలనా కాలంలో ఆ పుణ్యక్షేత్రం ‘సయ్యద్ షా తనాలుద్దీన్ ఆలమ్‌గంచి’ యాజమాన్యంలోనే ఉండాలని నిర్ణయం జరిగింది. దీని యొక్క యాజమాన్యంపై ఉన్న తగాదా1960వ దశకం మధ్యలో ప్రారంభమైంది. (ఆ సమయంలోనే కర్ణాటక వక్ఫ్‌బోర్డు దాని యొక్క కస్టడీని గుర్తించిన సందర్భంలో).

ఎన్నిసార్లు కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేసినాగాని ఆ పుణ్యక్షేత్రం యొక్క సంరక్షణ యాజమాన్యంలో మార్పులేదు. 1990 నుండి హిందువులు, మూడు రోజుల కార్యక్రమంగా బ్రాహ్మణులచే నిర్వహింపబడుతున్న పూజా కార్యక్రమాలు నిర్వహణలో దత్తాత్రేయ జయంతిని జరపడం ప్రారంభించారు. ఆ తరువాత సంవత్సరంలో భజరంగదళ్ మరియు విశ్వ హిందూపరిషత్ బాబా బుడన్‌గిరి వద్ద (డిసెంబర్ 1, 1998) కర్ణాటక రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు వెళ్ళే విధంగా అయిదు రథ యాత్రలను నిర్వహించారు. వామపక్ష మరియు దళిత కార్యకర్తలు లాంటి లౌకిక శక్తులు ‘కర్ణాటక కొము సౌహార్ద్ర వేదిక’ పేరుతో మరొక కార్యక్రమంతో వారిని ఎదుర్కొన్నారు. ఆ పుణ్యక్షేత్రం వద్ద రథయాత్రీకులు కాషాయ జెండాలను పెట్టి, దర్గాలో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించే ప్రయ

> “వారు (హిందూత్వవాదులు) కావాలని భారతదేశ వ్యతిరేక, హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడినారు. సిందగిలో టిప్పు సుల్తాన్ సర్కిల్ వద్ద పాకిస్తాన్ జెండాలను ఆవిష్కరించడం, వివేకానందుని విగ్రహాన్ని కూల్చడం, దేవాలయాలను కూల్చడం ద్వారా ముస్లింల పట్ల వ్యతి రేకతను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.”



ఉడిపిలో దళితుల ప్రదర్శన

త్నం చేశారు. కానీ అది పోలీసుల జోక్యంతో నిలుపుదల చేయబడింది. ఈ తగాదా ఫలితంగా బి.జె.పి. రాజకీయంగా లబ్ధి పొందింది. ఫలితంగా 2008లో అధికారంలోకి రాగలిగింది.

బి.జె.పి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొద్ది నెలలోనే ఒక పథకం ప్రకారం బజరంగదళ్ కార్యకర్తలు చర్చిలపై దాడులు చేశారు. హిందూ ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తున్నారని యువతీ యువకులపై దాడిచేసే మితవాద కార్యకర్తల పహరాలు పెరిగిపోయాయి. శ్రీరామసేన, హిందూ జాగరణవేదిక, హిందూ జన జాగృతి సమితి, సనాతన సంస్థల లాంటి అనేక సంస్థలచే హింసాయుత సంఘటనలు అనేకం జరిగాయి. వారు బాంబులను ప్రయోగించారు. (హుబ్లీ కోర్టు ఆవరణలో మే, 2008) మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి మందుగుండు సామాగ్రితో కూడుకున్న ఆయుధాలను ఉపయోగించి, అల్లర్లు జరిగే విధంగా రెచ్చగొట్టే చర్యలు చేపట్టారు. 2012లో ఉడిపికి సమీపంలో బ్రహ్మావార్ వద్ద హిందూత్వ కార్యకర్త ఒక కారులో తెస్తున్న పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. వారు (హిందూత్వవాదులు) కావాలని భారతదేశ వ్యతిరేక, హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడినారు. సిందగిలో టిప్పు సుల్తాన్ సర్కిల్ వద్ద పాకిస్తాన్ జెండాలను ఆవిష్కరించడం, వివేకానందుని విగ్రహాన్ని కూల్చడం, దేవాలయాలను కూల్చడం ద్వారా ముస్లింల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.

**నీలంగా మారిన కాషాయ ఉడిపి**

అక్టోబర్ 4, 2016న దళితులను, మైనార్టీలను, వామపక్ష కార్యకర్తలందరినీ ఐక్యం చేసిన 'ఛలో ఉడిపి' ర్యాలీ బెంగుళూరులోని ఫ్రీడం పార్క్ నుండి ఉడిపి వరకు ఐదు రోజులపాటు నేల మంగళ, కునిగల్, చెన్నరాయపట్న, హస్సన్, బేలూరు మరియు చిక్‌మగళూర్‌లలో హిందూత్వ శక్తుల ఫాసిస్టు హింసాత్మక దాడులకు నిరసనగా కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ యాత్రను నిర్వహించారు. అక్టోబర్ 9న ఉడిపికి చేరిన రోజు ఆ యాత్రకు తుఫాను, వర్షం స్వాగతం పలికాయి. మధ్యాహ్నానికి వర్షం ఆగిపోవడంతో ప్రజలంతా ప్లేకార్డులు మరియు బ్యానర్లు చేతబూని నెమ్మదిగా అజ్జర్‌కడ్ మైదానంలో నిండిపోయారు. 'ఛలో ఉడిపి' అని రాసివున్న ఒక చిన్న బ్యానర్‌తో ఏర్పాటు చేయబడిన వేదిక తడిసి కొద్ది సమయంలోనే అనుకూలంగా తయారైంది. మీటింగ్ ప్రారంభమైన సమయానికి 10 వేల మందితో కాషాయ ఉడిపి నీలం జెండాలతో నిండిపోయింది. గుజరాత్ లో పోరాటాలు చేసిన దళితులకు మరియు సెప్టెంబర్ 18–28 మధ్య కాలంలో రాజస్థాన్‌లో దళిత మహిళల చేత నిర్వహించబడిన 'దళిత మహిళా స్వాభిమాన్ యాత్ర' లకు ఈ ర్యాలీ సంఘీభావాన్ని ప్రకటిం చింది. 10 మంది సభ్యులున్న కమిటీలో 3గా మహిళలు మైనార్టీ సంఖ్యలో ఉన్నప్పటికీ, ఈ నిరసన కార్యక్రమంలో మహిళల ఆధిపత్యమే కనిపించింది.

ఈ మీటింగ్‌కు 'ఉనా' పోరాటానికి నాయకత్వం వహించిన జిగ్నేష్ మేవానీ హాజరైనాడు. ఆయన గుజరాత్ తరహా అభివృద్ధి యొక్క డొల్లతనాన్ని బహిర్గతం చేశాడు. 2002లో గుజరాత్ లో జరిగిన అల్లర్లలో అరెస్ట్ చేయబడిన, క్షతగాత్రులైన ముస్లింలు, ఇతరులలో దళితులు అత్యంత ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నాడు. ఈ ఉపన్యాసాలలో “మా తిండి మా ఇష్టం, భూమి మా హక్కు” అనే నినాదాలు మార్మోగినాయి. మూడు డిమాండ్లతో ఉడిపి తిరిగి వస్తానని జిగ్నేష్ మేవానీ మాట యిచ్చాడు. అవి: 1) గోరక్షక దళాలను రద్దు చేయాలని 2) 1969 రాష్ట్ర భూ పంపిణీ నియమాల ప్రకారం ఇప్పటివరకు కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఎంతమంది దళితులకు, గిరిజనులకు రెవెన్యూ భూమిని ఇచ్చిందో అడగాలని 3) దళితులకు వ్యతిరేకంగా పంక్తిభేద పద్దతిని అమలు జరుపుతున్న ఉడిపిలోని మఠాలలో ప్రవేశించాలని.

ర్యాలీ అనంతరం, ఎటూ దిక్కుతోచని హిందూత్వ శక్తులు యువ బ్రిగేడ్ (అంతకు పూర్వం నమో బ్రిగేడ్) నరేంద్ర మోడీ పేరుతో అక్టోబర్ 23న పర్యాయ పెజావర మఠానికి చెందిన విశ్వేషతీర్థస్వామి యొక్క పరోక్ష మద్దతుతో ఒక 'శుద్ధి' కార్యక్రమాన్ని నిర్వహించడానికి నిర్ణయించింది. “మీరు కాల్చాలనుకుంటే, ముందుగా నన్ను కాల్చండి కానీ నా దళిత సోదరులను కాదు' అని నరేంద్ర మోడీ నోట పలికించింది ఉనా దళిత ఉద్యమం. దేవాలయంలోకి ప్రవేశించకుండా అడ్డుకోబడిన శూద్రముని 'కనక' పేరుకు గుర్తుగా 'కనక నేడే' తన కొరకు గుడి గోడకు ఒక కిటికీ ఏర్పాటు చేయమని కృష్ణ భగవానుని ఒత్తిడి చేశాడు. దళితులతో సహ అందరు ప్రజలు శుద్ధికి సంబంధించిన కర్మకాండలు చేస్తారని వారు పేర్కొంటారు. ఇక్కడున్న వైరుధ్యం ఏమంటే: ఒకవైపు వారు ఈ ర్యాలీని వామపక్ష ర్యాలీగా ఆరోపించారు. మరొకవైపు వారు 'శుద్ధి' కార్య క్రమాన్ని

నిర్వహించారు. 'దళిత– దమనితార స్వాభిమాన పోరాట సమితి' అనే ఛలో ఉడిపి కార్యక్రమ నిర్వాహకులు శుద్ధి కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే నిర్ణయం చేసిన ఫలితంగా ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల కారణంగా పోలీసులు అనుమతిని రద్దుచేసి జరుగబోయే ప్రమాదకర పరిణామాలను అడ్డుకున్నారు. కానీ అక్టోబర్ 9 మఠం పరిసర ప్రాంతాలలో శుద్ధి కార్యక్రమం యువ బ్రిగేడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. యువ బ్రిగేడ్‌కు వ్యతిరేకంగాసమితి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**దళిత రాజకీయాలలో సంభవించిన పెద్ద మార్పు**

ఉనా పోరాటంతో దళిత ఉద్యమంలో ఒకమంచి మార్పు సంభవించింది. బాబా సాహెబ్ అంబేద్కర్ యొక్క ప్రభావంతో 1953–65 కాలంలో భూమి కొరకు మూడు సత్యాగ్రహాలు జరిగినపుడు దళితులు వారి బ్రతుకుదెరువుకు సంబంధించిన సమస్యలను లేవనెత్తారు. తాను చేసిన కృషి కొద్ది భాగంగా ఉన్న విద్యావంతులైన దళితులకు మాత్రమే లాభించిందని, కానీ ఎక్కువ సంఖ్యలో వున్న గ్రామీణ దళితులకు ఏమీ చేయలేకపోయానని అంబేద్కర్ తన జీవిత చరమాంకంలో పేర్కొనే వాడు. మొదటి రెండు సత్యాగ్రహాలు 1953 మరియు 1959లో మహారాష్ట్రలో జరిగాయి. చివరి సత్యాగ్రహంలో దేశవ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా వందల, వేల సంఖ్యలో ప్రజలు, మహిళలు, పిల్లలు అరెస్టయి, కోర్టులకు (నెలకుపైన) పంపించబడినారు. ఆ సత్యాగ్రహం పాలకవర్గాలలో దడ పుట్టించింది. దళితులలో అవకాశవాదులకు కొన్ని అవకాశాలు కల్పించి కో–ఆప్షన్ ఎత్తుగడతో కాంగ్రెస్ పార్టీ ప్రతి స్పందించింది. దాని ఫలితంగా దళిత ఉద్యమం బలహీనపడింది.

తమ యొక్క కోపాన్ని ప్రదర్శించటానికి, దిగజారిపోయిన దళిత నాయకత్వాన్ని ఏకాకులను చేయడానికి ఇటీవల కాలంలో దళితులు నాయకులు లేకుండానే వీధులలోకి వస్తున్నారు. 1997లో రమాబాయినగర్, ముంబై కైర్లాంజీలో 10 మంది అమాయక ప్రజలను తుపాకులతో కాల్చి చంపిన ఘటనకు ప్రతిస్పందించిన తీరు ఈ విషయాన్ని విశదపరుస్తుంది. కానీ వారి కొరకు వారు దీర్ఘకాలిక మార్గదర్శకత్వాలను తయారు చేసుకొనలేకపోయారు. మొట్టమొదటి సారిగా ఉనా పోరాటం దానిని సాధించింది. ఆ పోరాటం వారి బాధను, బలహీనతను బలంగా మార్చగలిగింది. వారందరూ మూకుమ్మడిగా, కులపరంగా చేసే సఫాయిపని, చనిపోయిన జంతువుల చర్మాలను తీసే పనుల లాంటి వాటిని చేయబోమని తీర్మా నించుకున్నారు. వారు ఆ పనులు చేయడానికి బదులుగా ప్రభుత్వం వారికి భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అది మోడీ కోటను వణికించింది. పంచడానికి అనువైన భూముల లెక్కలు తీయాలని రాష్ట్ర పాలకులపై ఒత్తిడి చేసింది. ఉనా పోరాటం ఉడిపి ర్యాలీకి ప్రేరణగా నిలిచింది. అత్యధిక జనాభాకు ఉద్యోగ సంక్షోభాలను మరియు గొడ్డు మాంసం నిషేధాన్ని సృష్టించిన ప్రభుత్వాలను సవాల్ చేస్తూ, 'మా తిండి మా యిష్టం' అనే నినాదం తీసుకునే విధంగా ఊతం ఇచ్చింది. దేశంలో విశాల ప్రాతిపదికన ఏర్పడే ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనే శక్తి సామర్థ్యాలు వారికి ఉన్నాయి. అలాంటి ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాలకు దేశంలోని ప్రగతిశీల శక్తులు మద్దతు ప్రకటించాలి.

> **"మొట్టమొదటి సారిగా ఉనా పోరాటం దానిని సాధించింది. ఆ పోరాటం వారి బాధను, బలహీనతను బలంగా మార్చగలిగింది. వారందరూ మూకుమ్మడిగా, కులపరంగా చేసే సఫాయిపని, చనిపోయిన జంతువుల చర్మాలను తీసే పనుల లాంటి వాటిని చేయబోమని తీర్మా నించుకున్నారు."**

**అనువాదం: బోడపట్ల రవీందర్**

# ఉమ్మడి పౌరస్మృతిపై సంఘ్ పరివార్ కపటనాటకం

(10వ పేజీ తరువాయి)

సమాన అవకాశాల కోసం చట్టాలు రూపొందించాలి. సచార్ కమిటీ సమాన అవకాశాలు కల్పించటం కోసం కమీషన్‌ను ఏర్పాటు చేయ మని సూచించినప్పటికీ ఎందుకు దానిని అమలు చేయలేదు? రంగనాధ్ మిశ్రా కమీషన్ నివేదిక ముస్లింలకు రిజర్వేషన్స్ ఇవ్వాలని కోరింది. కాని ముస్లిం సమూహంలోని సామాజిక, ఆర్థిక వెనుకబాటు ఆధారంగా కూడా రిజర్వేషన్‌లను వర్తింపచేయలేదు.

ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. ఏకీకృత భావన ప్రత్యేకమైనది. వివిధ సమూహాల మధ్య కాని, ఒకే సమూహంలో కాని సమానత్వంతో సంబం ధం లేని ప్రత్యేక ఏకీకృత అంశాన్ని రుద్దాలని ప్రయత్నం చేస్తుంది. ఏకీకృతాన్ని సమానత్వంతో గందరగోళ పరచకూడదు. ఏకీకృతం ఖచ్చితంగా సమానత్వాన్ని ఇస్తుందనే నమ్మకం లేదు.

భారతదేశంలోని ఇలాంటి నిర్దిష్ట పరిస్థితు లలో అన్ని సమూహాల యొక్క స్త్రీలకు సమాన హక్కులు ఎలా సాధించాలి? పర్సనల్ చట్టాలను సంస్కరించటమే సరైన మార్గం. అయితే చారిత్ర కంగా ఇది అత్యంత వివాదాస్పదమైన అంశం. స్త్రీలను అణచి వేయటం, కుటుంబంలో అదు పాజ్ఞలలో ఉంచడం అంతిమ లక్ష్యం. ఇటీవల కేంద్ర మంత్రి "మారిటల్ రేప్"కు వ్యతిరేకంగా చట్టం చేయాలనే డిమాండ్ భారతీయ సంస్కృతికి వ్యతిరేకమైనది అని చెప్పారు. ఈ చర్య పర్సనల్ చట్టాల పరిధిలోకి రాదు. క్రిమినల్ చట్టం పరిధిలోకి వస్తుంది. అయితే కుటుంబంలో పురు షుల హక్కులు ఎంత పవిత్రమైనవిగా పరి గణింపబడుతున్నాయో గమనించటానికి ఇది ఒక ఉదాహరణ. తిరోగమన శక్తులు పై చేయి సాధించిన సందర్భంలో ఉమ్మడి పౌరస్మృతి పేరుతో చట్టాన్ని తీసుకురావడం మహిళల హక్కులకు గొడ్డలిపెట్టు.

**అనువాదం: పి అనంతలక్ష్మి**

# ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని పటిష్టం చేయడానికే నోట్ల రద్దు

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

కామ్రేడ్ రాఘవులుగారికి...

**ఉరీలో సరిహద్దు జవాన్లు నిద్రలో ఉండగా పాకిస్తాన్ స్థావరాల నుండి ఉగ్రవాదులు అర్ధరాత్రి దాడిచేసి 20 మంది మన వీర జవాన్ల ప్రాణాలు తీసిన దారుణ సంఘటన భారత ప్రజాస్వామ్యాన్ని బాధించిన సంఘటన. ఈ దారుణం మన వేగుల వాళ్ళ లోపం కాదా? సరియైన కాపలాయే ఉంటే సరిహద్దు రేఖ దాటి నిద్రిస్తున్న స్థావరంపై దాడి, ఈ దారుణ సంఘటన జరిగేదా? సంఘటనకు ప్రతీకారంగా సర్జికల్ దాడులు చేసి పాకిస్తాన్‌ని హతమార్చి నట్లు మన కేంద్రంలోని ప్రభుత్వ ప్రకటన చేయగా, పాకిస్తాన్ కొట్టిపారేసి దాడులు జరగలేదని ప్రకటించింది. ఇందులో నిజ నిజాలు ఏమిటి? ఇరువైపుల ప్రజలు ఉద్రిక్త ప్రకటనలతో యుద్ధం అనివార్యం అనిపించేం తగా వాతావరణం తయారైంది. రెండు దేశాల లోనూ అణు బాంబులున్నవి. ఆవేశం హద్దులు దాటితే అణుబాంబు ప్రయోగంతో ఇరుదేశ ప్రజలను, భూభాగాలను దగ్ధం చేయటమేకదా! యుద్ధంతో లాభం ఎవరికి? సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోలేరా? మీ అభిప్రాయాలు తెలుపమనవి?**

ఉరీ సరిహద్దులో ఉగ్రవాదులు మన సైనిక స్థావరంపై దొంగతనంగా ప్రవేశించి చేసిన దాడిలో అనేక మంది జవాన్లు ప్రాణాలు కోల్పో యారు. ఇది అత్యంత దారుణమైన, కిరాతకమైన చర్య. ఈ చర్యను యావత్ ప్రపంచం ఖండిం చింది. అంత మేరకు ఉగ్రవాదులకు వత్తాసుని స్తున్న పాకిస్థాన్ సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితుల్లో పడింది.

ఈ సంఘటనకు ప్రతీకారంగా మన బలగా లు సర్జికల్ దాడులు నిర్వహించి పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చింది. కేంద్ర ప్రభుత్వం చెప్పిన విషయం వాస్తవం అవునా, కాదా అన్న మిమాంసను కొంతమంది లేవనెత్తినప్పటికీ అది ముఖ్యమైన అంశంకాదు. మనం నిర్వహించిన సర్జికల్ దాడులు ఉగ్రవాదులను అరికట్టగలుగుతుందా, లేదా అనేది ముఖ్యమైన సమస్య. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి ప్రతీకార చర్య మాత్రమే సరిపో దని, నవంబర్ 30న జమ్ములోని నగ్రోటలోని సైనిక శిబిరంపై ఆత్మాహుతి దాడి జరిపి సైనిక అధికారులను, భద్రతా సిబ్బందిని పొట్టన పెట్టుకోవడం స్పష్టం చేస్తున్నది. జమ్మూకాశ్మీర్‌లో ప్రజల మద్దతును కూడగట్టుకునేందుకు అవసరమైన రాజకీయ, ఆర్థిక పరమైన చర్యలు తీసుకోకుండా, అలాగే ఎటువంటి ఉగ్రవాద చర్యలైనా తట్టుకోగలిగేటట్లు జాగ్రత్తలు తీసు కోకుండా ఉగ్రవాదాన్ని రూపుమాపడం సాధ్యంకాదు. బిజెపీ కేంద్ర ప్రభుత్వం అటువంటి సమగ్రమైన చర్యలకు పూనుకోకపోవడం శోచనీ యం. ఉగ్రవాదాన్ని అరికట్టడం కన్నా ఆ చర్యలను మతోన్మాదాన్ని ప్రేరేపించి ఎన్నికల్లో రాజకీయలబ్ధి పొందాలన్న ఉద్దేశ్యమే ప్రధానంగా బిజెపీ సంఘ్‌పరివార్ శక్తుల్లో కనపడుతున్నది.

బిజెపి సంఘ్‌పరివార్ శక్తుల దురహంకార జాతీయవాదంలో యుద్ధోన్మాదం అంతర్భాగం. కానీ యుద్ధం ఏ సమస్యనూ శాశ్వతంగా పరిష్కరించదని గత అనుభవాలు రుజువు చేస్తున్నాయి. అందుకే కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఉగ్రవాద దాడులను గట్టిగా తిప్పికొడు తూనే చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించు కోవాలన్న ఆలోచనతోనే వ్యవహరించాయి. గతంలో బిజెపి నాయకత్వాన నడిచిన వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఇటువంటి వైఖరినే ఎక్కువ సందర్భాల్లో ప్రదర్శించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వంలోని రక్షణ శాఖా మంత్రి పరీకర్ గతం నుంచి అణ్వాయుధాలను మొదట ప్రయో గించం అన్న విధానాన్ని పునఃపరిశీలిస్తామని ప్రకటించారు. దేశం నలుమూలల నుండి అన్ని రాజకీయ పక్షాల నుండి తీవ్రమైన విమర్శలు రావడంతో అది ఆయన వ్యక్తిగత అభిప్రాయమని ప్రభుత్వ ప్రతినిధులు ప్రకటించాల్సి వచ్చింది. ఏమైనా దుందుడుకు చర్యలకు పాల్పడితే ప్రపంచంలో ఇప్పటి వరకు భారతదేశానికి ఉ న్న పేరు ప్రతిష్టలు దెబ్బతింటాయి. అణ్వా యుధాలు ఎవరు ముందు ప్రయోగించినా వినాశనం తప్పదు. దాడి జరిగినప్పుడు ప్రతి ఘటించడం వేరు, దాడికి కాలుదువ్వడం వేరు. ఈ రెంటికీ వ్యత్యాసం లేకుండా బిజెపీ ప్రభు త్వం వ్యవహరిస్తే దేశానికి రాజకీయంగానూ, దౌత్యపరంగానూ తీవ్రమైన నష్టం జరుగుతుంది. అటువంటి దుస్సాహసానికి బిజెపి ప్రభుత్వం పాల్పడకుండా ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తమై ఉండాల్సి ఉంటుంది.

**ప్రశ్న :- 8.11.2016 అర్ధరాత్రి రూ.500, 1000ల నోట్ల రద్దు ప్రకటన ఆబాల గోపాలాన్ని అబ్బుర పరచింది. బ్యాంకుల వద్ద పాతనోట్ల మార్పిడి కోసం క్యూలో నిలబడలేక సుమారు అరవైమంది వృద్ధులు, హృద్రోగులు మరణిం చారు. 90 శాతం పేదలు, 70 శాతం జనానికి బ్యాంకుల్లో ఖాతాలు లేక కూలి నాలి చేసి కూడబెట్టుకొన్న పెద్ద నోట్ల మార్పిడి ప్రజలమీద పిడుగుపాటైంది. ఆరు నెలలనుంచే రూ.2000ల నోట్ల ప్రచురణ జరిగిందని ప్రధానే చెప్పారు. ఈ ఆరు నెలల్లో తన పార్టీ వాళ్ళు, పారిశ్రామిక పెద్దలు తమ నల్ల డబ్బు తెలుపు చేసుకోవడాని కేనని, పంజాబు, ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో తన గెలుపుకు ఇది నాందియేనని జనవాక్యం. బిజెపి అనుయాయులు కొందరు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు మోడీజీ ప్రకటనను హర్షించడంలో గుట్టు ఏమిటిటో తెలుపగలరని మనవి చేయుచున్నాను.**

**– రామిశెట్టి రోశయ్య,** మధిర, ఖమ్మంజిల్లా

2) రు.500, రు.1000 నోట్ల రద్దు దేశ వ్యాపితంగా అన్ని తరగతుల ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేసింది. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు అనేక చర్యలు చేపట్టామని పాలకులు చెబుతున్నా ఇప్పుడిప్పుడే ప్రజల ఇబ్బందులు తొలిగే పరిస్థితులు లేవు. అందుకే అన్ని పక్షాలు కనీసం డిసెంబర్ 30 వరకైనా ప్రజలకు రోజువారీ అవసరాల కోసం పాత నోట్లను వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాయి. కానీ ప్రభుత్వం ఈ చిన్న రాయితీని కూడా అంగీకరించడానికి నిరాకరిస్తున్నది.

దేశంలోని నల్లడబ్బును నిర్మూలించడానికే నోట్ల రద్దు చేపట్టామని, దానిని వ్యతిరేకించే వారందరూ నల్లడబ్బును రక్షించేవారని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం, బిజెపీ, సంఘ్‌పరివార్ శక్తులు సర్వశక్తులొడ్డి ప్రచా

(మిగతా 35వ పేజీలో)

## కమ్యూనిస్టు యోధుడు ఫైడల్‌కాస్ట్రో

(2వ పేజీ తరువాయి)

చివరిలో కాస్ట్రో పిలుపుతో ప్రజలు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. 1959, జనవరి 1న బాటిస్టా క్యూబా వదలి పారిపోయాడు. విజయ సారథిగా కాస్ట్రో 1959, జనవరి 8న హవానా లో అడుగుపెట్టాడు. 1959, ఫిబ్రవరి 10న క్యూబా ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరిం చాడు. 1978 డిసెంబరు వరకు ఆ పదవిలో కొన సాగాడు. 1978లోనే దేశాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించి, 2008 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగాడు. 1961 నుండి 2011 వరకు క్యూబా కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కార్యదర్శిగా పనిచేశాడు.

అధికారానికి వచ్చిన తర్వాత భూస్వామ్య విధానాన్ని రద్దుచేశారు. ఒక కుటుంబం కలిగివుండే భూమిని 993 ఎకరాలకు పరిమి తం చేశారు. దానితో రెండు లక్షల కుటుంబా లకు భూమిని పంచారు. జడ్జీలు, రాజకీయ నాయకుల వేతనాలను తగ్గించి, కార్మికుల వేతనాలను పెంచారు. నెలకు 100 డాలర్ల కన్నా తక్కువ వచ్చేవారికి ఇంటి అద్దెను సగానికి తగ్గించారు. అన్నిరంగాలలోనూ ఉత్పత్తిని పెంచటం కోసం చర్యలు తీసుకున్నారు.

**అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలు**

తన పెరటి దొడ్డిలాంటి క్యూబాలో అధి కారంలోకి వచ్చిన ప్రభుత్వం తనను ధిక్కరించి వ్యవహ రించటాన్ని సహించలేని అమెరికా ప్రభుత్వం కాస్ట్రో ప్రభుత్వాన్ని కూలద్రోయటం కోసం అనేక కుట్రలకు పాల్పడింది. క్యూబాపైన వివిధ రకాలైన ఆంక్షలను విధించింది. ఆ దేశం నుండి పంచ దారను, ఇతర ఉత్పత్తులను కొనటం, వారికి కావలసిన ఆయిలు, ఆహారం ఇతర సరుకుల సరఫరాపై ఆంక్షలు విధించింది. ఆనాడు ప్రపం చంలో ప్రధానశక్తిగా ఉన్న సోవియట్ యూనియన్ సహాయంతో క్యూబా ఈ ఆంక్షలన్నింటినీ అధిగమిం చింది.

1960లో అమెరికా అధ్యక్షునిగా ఉన్న ఐసెన్‌హోవర్ క్యూబా ప్రభుత్వాన్ని కూలద్రోయ మని సిఐఎను ఆదేశించాడు. ప్రభుత్వాన్ని కూల్చటం కోసం క్యూబాలోని అరాచకశక్తులను పోగుచేసి, వారికి అన్ని విధాలైన సహకారాన్ని అందించింది. తిరుగుబాటుదారులను కూడగట్టి, 1961లో క్యూబాపై (బే ఆఫ్ పిగ్స్) దాడి చేసింది. ప్రజా పోరాటదళాల సహాయంతో క్యూబా సైన్యం ఈదాడిని తిప్పికొట్టింది. ఆనాటి నుండి నేటివరకు క్యూబాపై దిగ్బంధాన్ని అమెరికా కొనసాగిస్తూనే ఉన్నది. కాస్ట్రోను హత్యచేయటానికి సిఐఎ అనేక పన్నాగాలు పన్నింది. కాస్ట్రో తినే ఆహారంలో, ధరించే బట్టలలో, ఆయన తాగే సిగార్లలో విషం పెట్టి చంపటానికి 600 సార్లకు పైగా ప్రయత్నం చేసింది. అన్ని ప్రయత్నాలను కాస్ట్రో విజయవంతంగా తిప్పికొట్టి, 90 సంవత్సరాల నిండు జీవితాన్ని గడిపాడు.

**ప్రపంచంలోని అభ్యుదయశక్తులకు కొండంత అండ**

కాస్ట్రో నాయకత్వంలోని క్యూబా ప్రభుత్వం ప్రపంచంలోని వామపక్ష, అభ్యుదయశక్తులకు అండగా ఉన్నది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమె రికా దేశాలలో అభ్యుదయశక్తులు, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఆయా దేశాలలోని ప్రభుత్వాలు, ప్రజలు చేస్తున్న పోరాటాలకు సంపూర్ణ సహకారం అందించింది. కొన్ని దేశాలకు తన సైనికదళాలను కూడా పంపిం చింది. విద్య, ఆరోగ్యరంగాలలో అసమాన విజయాలను సాధించింది. దేశంలో ప్రజలం దరికీ ఉచిత ఆరోగ్యవ్యవస్థను అందిస్తున్న దేశాలలో క్యూబా ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్నది. తనదేశంలోనే కాక ప్రపంచంలోని అనేక పేదదేశాలకు తనదేశ వైద్యసిబ్బందిని పంపి, సేవలందించింది. అనేకదేశాలలో ప్రకృతి వైపరీ త్యాలు సంభవించినపుడు క్యూబా వైద్యసిబ్బంది ఆ దేశాలలోని మారుమూల ప్రాంతాలకు వెళ్ళి వైద్యసేవలను అందించారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే దేశప్రజలందరినీ విద్యావంతులను చేసింది. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

1990వ దశాబ్దం నుండి లాటిన్ అమెరి కాలో అభ్యుదయ, వామపక్ష ఉద్యమాలు ఉ వ్వెత్తున సాగాయి. వెనిజులా, బొలీవియా, బ్రెజిల్ తదితరదేశాలలో వామపక్ష, అభ్యుదయ ప్రభు త్వాలు అధికారంలోకి వచ్చాయి. అటువంటి వారందరినీ కూడా గట్టి అమెరికన్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నిలబెట్టటం కోసం కాస్ట్రో కృషిచేశాడు. ఆ కృషి ఫలితంగా లాటిన్ అమెరికాలో ఆల్బా, మెర్కోసుర్, తదితర సంస్థలు ఆవిర్భవించి, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడ్డాయి.

సరళీకరణ విధానాలు ప్రారంభమైన 1990వ దశాబ్దం నుండి సోషలిస్టు దేశాలలో కూడా అనేక విధాలైన మార్పులు వచ్చాయి. విద్య, వైద్యం, ప్రజలకందించే సేవలపై కొన్ని పరిమితులను విధిస్తున్నాయి. ఎన్ని మార్పులు వచ్చినా సోషలిజం నిర్మాణంలో తనదైన ప్రత్యేక మైన మార్గంలోనే క్యూబా ముందుకు సాగుతున్నది. ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా లక్ష్యానికి అనుగుణంగా ఎలా ముందుకుపోవాలి, శత్రువును ఎలా ఎదుర్కొని ఓడించాలి అనే విషయంలో కాస్ట్రో నాయకత్వం లో క్యూబా చేసిన పోరాటం కమ్యూనిస్టులందరికీ ఆదర్శంగా ఉంటుంది. సామ్రాజ్యవాదం ఉ న్నంతకాలం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నవారికి కాస్ట్రో పేరు ఉత్తేజం కలిగిస్తూనే ఉంటుంది. జోహార్ కామ్రేడ్ ఫైడల్ కాస్ట్రో! ❋

## ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని పటిష్టం చేయడానికే నోట్ల రద్దు

(34వ పేజీ తరువాయి)

రం చేస్తున్నాయి. కొన్ని తరగతుల్లో ముఖ్యంగా మధ్య తరగతిలో ఈ ప్రచార ప్రభావం కొంత ఉ న్నది. కానీ నోట్ల రద్దు నల్లధనాన్ని నిర్మూలించ డానికి ప్రభుత్వం చెబుతున్నట్లుగా పెద్దగా తోడ్పడదని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు. నల్లడబ్బుకు మూలా లు నోట్లల్లో లేదని, దాన్ని నిర్మూలించాలంటే అనేక చర్యలతో కూడిన సమగ్ర వ్యూహం కావా లని అందరూ చెబుతున్నారు. బిజెపీకి గట్టి మద్దతుదారులు అనేక మంది కూడా ఇటువంటి అభిప్రాయా లనే వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం మొండిగానే తన నిర్ణయాన్ని అమలు చేయడానికి పూనుకున్నది.

ప్రజలకు ఇంత తీవ్ర ఇబ్బందులు ఉన్నా నల్లడబ్బు నిర్మూలనకు నోట్ల రద్దు పరిష్కారం కాదని అన్నివైపుల నుండి విమర్శలు వస్తున్నా ఎందుకు బిజెపీ కేంద్ర ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాన్ని పట్టుకుని వేళ్ళాడుతున్నదనేది అనేక మందికి ఉన్న సంశయం. ప్రభుత్వం ఈ నోట్ల రద్దు సరళీకరణ సంస్కరణల అమలుకు చాలా ముఖ్యమైన అవసరంగా భావిస్తున్నందునే అమలు చేస్తున్నది. బలవంతంగానైనా బ్యాంకు లావాదేవీలలోకి దేశ ప్రజలను తేవడం ద్వారా ఆర్థిక వ్యవస్థపై, ప్రజా జీవితంపై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని పటిష్టం చేయడానికి ప్రభుత్వ నిర్ణయం ఉద్దేశించబడింది. అంతర్జాతీయశక్తులను సంతృప్తి పర్చడానికే బిజెపి కేంద్ర ప్రభుత్వం నోట్ల రద్దు నిర్ణయం ద్వారా ప్రయత్నిస్తున్నది. తన నిర్ణయంలోని అంతరార్థాన్ని కప్పిపెట్టుకునేందుకు నల్లడబ్బు నిర్మూలన అని, ఉగ్రవాదుల ఆయువుపట్టు దెబ్బతీయడమని, దేశభక్తి అని ముసుగులు తొడిగి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నది.



# అణుబాంబులు పడ్డా ఎదుర్కోడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు

ఫైడల్ కాస్ట్రో

హార్లేంలోని గౌరవనీయులైన నీగ్రోలను గౌరవించటం, అతిథి సత్కారాలు, వారితో ఉదారంగా, మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తాం. (చప్పట్లు, పాటలు) (ఇంతలో ప్రజల మధ్యలో ఒక బాంబు పేలుతుంది). అదిచిన్న బాంబు. దానికోసం ఎవరు చెల్లించారో ప్రతి ఒక్కరికీ తెలుసు. అది సామ్రాజ్యవాదానికి చెందినది. వారు సామ్రాజ్యవాదాన్ని గురించి మాట్లాడుతున్నట్లుగానే ఆ బాంబుకూడా పోయిందని రేపు మీరు చదువుతారు. (ప్రజలు కొన్ని నిముషాల పాటు చప్పట్లు కొడుతూ ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. ప్రజలను నిశ్శబ్దంగా ఉంచటానికి కొన్ని నిముషాల పాటు సంగీతాన్ని వినిపిస్తారు).

వారెంత అమాయకంగా ఉన్నారు. అమెరికాలో తయారుచేసిన 500, 1,000 పౌండ్ల బాంబులను పేల్చినపుడే వారేమీ సాధించలేకపోయారు. వారు మంటల (నాపాం) బాంబులను పేల్చినప్పటికీ వారి విమానాలు ఏమీచేయలేవు. వారు లంగిపోవాల్సిందే. సియర్రా మయిస్ట్రాను వారు స్వాధీనం చేసుకోలేకపోయారు. ఇపుడు ఈ చిన్న బాంబుల మాటున వారేవిధంగా ముందుకురాగలరు. చిన్నబాంబులనే కాక ఏ పరిణామాలనైనా ఎదుర్కోవటానికి ప్రజలు సిద్ధంగా ఉంటే వారు చిన్నబాంబులతో ప్రజలపై ఏ విధంగా వత్తిడి తీసుకురాగలరు. ఏమి జరిగినా, అణుబాంబులు పడ్డా ఎదుర్కోవటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

సామ్రాజ్యవాదులు వేసే ప్రతి చిన్నబాంబుకు మేం 500 ఇళ్ళు నిర్మిస్తాం. వారు సంవత్సరంలో తయారుచేసే ప్రతి చిన్నబాంబుకు మేము మూడు సహకారసంఘ భవనాలను నిర్మిస్తాం. ప్రతి చిన్నబాంబుకు మేం ఒక అమెరికన్ ఎస్టేట్‌ను జాతీయం చేస్తాం. సామ్రాజ్యవాదుల ప్రతిచిన్నబాంబుకు లక్ష బ్యారెళ్ళ చమురును శుద్ధిచేస్తాం. ప్రతి చిన్నబాంబుకు మేం ఒక ఫ్యాక్టరీని నిర్మించి, మాదేశంలోని వారికి ఉద్యోగాలిస్తాం. సామ్రాజ్యవాదులు ప్రతి చిన్నబాంబుకు చెల్లించే మొత్తంతో మేం ఒక సైనిక కేంద్రాన్ని స్కూలుగా మారుస్తాం. సామ్రాజ్యవాదులు ప్రతి చిన్నబాంబుకు చెల్లించే మొత్తంతో మేం 1,000 మంది పౌరులను సాయుధులను చేస్తాం (చప్పట్లు). ఈ చిన్నబాంబును చుట్టుముట్టటానికి మనం ఒక కార్మికుల దళాన్ని తయారు చేయవచ్చునని కామ్రేడ్ పణి మంచి ఆలోచన చేశాడు (చప్పట్లు).

అతితక్కువ ఆర్థిక వనరులున్న మన చిన్నదేశం మన స్వాతంత్ర్యం, గౌరవం, హక్కుల కోసం ముందుపీఠిన ఉండి పోరాడుతున్నది. సమకాలీన ప్రపంచంలో అత్యంత క్రూరమైన సామ్రాజ్యాన్ని మనం ఎదుర్కొంటున్నామనే చైతన్యం కలిగి ఉండటం అవసరం. విప్లవాన్ని నాశనం చేయటాన్ని, విప్లవాన్ని అడ్డుకోవటాన్ని సామ్రాజ్యవాదం వదులుకోదనే విషయాన్ని కూడా మనం గుర్తించాలి. తిరుగుబాటు చేసిన బానిసలను బానిస యజమానులు అసహ్యించుకున్నంత తీవ్రంగా సామ్రాజ్యవాదం మనలను అసహ్యించుకుంటుందని మన మనసులో ఉండాలి. తిరుగుబాటు చేసిన బానిసలు ఎంత శక్తివంతంగా తమను తాము రక్షించుకున్నారో అంత శక్తివంతంగా మనలను మనం రక్షించుకోవాలి.

(జనం మధ్యలో మరొక బాంబు పేలుతుంది). వాటిని పేలనివ్వండి. ఆ విధంగా వారు అన్ని విధాలైన శబ్దాలకు ప్రజలు అలవాటు పడేలా శిక్షణ ఇస్తున్నారు (చప్పట్లు, ఐక్యత వర్థిల్లాలని నినాదాలు) మనం చెబుతున్న విషయాన్ని ఇవి రుజువు చేస్తున్నాయి. విప్లవం ముందు చాలా కఠినమైన, సుదీర్ఘమైన పోరాటం ఉన్నది.

సామ్రాజ్యవాద శతృవును తక్కువగా అంచనా వేయటం పొరపాటవుతుంది. మనలను తక్కువగా అంచనా వేసే పొరపాటును వారు చేస్తున్నారు. వారెప్పుడూ ఊహించనంతటి విప్లవశక్తి, నైతికశక్తి మనప్రజలలో ఉన్నాయి.

మనం చర్చిస్తున్న విషయాన్ని వివరించటానికి సహకరించినందుకు ఆ చిన్నబాంబులకు ధన్యవాదాలు. మన ప్రజల దృఢమైన వ్యక్తిత్వాన్ని, ధైర్యాన్ని అవి వెల్లడించాయి. ఒక్క పురుషుడు గాని, ఒక్క మహిళగాని తాము కూర్చున్నచోటు నుండి కదలలేదు. ఏదైనా ప్రమాదం, దాడి జరిగే అవకాశం ఉన్నా ఏ ఒక్కరూ తామున్నచోటు నుండి కదలలేదు (మధ్యలో మూడుసార్లు చప్పట్లు). దేశ సైనికులం మనం. మనం మనకు చెందం. మనం మనదేశానికి చెందినవారం (చప్పట్లు). మనలో ఎవరమైనా మరణిస్తామా అన్నది ప్రధానం కాదు. ఈ జెండా సమున్నతంగా ఎగరటం, ఈ సిద్ధాంతం ముందుకుపోవటం, మనదేశం చిరంజీవిగా ఉండటం ప్రధానం (చప్పట్లు)

**(విప్లవ సంరక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేయటానికి 1960, సెప్టెంబరు 29న హవానాలో జరిగిన సభలో కాస్ట్రో చేసిన ప్రసంగంలోని భాగం)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.8. Published on December 1, 2016